08-10Pg1exHMNWJQE MN 1 GNT_08-10Pg1exHMNWJQE.qxd 10/7/2025 11:47 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 247 పేజీలు: 12 వెల: 6.50

## ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

క్వాంటం ప్రపంచాన్ని కళ్లకు కట్టిన శాస్త్రవేత్తలు

## నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

9లో


## ప్రజాజీవితంలో పాతికేళ్లు!

### ప్రభుత్వాధినేతగా 25 యేళ్లుగా సేవలు



ప్రజల జీవితాలను బలోపేతం కోసం
దేశ ఉజ్వల ప్రగతి కోసం తపన
ప్రధాని మోడీ ఎక్స్‌లో ఆసక్తికర పోస్ట్
గుజరాత్ సిఎంగా, ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవ ఫొటోలు జోడింపు

9లో



# డబుల్ సంక్షేమం

- పింఛన్ల నుంచి ఆటో డ్రైవర్ల సేవ వరకు పథకాలు విజయవంతంగా అమలు చేశాం
- ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం
- పెట్టుబడులొస్తున్నాయ్... ఉద్యోగాలు కల్పిస్తున్నాం
- డిఎస్సీ నోటిఫికేషన్‌తో టీచర్లను నియమించాం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం
- సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం
- అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా అడుగులు
- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో మరే రాష్ట్రంలో అమలు కాని స్థాయిలో రెట్టింపు సంక్షేమం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందుతోందని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. ఈ ఉదయం సిఎం చంద్రబాబు తన మజిలీ కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అమలు విజయవంతమైంది. అలాగే ప్రధాన ఎన్నికల హామీలుగా ఉన్న సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 'పేదల సేవలో' కార్యక్రమంలో 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటివద్దే పంపిణీ చేస్తూ సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థాన్ని ఇచ్చాం. తన బిడ్డ చదువుకోవాలని కలలుకనే పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'తల్లికి వందనం' పథకాన్ని తీసుకువచ్చాం. రూ.10 వేల కోట్లతో పథకాన్ని అమలు చేశాం. అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. దీపం పథకంకింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఏటా రూ.2,684 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికి 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం. స్వాతంత్ర్య దినోత్సవసందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఆడబిడ్డలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత ప్రయాణాన్ని కానుకగా ఇచ్చాం. 16,347 పోస్టులతో మెగా డిఎస్సీ నిర్వహించి నియామకాలు చేసాం. ప్రజలకు నాడు కునుకు లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం.
పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు తిరిగి తీసుకువచ్చాం. 204 అన్నా క్యాంటిన్లలో 5.16 కోట్ల మందికి రూ.5లకే కడుపునింపామన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల కనీస వేతనం రూ.25 వేలకు పెంచాం. దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లో చోటు కల్పించాం. 40 వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. మేనిఫెస్టోలో చెప్పినట్లు కల్లు గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించాం. మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఇస్తున్నాం. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1,29,178 మందికి రూ.259 కోట్లు అందించాం. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఎస్సీ సామాజిక వర్గాల్లో అంతరాలు తగ్గించేలా.. ఏ వర్గాన్ని నొప్పించకుండా, ఏ ఒక్కరూ నష్టపోకుండా ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్ష నెర

>>2

## ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్

### కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు

2లో

## నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ

### రామ్మూర్తినాయుడు సంవత్సరీక కార్యక్రమానికి హాజరు

## తిరుపతి టూ ఢిల్లీ

# ఎర్ర చందనం



ఎర్రచందనం పట్టివేత గురించి మీడియాకు వివరిస్తున్న పోలీసు అధికారులు

- ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు, ఎర్రచందనం సీజ్
- ఢిల్లీ తుగ్లకాబాద్‌లో గోదాముల్లో సోదాలు
- రెడ్ శాండిల్స్ విలువ రూ. 11 కోట్లు పైమాటే
- ఎపి డిజిపి కార్యాలయం ప్రకటన విడుదల

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నామని స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ కథనాన్ని నిర్ధారిస్తూ ఎపి డిజిపి హరీష్‌కుమార్ గుప్తా కార్యాలయంనుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. ఢిల్లీలో తుగ్లకాబాద్‌లోని గోదాములపై నిర్వహించిన దాడుల్లో సుమారు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పట్టుకున్న ఏ గ్రేడ్ చందనం విలువ సుమారు రూ. 11 కోట్ల విలువ ఉంటుందని ఈ సందర్భంగా పోలీసు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, ముంబైకి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశామనీ, హరియాణాకు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని వివరించారు. ఎర్రచందనం తిరుపతి నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించినట్టు గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఎపి, ఢిల్లీ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం భారీగా ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకుంది. ఎపి నుంచి ఢిల్లీకి తరలించిన సుమారు 10 టన్నుల ఎర్రచందనాన్ని సంబంధిత సమాచారంతో పట్టుకున్నారు.
ఢిల్లీలోని తుగ్లకాబాద్‌లో ఎర్రచందనం బయటపడింది. అంతేకాకుండా ఢిల్లీ, ఎపి పోలీసులు హైదరాబాద్, ముంబయికి చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు ఇర్ఫాన్, అమిత్‌పవార్ ఉన్నారు. అయితే హరియాణాకు చెందిన మరో ఎర్రచందనం స్మగ్లర్ పరారీలో ఉన్నాడు. ఎర్రచందనం దుంగలను తిరుపతి నుంచి ఢిల్లీకి తరలించినట్లు సమాచారం.



మంగళవారం వెంకటాచలంలో మీడియాతో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

### పార్టీ ఫిరాయింపుల చట్టానికి

## సవరణలు అవసరం

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**వెంకటాచలం (నెల్లూరు), అక్టోబర్ 7, ప్రభాత వార్త :** సిజెఐపై జరిగిన దాడిని న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా తాను భావిస్తున్నట్లు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వెంకటాచలం స్వర్ణభారతి ట్రస్ట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి పై జరిగిన దాడి శోచనీయమని దాన్ని తాను గర్హిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదని

>>2

## పుర'పాలన'

# భేషుగ్గా ఉండాలి

- మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలి
- తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్
- అర్హులందరికీ టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి
- మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాప్‌లో మంత్రి నారాయణ



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లతో ఆ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో మూడు రోజుల పాటు వర్క్ షాప్ జరుగుతుంది. ఈ వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ హాజరయ్యారు. రాష్ట్రంలోని 77 మున్సిపాల్టీల కమిషనర్లు, ఇంజినీర్లతో మూడు రోజుల పాటు వేర్వేరుగా వర్క్ షాప్ జరగనుంది. మొదటి రోజు వర్క్ షాప్‌నకు 29 మున్సిపాల్టీల నుంచి అధికారులు హాజరయ్యారు. పట్టణాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈవర్క్ షాప్‌లో ప్రధానంగా చర్చిం

>>2

### సోదరిని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని

## యువకుడి హత్య



మృతుడు గణేష్ (ఫైల్)

### గుంటూరులో ఘటన

**గుంటూరు, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి :** సోదరిని ప్రేమించి వివాహం చేసుకున్నాడని కుర్రా గణేష్ అనే యువకుడిని యువతి సోదరుడు దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గుంటూరు పొన్నూరు రోడ్డులో ఈ దారుణం జరిగింది. ఈ ఘటనలో యువతి సోదరుడుతో పాటు మరో ఇద్దరు యువకులు ఉన్నట్టు సమాచారం. తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన అంజలిదేవిని విద్యుత్ శాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్న గణేష్ ప్రేమించి 12 రోజుల క్రితం పెళ్లిచేసుకున్నాడు. రక్షణ కావాలంటూ నల్లపాడు పోలీసులను ఆశ్రయించాడు. అప్పట్లో ఇద్దరి కుటుంబాలను పిలిచి మాట్లాడారు. అంతా సద్దుమణిగిందని భావించిన తరుణంలోనే తమకుమారుడిని దారుణంగా హతమార్చారని గణేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాగ గణేష్‌ను పోలీస్ స్టేషన్లోనే చంపేస్తా అంటూ యువతి సోదరుడు దుర్గారావు హెచ్చరించాడని తెలిసింది. ఈ క్రమంలోనే గణేష్‌పై దుర్గారావు దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాల శవాగారానికి తరలించారు.

# 10 నుంచి రచ్చబండ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైఎస్సార్సీ పోరు ఉధృతం
- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ
- పార్టీ నేతలతో మాజీ సిఎం జగన్ సమావేశంలో కీలక నిర్ణయం
- 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని సందర్శించనున్న జగన్



**విజయవాడ,అక్టోబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** రచ్చబండ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తామని వైఎస్సార్సీ అగ్రనేత, మాజీ సిఎం జగన్ వెల్లడించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కనీసం ప్రతి పంచాయతీ నుంచి 500 మందితో సంతకాలు సేకరిస్తామన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. అక్టోబరు 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీని వైఎస్సార్సీ అధినేత జగన్ సందర్శించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 10 నుంచి నవంబర్ 22వరకూ రచ్చబండ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జగన్ చెప్పారు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు ఉంటాయి. నియోజకవర్గ స్థాయిలో ఉన్న అధికారికి డిమాండ్ పత్రాలను సమర్పించాలి. జిల్లా కేంద్రాల్లో నవంబరు 12న ర్యాలీలు జరుగుతాయి. ఒక జిల్లాలో నేను కూడా పాల్గొంటాను. నవంబరు 23న నియోజకవర్గ కేంద్రాల నుంచి సేకరించిన సంతకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటాయి. నవంబరు 24న సేకరించిన సంతకాలతో కూడిన వాహనాలను జిల్లా కేంద్రంలో జెండా ఊపి విజయవాడకు తరలిస్తారు. సేకరించిన ఈ సంతకాలు గవర్నర్‌కు అప్పగించే కార్యక్రమం

>>2

## ఈసారి ట్రక్కులపై టారిఫ్

### 25శాతం సుంకాలు విధింపు

### నవంబర్ 1 నుంచి అమలు

### డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

9లో

## 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

### మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

# ఐటి సోదాల కలకలం

- తెలుగు రాష్ట్రాల్లో 25 చోట్ల అధికారుల తనిఖీలు
- రూ.300 కోట్ల దాల్ ట్రేడ్ స్కాంపై ఆరా
- కొనుగోళ్లు చేయకుండానే నివేదికలు... గుర్తింపు
- కీలక పత్రాలు స్వాధీనం.. కొనసాగుతున్న దాడులు

**సచివాలయం,అక్టోబర్ 7,ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా మరోపెద్ద పప్పుల దందా వెలుగులోకి వచ్చింది. సుమారు రూ.300కోట్ల విలువైన పప్పుల వ్యాపారంలో బారీ అవకతవకలు అక్రమ నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన ఆదాయపు పన్ను మంగళవారం తెల్లవారు జామునే సోదాలు ప్రారంభించింది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, హైదరాబాద్ నగరాల్లో ఒకేసారి సోదాలు జరిగాయి. పప్పుల సరఫరా పేరుతో ప్రభుత్వ నిధులను మలచినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఐటి శాఖాధికారులు రాష్ట్రంలోని 25ప్రదేశాల్లో సోదాలు జరిపారు. విశాఖలో హిందూస్తాన్ ట్రేడర్స్, కర్నూల్లో వికేర్ గ్రూప్, గుంటూరులో మరికొన్ని ప్రముఖ పప్పు ట్రేడింగ్ కంపెనీలు దర్యాప్తు కిందకొచ్చాయి. ఒకేసారి పలు బృందాలు పనిచేయడంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర కలకలం నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లయిస్ శాఖ నుంచి టెండర్లు పొంది పెద్దమొత్తంలో పప్పులు సరఫరా చేశామని చూపించి వందల కోట్లు బిల్లు వేసుకున్నట్లు తెలిసింది. చెల్లింపులు అయిన తర్వాత సరఫరా చేయకపోవడం, తక్కువ నాణ్యత గల పప్పులు అందించడం కొన్ని చోట్ల సరఫరానే నిలిపివేయడం వంటి అంశాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

**ఎన్నికల సమయంలో భారీ క్యాష్ ఉపసంహరణలు**

దర్యాప్తులో ఐటి అధికారులు 2024ఎన్నికల ముందు పెద్దమొత్తం నగదు ఉపసంహరణలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీల వెనుక రాజకీయ సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో కూడా ఐటి వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఐటి దాడుల తర్వాత సివిల్ సప్లైస్ శాఖలోనూ చురుగ్గా కదలికలు ప్రారంభమయ్యాయి. ఏప టెండర్లు ఎవరికిచ్చారు? చెల్లింపులు ఎప్పుడు జరిగాయి.? అనే వివరాలను అధికారులు తేలుస్తున్నారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

ఈ దాడులతో రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఎవరి అనుమతితో ఈ టెండర్లు కుదిరాయి? ఎవరి మార్గదర్శకత్వంలో చెల్లింపులు జరిగాయి అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పలు కంపెనీలు పన్ను ఎగవేత, బోగస్ సరఫరా, హవాలా లావాదేవీల్లో నిమగ్నమైనట్లు ఆధారాలు లభించాయి. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం అని ఐటి అధికారులు స్పష్టం చేశారు.

08-10pg2exHMNWJQER MN 2_08-10pg2exHMNWJQER.qxd 10/7/2025 11:41 PM Page 1





మంగళవారం ఆది కవి వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

# ఆదికవి వాల్మీకికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మహర్షి,ఆది కవి వాల్మీకి జ్ఞానం సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన మహనీయుడని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.తన వ్యక్తిగత కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి సిఎం చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సిఎం స్పందిస్తూ.. సృష్టి ఉన్నంత కాలం వాల్మీకి జీవితం స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది. జ్ఞానం సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని సిఎం చంద్రబాబు కొనియాడారు.సంస్కృతంలో ఆదికవి, పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత, మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సకల జనులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. జ్ఞాన సముపార్జనకు పరిమితిలేదని నిరూపించిన మహనీయుడు వాల్మీకి మహర్షి. పరిస్థితుల ప్రభావం కారణంగా కిరాతకుడిగా వ్యవహరించినా తపస్సుతో మహనీయుడుగా మారి ప్రపంచానికి జ్ఞాన జ్యోతిని చూపించిన కారుణ్యమూర్తి ఆయన. మహర్షి వాల్మీకి జీవితం ఈ సృష్టి ఉన్నంత కాలం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఆచంద్రతారార్కం నిలబడిపోయే మహర్షి వాల్మీకి కీర్తిప్రతిష్ఠల్ని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన పూర్వజన్మ సుకృతం. వాల్మీకి మహాకవి విరచిత రామాయణ ఇతిహాసం.. సదా అనుసరణీయం.. ఆదర్శప్రాయమన్నారు. అఖండ భారతావనికి ఆదర్శప్రాయుడై నిలిచిన.. లోకాభిరాముని దివ్యచరితను లోకోత్తరం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అని తెలిపారు. కృషి ఉంటే మనుషులు.. ఋషులవుతారు.. మహాపురుషులవుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఆ మహనీయునికి ఘన నివాళిగా రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.

# సవీందర్ రెడ్డిపై తదుపరి చర్యలొద్దు

## - సిబిఐకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డి వ్యవహారంలో సిబిఐ తదుపరి కార్యాచరణ చేపట్టొద్దని సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన 'హెబియస్ కార్పస్'పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ విచారణ చేపట్టారు. సామాజిక మధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీందర్‌రెడ్డి భార్య లక్ష్మీ ప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని అరెస్టు చేసిన... గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం, దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ ఫైల్ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు.గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలు పరిగణనలోకి తీసుకుని జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు... సిబిఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డిజిపి, సిబిఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు... మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఎపి ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ త్వరలోనే చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# పుర'పాలన' భేషుగ్గా ఉండాలి

>> చారు. 2029 లోగా పూర్తి చేయాల్సిన అభివృద్ధి ప్రాజెక్ట్‌లపై అధికారులకు పలు సూచనలు చేసారు. ఆ తర్వాత పట్టణాభివృద్ధిపై అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేసారు.మున్సిపాల్టీల్లో ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,డ్రైనేజి,రోడ్లు,వీధిదీపాల నిర్వహణ పక్కాగాచేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ 85 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే తొలగించగా.. మరో 20 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను డిసెంబరు నెలాఖరుకు తొలగిస్తామన్నారు. జనవరి నుంచి ఘన వ్యర్థాలు పూర్తిగా ప్రాసెస్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలకు అదనంగా కొత్తగా మరో 6 ప్లాంట్లను ఏర్పాటుచేస్తున్నామని. ఇవన్నీ పూర్తయితే రాష్ట్రంలోని మున్సిపాల్టీలు డంపింగ్ యార్డ్ రహితంగా మారతాయన్నారు.

**ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకం: మంత్రి నారాయణ**

ప్రతిరోజూ ఇళ్లలో ఉపయోగించిన నీటితో పాటు వర్షపు నీరు కోసం కాలువల నిర్మాణం చేపడుతున్నా మన్నారు. అమృత్ పథకం 2 ద్వారా మున్సిపాల్టీల్లో రాబోయే రెండేళ్లలో 90 శాతం ఇళ్లకు తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నామన్నారు..ఇక డ్రైనేజిలు,రోడ్లు,వీధి దీపాల కోసం వివిధ పథకాల నిధులతో పాటు మున్సిపాల్టీల నిధులు వినియోగించాల్సి ఉందన్నారు.ప్రాధాన్యతా క్రమంలో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి..అమృత్,ఆసియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ ,అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ నిధుల ద్వారా డ్రింకింగ్ వాటర్,డ్రైనేజి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. మరోవైపు మున్సిపాల్టీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం,ప్రస్తుత పరిస్థితిపైనా అధికారులకు పలు సూచనలు చేసారు. నిర్మాణాలు పూర్తవుతున్న ఇళ్లను ప్రతి శనివారం లబ్దిదారులకు కేటాయించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. బుధవారం,గురువారం మరికొన్ని మున్సిపాల్టీల అధికారులతో జరిగే వర్క్ షాప్‌లోనూ మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్,టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి,ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర రావు పాల్గొన్నారు.

# సవరణలు అవసరం

>> ఆయన అన్నారు. దేశంలో పార్టీ ఫిరాయింపులు పెరిగాయని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు అని వెంకయ్య నాయుడు అన్నారు. ఈ సమస్య ఈనాటిది కాదని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉందని ఆయన అన్నారు. పార్టీ ఫిరాయించిన వారు తాము గెలిచిన పార్టీకి పదవికి రాజీనామా చేయాలన్నారు. లేదంటే వారిని పదవికి అనర్హులుగా ప్రకటించేలా 10 వ షెడ్యూల్ ను సవరించాలని ఆయన సూచించారు. లేదంటే ప్రభుత్వాలు కూలిపోయి రాష్ట్రాల్లో అస్థిరత నెలకొంటుందని తద్వారా ఆర్థిక భారం కూడా పెరుగుతుందని నాయుడు చెప్పారు. ఇది దేశ రాజకీయాల్లో ఆందోళన కలిగించే విషయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఉచిత పథకాలు అభివృద్ధి నిరోధకాలని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు తమ ఉనికి కోసం పోటీపడి ఉచిత పథకాలను ప్రకటించడమే కాకుండా అమలు చేస్తున్నాయని వెంకయ్య నాయుడు అన్నారు. ప్రజలకు భారమైన విద్య, వైద్యం ఉచితంగా అందించగలిగినప్పుడే సమాజంలో అసమానతలు రూపు మాపవచ్చన్నారు. కోర్టులు కేసుల విషయంలో వాయిదాలు ఎక్కువగా వేసి తీర్పులు జాప్యం జరిగే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేసుల విచారణలో జాప్యం జరగకుండా ఉండాలంటే మరిన్ని అదనపు కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు.

# 'సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండించాలి'

**విజయవాడ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై అగ్రవర్ణాల వారు చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృ తం కాకుండా తీవ్రంగా శిక్షి ంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నీటి అవసరత దృష్ట్యా చెక్ డ్యాముల నిర్మాణం అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కన్వీనర్ పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి ఘటనలు ఇంకెప్పుడు జరగకుండా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇది న్యాయ వ్యవస్థకే సిగ్గుచేటన్నారు.

సుప్రీం కోర్టు జడ్జికే రక్షణ కరువైందని ప్రజలు వారి మనోవేదనకు గురయ్యారన్నారు. గత 180 ఏళ్ల చరిత్రలో వరుసుగా 3 లేదా 4 సంవత్సరాలు వర్షాలు పడకపోవడం వల్ల కరువు తాండవించిన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. రాజధాని అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నీటి అవసరం పెరిగిందన్నారు. లక్షల క్యూసెక్కుల నీరు వర్షాకాలంలో సముద్రం పాలవుతుందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో నదులు అనుసంధానం జరుగుతుం దన్నారు. కానీ రాష్ట్రంలో నీటి ప్రాజెక్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అశ్రద్ధ వహిస్తుందన్నారు. జగ్గయ్యపేట నుండి కృష్ణానదిపై చెక్ డ్యాముల నిర్మాణం ద్వారా నీటి లభ్యత పెంచుకోవచ్చు అన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి అనేక మార్లు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే రిపబ్లిక్ అన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.

# డబుల్ సంక్షేమం

>> వేర్చాం. 'అడవితల్లి బాటలో' కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టాం. మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో కనెక్ట్ చేస్తున్నాం. ఇమామ్‌లకు రూ.10,000, మోజన్లకు రూ.5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నాం అని వివరించారు.భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తున్నాం. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి సకాలంలో పనులు జరిగేందుకు సహకరించింది. ప్రకాశం జిల్లాను కరువు నుంచి బయటపడేసే వెలుగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. వచ్చే ఏడాది జులై కల్లా సాగునీరు ఇచ్చేలా ప్రాజెక్టు పనులు చేస్తున్నాం. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృథా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించాం. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వినియోగిస్తాం. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లదు. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే దిగువ రాష్ట్రంగా ఆ నష్టాలను, కష్టాలను భరిస్తున్నాం. దిగువ రాష్ట్రంగా అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకు? వరదను భరించాలి కానీ, వరద నీటితో ప్రయోజనం పొందకూడదంటే ఎలా కుదురుతుంది? గ్రామీణ ప్రాంతాల్లో 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 250 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించాం. 2028 నాటికి 'జల జీవన్ మిషన్' కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత మంచినీరు అందిస్తాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ అనేది మా విధానం. ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్, రియల్ టైమ్ మానిటరింగ్ విధానాలతో ప్రజారోగ్యానికి సంజీవనిగా వైద్యశాఖను తీర్చిదిద్దాం. మానవత్వంతో స్పందించి సీఎం సహాయ నిధి నుంచి ఇప్పటివరకూ రూ.552 కోట్లు అందించాం.

రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్లుగా నగరాలు, పట్టణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. 100 గజాల్లోపు స్థలాల్లో ఎటువంటి బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటిని నిర్మించుకునే అవకాశాన్ని కల్పించాం. ఎపి బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయం. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించాం.113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. దేవాలయాలు సంస్కృతికి చిహ్నాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు.. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నాం. అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచాం. ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూస్తున్నాం. ఉచిత ఇసుక విధానం అమలు చేసి.. భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మద్యం పాలసీని రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం.నవ్యాంధ్రకు దిగ్గజ ఐటీ కంపెనీలైన గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ప్రజాపాలనలో సాంకేతికతను విస్తృతం చేశాం. వాట్సప్ గవర్నెన్స్-మన మిత్ర ద్వారా పరిపాలనలో కొత్తదనాన్ని తీసుకువచ్చాం. 700 పౌర సేవలు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన నారా వారి పల్లె గ్రామానికి తన తమ్ముని సంవత్సరీకాల్లో పాల్గొనేందుకు వెళ్లారు.

# 10 నుంచి రచ్చబండ

>> తదుపరి జరుగుతుంది అని వైఎస్ జగన్ తెలిపారు. వైఎస్సార్సీ హయాంలో విద్యార్థుల డ్రాపౌట్లు లేవు. కూటమి పాలనలో ప్రభుత్వ స్కూళ్లలో ఐదు లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారు. రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కుతున్నారు. ఎరువుల పంపిణీలో కూడా స్కాంలు జరుగుతున్నాయి. దళారీలతో చేతులు కలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిగా దెబ్బతీశారు. పేదలను ఇంకా అన్యాయం చేస్తున్నారు. వారిని మరింత పేదరికంలోని నెడుతున్నారు అని జగన్ మండిపడ్డారు.

భవిష్యత్తులో కూడా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందనీయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. ప్రతి జిల్లాల్లో గవర్నమెంటు కాలేజీ ఉండాలన్న సంకల్పంతో వైఎస్సార్సీ హయాంలో 17 మెడికల్ కాలేజీలు పెట్టాం. ప్రభుత్వం స్కూళ్లు, ఆస్పత్రులు, బస్సులు ఎందుకు నడుపుతుంది? అలా చేయకపోతే ప్రైవేటు వాళ్లు ప్రజలను దోచుకుంటారు. ఇవి నడపకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయాన్ని ప్రజలకు బాగా అర్థమయ్యేలా చెప్పాలి అని జగన్ సూచించారు. అమరావతికి 50వేల ఎకరాలు సరిపోవని, మరో 50వేల ఎకరాలు సిఎం చంద్రబాబు సేకరిస్తున్నారు. మొదటి 50 వేల ఎకరాలకే మౌలిక సదుపాయాల కోసం రూ.1లక్ష కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు కేవలం మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు అవుతుందని చెప్తున్నారు. అలాంటి లక్షల మందికి, కోట్ల మందికి వైద్యం అందించి, చిరస్థాయిగా నిలబడే ఆస్తులైన మెడికల్ కాలేజీలను అప్పనంగా అమ్మేస్తున్నారు? ఐదేళ్లలో రూ.5వేల కోట్లు పెట్టలేరా? ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి, ప్రజల్లో చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది అని నేతలను ఉద్దేశించి జగన్ అన్నారు.

**వైయస్ జగన్‌ను కలిసిన కాకినాడ మత్స్యకారులు**

బోటు కొనుక్కోవడానికి కన్యాకుమారి వెళ్లి, బోటుతో సహా తిరిగి వస్తుండగా, తమ జలాల్లోకి ప్రవేశించారంటూ కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులను శ్రీలంక కోస్టుగార్డు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో బోటులో చేపలు కూడా లేనప్పటికీ, వారిని శ్రీలంక కోర్టులో ప్రవేశపెట్టడంతో జైలుకు పంపారు. విషయాన్ని ఇక్కడ తమ వారికి తెలియజేయడంతో, వైయస్సార్ నాయకుడు, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. ఇక్కడి అధికారులకు పూర్తి వివరాలు చెప్పి, శ్రీలంక అధికారులకు సమాచారం పంపించారు. దీంతో 54 రోజుల తర్వాత కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు శ్రీలంక జైలు నుంచి విడుదలయ్యారు.

శ్రీలంక జైలు నుంచి తమ విడుదలకు చొరవ చూపించిన ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసిన వారు, మంగళవారం వైయస్సార్సీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీమంత్రులు కురసాల కన్న బాబు, దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో వైయస్ జగన్‌ను కలిసిన మత్స్యకారులు పంతాడ బ్రహ్మానందం, పి. శ్రీను.. తాము శ్రీలంక చెర నుంచి వైయస్సార్సీ చొరవ వల్లే బయటపడినట్లు చెప్పారు. వైయస్సార్సీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చక్రవర్తి, కృష్ణా జిల్లా మత్స్యకార సంఘం నాయకుడు కోలా హరికృష్ణ తదితరులు వైయస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## వారం - వర్జ్యం

08-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
విదియ రా.2.23
అశ్విని రా.10.44
వర్జ్యం : ఉ.7.16-8.41
దు.ఉ.11.32-12.20
శుభసమయం: ఉ.5.30-6.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**వృషభం:** ఆరాధనలు, యాత్రలు సంభవము. ఏకాంత చర్చలకు అనుకూలమైన సమయము.

**మిథునం:**విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కర్కాటకం :**దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**సింహం:** భూములు, స్థలాలు కొనుగోలు యత్నాలు చేస్తారు. సోదరుల కలయిక.

**కన్య :**కోర్టుకేసుల నుండి బయటపడుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

**తుల :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**వృశ్చికం:** శత్రువులు సైతం, మిత్రులుగా మారతారు. ప్రయాణాలు.

**ధనుస్సు:** మాటలచాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.

**మకరం:** వృత్తి, ఉద్యోగాలలో మీ బుద్ధికుశలత బాగా లాభిస్తుంది.

**కుంభం:** బంధు మిత్రుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మీనం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం నారావారిపల్లెలో రామ్మోహన్‌నాయుడు సమాధివద్ద చంద్రబాబు కుటుంబసభ్యుల నివాళి

# నారావారిపల్లెలో బాబు ఫ్యామిలీ

## రామ్మూర్తినాయుడు సంవత్సరీక కార్యక్రమానికి హాజరు

**చంద్రగిరి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** దివంగత మాజీ ఎంఎల్ఎ నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక (11వ నెల విస్తరి) కార్యక్రమం (మొదటి వర్ధంతి)బ్రాహ్మణులు హైందవ సంప్రదాయ పద్ధతిన జరిపించారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, నారావారిపల్లిలోని తమ నివాసంలో మంగళవారం జరిగిన సంవత్సరిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరీ, నారా లోకేష్ హాజరై ఆధ్యంతం కార్యక్రమాన్ని తిలకించి, నివాళులర్పించారు. సినీ హీరో, రామ్మూర్తి నాయుడు తనయుడు నారా రోహిత్, నారా గిరీష్‌లు సంయుక్తంగా తండ్రి సంవత్సరిక కార్యక్రమంలో సంతర్పణలు సమర్పించారు. అనంతరం స్మృతివనం వద్దకు చేరుకున్న చంద్రబాబు, భువనేశ్వరీ, లోకేష్, రోహిత్, గిరీష్, కుటుంబ సభ్యులు దివంగత నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కర్పూరహారతులిచ్చి, నివాళులర్పించారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున నారావారి బంధుమిత్రులు హాజరై దివంగత నారా రామ్మూర్తి నాయుడుకు నివాళులర్పించారు.

# చార్జిషీట్ వేయడానికి ఇంకెన్నాళ్లు కావాలి?

## నల్లపాడు పోలీసుల తీరుపై హైకోర్టు అసంతృప్తి

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులపై ఎపి హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.ఓ యువతి అనుమానాస్పద మృతి కేసులో దర్యాప్తు పూర్తి చేసినప్పటికీ అభియోగపత్రం/తుది నివేదికను సంబంధిత కోర్టులో దాఖలు చేయకపోవడంపై నల్లపాడు పోలీసుల వ్యవహార సరళి సరిగ్గా లేదని వ్యాఖ్యానించింది. భవనంపై నుండి పడిపోయినట్లు అనుమానాస్పద పరిస్థితులో చనిపోయిన మృతురాలే వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసులు కొత్త కథ అల్లారని పేర్కొంది. ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి ఆ యువతి మృతి చెందితే ఆమె మరణ వాంగ్మూలాన్ని ఎవరు ఎలా నమోదు చేశారని పోలీసులను ప్రశ్నించింది. కోర్టులన్నా, కోర్టు ఉత్తర్వులన్నా,సిబ్బందన్నా పోలీసులకు గౌరవం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించి వాదనలు వినిపించేందుకు పిటీషనర్ తరపు న్యాయవాదికి సమయం ఇస్తూ విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా బుడంపాడు సెయింట్ మేరీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న గర్నెపూడి శ్రావణసంధ్య (17) కళాశాల వసతి గృహం లోని 4వ అంతస్థు నుంచి పడిపోయారని వార్డెన్ నుండి తల్లిదండ్రులకు 2017 ఫిబ్రవరి 28న ఫోన్‌కాల్ అందింది. ఈ వ్యవహారంపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు దర్యాప్తు సక్రమంగా చేయడం లేదని సిబీఐ లేదా సిఐడికి కేసు ఇవ్వాలని మృతురాలి తల్లి జయలక్ష్మి 2017 జులైలో హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఇటీవల వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు...దర్యాప్తును సీబీఐకి ఇవ్వడానికి ఇది సముచితమైన కేసు అని అభిప్రాయపడింది. సోమవారం జరిగిన విచారణలో పోలీసుల తరపున హోం శాఖ జీపీ జయంతి వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తు పూర్తి చేశామని తెలిపారు. అలా అయితే ఛార్జిషీట్ ఎందుకు వేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్న కారణంగా దాఖలు చేయలేదని జిపి బదులివ్వగా అభియోగపత్రం దాఖలు చేయకూడదంటూ కోర్టు నుంచి నిషేధ ఉత్తర్వులు ఏమీ లేవు కదా అని పోలీసులను న్యాయమూర్తి ప్రశ్నించారు.

# సిజెఐపై దాడిని ఖండించిన సిఎం, డి.సిఎం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ పై కోర్టులో జరిగిన దాడిని సిఎం, డి.సిఎంలు ఖండించారు. చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై కోర్టులో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తునట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో చేసిన పోస్టులో ఇటువంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని, నాగరిక, ప్రజాస్వామ్య సమాజంలో వాటికి స్థానం లేదని పేర్కొన్నారు. మన న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం ప్రజాస్వామ్యంలో ప్రథమ కర్తవ్యమన్నారు.

**దాడికి యత్నించడాన్ని ఖండిస్తున్నాం: డి.సిఎం పవన్**

సుప్రీంకోర్టు సిజెఐపై కోర్టు లోపల దాడికి జరిగిన ప్రయత్నాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సనాతన జ్ఞానం వ్యవహార (చట్టానికి కట్టుబడి ఉండటం), రాజ్యాంగబద్ధమైన చట్టానికి లోబడి ఉండాలని కోరుతుందన్నారు.

**దాడి సిగ్గుచేటు : లోకేష్**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం సిగ్గుచేటని విద్యాశాఖ మంత్రి లోకేష్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను బెదిరించే ఇటువంటి ప్రయత్నాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, వాటిని కఠినంగా ఎదుర్కోవాలని ఆయన పేర్కొన్నారు.

**అత్యున్నత న్యాయ సంస్థకు అవమానం: జగన్**

ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, అత్యున్నత న్యాయ సంస్థకు జరిగిన అవమానమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

**సనాతనం పేరుతో దాడి : ఆలిండియా లాయర్స్ యూనియన్ ఖండన**

సుప్రీం కోర్టు సిజెఐ గవాయ్ పై కోర్టులో దాడికి యత్నించడాన్ని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు కె కుమార్, ఎన్ మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# మోహిత్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ నేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు.. ఈ మేరకు మోహిత్ రెడ్డి పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టుకొట్టివేసింది. మద్యం కుంభ కోణంకేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయిం చారు. తుడా చైర్మన్‌గా ఉండగా మద్యం ముడుపులు తరలించేందుకు అధికార వాహనాలు వాడారనేది తనపై ఆరోపణలు ఉన్నాయి. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేసులో ఇరికించారని, దర్యాప్తుకు సహకరిస్తానని, కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటానని మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశాలు పరిగణనలోకి తీసుకొని తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఇవాళ విచారణ చేపట్టి న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# ప్రజారోగ్యంపై స్పెషల్ ఫోకస్

## నేటినుంచి 45 రోజుల పాటు శిబిరాలు

**కుప్పం, అక్టోబరు 7 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న విషయం విదితమే. ఇప్పటికే కుప్పం ప్రజల సౌకర్యార్థం రాష్ట్రంలోనే తొలిసారిగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డిఐఎన్‌సి)ను ప్రారంభించారు. ఇప్పుడు మరో మారు కుప్పంలో సార్వత్రిక ఆరోగ్య పరీక్షలు పేరిట మరో కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. బుధవారం నుంచి కుప్పం నియోజకవర్గంలో 45 రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.కుప్పం నియోజక వర్గ ంలోని తొమ్మిది పిహెచ్‌సి కేంద్రాలు, కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. ప్రజలకు బిపి, చక్కెర వ్యాధి, కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, కాలేయం పరీక్షలు,సిబిసి పరీక్షలతో పాటు రక్తాన్నిసేకరించి 47 రకాల రక్త, ఇతర వైద్య పరీక్షలు చేయనున్నారు. తద్వారా ఎవరెవరికి ఏయే వ్యాధులు ఉన్నాయో గుర్తించి తదనంతరం వారికి అవసరమైన వైద్య చికిత్సలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే ప్రజల ఆరోగ్య వివరాలన్నీ డిజిటలైజ్ చేయనున్నారు. వీటిని కేంద్ర ప్రభుత్వం యొక్క అభా కార్డుతో అనుసంధానం చేస్తారు. సుమారు తొంభై వేలమందికి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. కాగా కుప్పం ప్రాంతంలోని ప్రజల సౌకర్యార్థం ఇదివరకే సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో బసవతారకం ఇండో - అమెరికన్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో గత నెలలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సైత ంచేపట్టిన విషయం విదితమే. ఏది ఏమైనా కుప్పం ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

08-10Pg3exHMNWJQEBVTPKS G O 3RD_08-10Pg3exHMNWJQEBVTPKS.qxd 10/8/2025 12:15 AM Page 1



# స్వచ్ఛతకు పురస్కారాల పట్టం

## - ఎన్‌టిఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు


## - సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఎన్టీఆర్ జిల్లా విజేతలు..



సిఎం చంద్రబాబు చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు పట్టం కడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు2025లో ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపులో ఉన్న ఎన్‌టీఆర్ జిల్లాకు ఎనిమిది రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర పురస్కారాలను విజేతలకు అందజేశారు. మొత్తం 69 రాష్ట్రస్థాయి పురస్కారాల్లో ఎనిమిది పురస్కారాలు ఎన్‌టీఆర్ జిల్లాకు లభించాయి. ప్రత్యేక కేటగిరీ అవార్డులు (స్వచ్ఛ సర్వేక్షణ్)లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, స్వచ్ఛ కాలనీల విభాగంలో విజయవాడలోని కేపీ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో విజయవాడ హెచ్‌బీ కాలనీ యూపీహెచ్‌సీ, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, స్వచ్ఛ అంగన్వాడీలు విభాగంలో కేదారేశ్వరపేట 3 అంగన్వాడీ కేంద్రం, స్వచ్ఛ బస్ స్టేషన్ల విభాగంలో విజయవాడ బస్ స్టేషన్, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో విజయవాడ కృష్ణలంకలోని వీఎంఆర్‌ఆర్ (జి) మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, స్వచ్ఛతా ఎన్‌జీవోలు కేటగిరీలో రైజ్ సంస్థ అవార్డులు సాధించగా ఆయా సంస్థలు, పాలనా యూనిట్ల ప్రతినిధులు గౌరవ ముఖ్యమంత్రి చేతులుమీదుగా అవార్డులతో పాటు అభినందనలు అందుకున్నారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ముందడుగు వేస్తూ స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో ఎన్‌టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలిపినందుకు అధికారులు, సిబ్బందికి కలెక్టర్ లక్ష్మీశ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారాలు స్ఫూర్తిగా జిల్లాను మరింత స్వచ్ఛత దిశగా నడిపించాలని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధం, పరిశుభ్రతలో చేసిన విశేష కృషిని గుర్తించేందుకు, స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగస్వామ్య పక్షాలను కీలకపాత్ర పోషించేలా ప్రోత్సహించేందుకు, సంస్థలు, పాలనా యూనిట్ల మధ్య ఆరోగ్యకర పోటీని ప్రోత్సహించేందుకు, పారిశుద్ధం, పరిశుభ్రతలో అత్యుత్తమ విధానాలు, ఆవిష్కరణల ప్రదర్శనకు, స్వచ్ఛాంధ్రలో ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు దోహదం చేస్తాయన్నారు.

## ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణను ఎపిపిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్కారం



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ళ. నారాయణ పదవి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను ఏపీ పిటిడి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ. శేషగిరిరావు ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సంవత్సరంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో అన్ని వర్గాల మహిళలకు ప్రయోజనం చేకూర్చే ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం శ్రీశక్తి పథకం చైర్మన్ కొనకల్ల నారాయణ ఆధ్వర్యంలో అమలు జరిగి విశేష ప్రజాదరణ పొందుతూ కోట్లాదిమంది మహిళలకు లబ్ధి చేకూరుతున్న సందర్భంగా వారికి అభినందనలు తెలియజేసారు. ఆయనను ఘనంగా సత్కరించారు.. కార్యక్రమంలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) విజిలెన్స్ సెక్యూరిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుడి.అంకినీడు, పి.వెంకటేశ్వరరావులు శుభాకాంక్షలు తెలిపారు.

## 9న పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




**విజయనగరం, అక్టోబర్ 7 (ప్రభాతవార్త ప్రతినిధి);** ఈ నెల 9వ తేదీన శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గోవా గవర్నర్, మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు చేతులమీదుగా ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా, అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రి ఆనం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనాలు పలికి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ విజయనగరంలోని మూడు లాంతర్ల కూడలిలో వెలసిన ఈ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగి ఉందని, ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా, పూసపాటి రాజవంశీయుల ఇష్టదైవంగా అమ్మవారు ఆరాధింపబడుతున్నారు అంటే అమ్మవారి గొప్పతనం ఏంటో అర్థం అవుతుందని పేర్కొన్నారు. 1758లో ప్రారంభమైన సిరిమానోత్సవం, నేటికీ అదే ఉత్సాహంతో, అదే విశ్వాసంతో సాగుతోందని, ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కోరికలు నెరవేరేలా ప్రార్థనలు చేస్తారని, ఈ ఉత్సవం కేవలం భక్తి పండుగ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక వేడుకగా కూడా నిలిచింది అని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. ఈ ఏడాది అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవం గా ప్రారంభం అయ్యాయని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి దేవాదాయ శాఖ మంత్రి హోదాలో పట్టు వస్త్రాలు సమర్పించడానికి తనను పంపిందని, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అనేది తన పూర్వజన సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. మంత్రి వెంట జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసన సభ్యురాలు అదితి గజపతి రాజు, జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో ఘనంగా పైడితల్లి ఉత్సవం

### హాజరైన లక్షలాది మంది భక్తులు - వర్షం కురిసినా చెక్కు చెదరని భక్తజనం

### కోట బురుజు పైనుంచి సిరిమానును తిలకించిన గవర్నర్ అశోక్ గజపతి రాజు, మంత్రులు

**విజయనగరం,అక్టోబరు 7 ( ప్రభాతవార్త ప్రతినిధి) :** విజయనగరం ఇలవేల్పు,ఉత్తరాంధ్రా కల్పవల్లి శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవం మంగళవారం అత్యంత వైభవంగా,కన్నుల పండువగా జరిగింది. విజయదశమి తర్వాత వచ్చే మంగళవారం సాంప్రదాయంగా ఏటా జరుగుతున్న సిరిమానోత్సవ సంబరం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా భక్తుల కేరింతలు,కోలాహలం నడుమ ప్రశాంతంగా, ఉత్సాహంగా ముగిసింది.ఎప్పటిలాగానే పైడితల్లమ్మ ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానుకు చివరి ఏర్పాటుచేసిన ఆసనాన్ని అధిరోహించిన తర్వాత మంగళవారం సాయంత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పూజలు చేసిన తర్వాత సాయంత్రం 4.23 గంటలకు సిరిమాను యాత్ర ప్రారంభమయింది.సిరిమానుకు ముందు తెల్ల ఏనుగు, బెస్తవారివల, అంజలి రథం కిట కిట లాడిన బక్తులతో కదలగా వాటిని అనుసరించి సిరిమాను కదిలింది.ఆలయ పూజారి వెంకటరావు అధిరోహించిన తర్వాత సిరిమాను పైడితల్లిమ్మ దేవాలయం వద్ద ప్రారంభమై కోట ముఖ ద్వారం వద్దకు వెళ్లి తిరిగి వెనక్కు తిరిగింది. సాయంత్రం 5.40 గంటల సమయంలో మూడో సారి సిరిమాను ఊరేగింపు తర్వాత యాత్ర ముగిసింది. గట్టిపోలీస్ బందోబస్తు మధ్య ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవం విజయవంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ప్రతి ఏటా లాగానే ఈ ఏడాది కూడా సిరిమానోత్సవానికి వచ్చిన భక్తుల సంఖ్య అధికంగా కనిపించింది.



సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు , మూడో సారి సిరిమాను తిరిగిన తర్వాత వర్షం కురిసినప్పటికి భక్తులు మాత్రం కదలకుండా సిరిమానును తిలకించడం గొప్ప విషయం. విధుల్లో ఉన్న పోలీసులు, మీడియా ప్రతినిధులు, ఇతర శాఖల ఉద్యోగులు తడిసి ముద్దయ్యారు. పైడితల్లమ్మ దేవస్థానం అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తన కుటుంబీకులతో కలిసి కోట బురుజు పై నుంచి సిరిమానోత్సవాన్ని తిలకించారు. పూసపాటి వంశీయులు ఏటా కోట బురుజుపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి ఉత్సవాన్ని తిలకించడం ఆనవాయితీగా వస్తున్నది.

### వేడుకగా ఇంద్రకీలాద్రి

## గిరి ప్రదక్షిణ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 7, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం నాడు ఉదయం పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. శ్రీ స్వామి అమ్మవార్లు ప్రత్యేక రథం పై ఆసీనులై భక్తులను అనుగ్రహించారు. ఇఓ వికె శీనా నాయక్ తో పాటు వేదపండితులు, అర్చకస్వాములు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం 5.55లకు శ్రీ కామధేను మాత ఆలయం వద్ద ప్రారంభమై విద్యాధరపురం, కుమ్మరిపాలెం, నాలుగు స్థంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరీ, కెబిఎన్‌కాలేజ్, బ్రాహ్మణవీధి ల గుండా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు. దుర్గమ్మవారికి భక్తులు దసరా ఉత్సవాల్లో హుండీల ద్వారా సమర్పించిన కానుకలను రెండవరోజు మంగళవారం లెక్కించగా రు.6,73,02,813 ల నగదు, 387 గ్రాముల బంగారం, 9కెజిల 450గ్రాముల వెండి, లభించాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

# 'తులాభారం' కానుకల స్కామ్ పురోగతి ఏదీ?

**- ఐదునెలలుగా ఉలుకూపలుకూలేని విచారణ !**


**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ కోరికలు తీరినవెంటనే చెల్లించుకునే తులాభారం కానుకలు స్కామ్ జరిగిందనే ఆరోపణలపై పురోగతి ఏమైందనేది పెద్దసంఖ్యలో శ్రీవారి భక్తుల్లో చర్చమొదలైంది. అసలు ఈ స్కామ్ దర్యాప్తు ఉలుకూపలుకూలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆపదమొక్కులవాడు... ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు చెల్లించే తులాభారం కానుకలు గత ఐదేళ్ళ వైసిపి పాలనలో పక్కదారిపట్టాయంటూ ఏకంగా తాజా బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు టిటిడిలో గతమేనెలలో సంచలనం కలిగించింది. దేశవిదేశాల్లో ఉన్న వెంకన్న భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓ వైపు భక్తుడు, మరోవైపు నాణేలు, చక్కెర, బెల్లం, కలకండ,డ్రైఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు మొక్కుబడులుగా వేస్తారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు. ఇక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి. ఈ చెల్లించిన నగదు గత ఐదేళ్లలో సగంవరకు వెంకన్న ఖజానాకు చేరలేదనేది బహిరంగమైన ఆరోపణలు. ఇలా రోజుకు ఐదులక్షల నుండి 10లక్షల రూపాయల వరకు తులాభారంకానుకలు అందుతాయనేది టిటిడి సమాచారం. ఈ మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. అయితే గత ఐదేళ్లలో సగం ఆదాయం టిటిడికి జమకాలేదనేది ఇప్పటికే సంచలనంగా మారినా దానిపై విచారణ ఎంతవరకు వచ్చిందనేది భక్తుల్లోనూ ఆసక్తికరమైన అంశంగా మారింది. టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి తులాభారం కానుకలు స్వాహా చేశారంటూ ఆధారాలతో సహా ప్రభుత్వ విజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంకు గత మేనెలలోనే ఫిర్యాదు చేయడం హాట్‌టాఫిక్ అయ్యింది. శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా సమర్పించుకునే కానుకల్లో నిలువుదోపిడీ మొక్కులు, తలనీలాలు, కాలినడక,తులాభారం అంటే ఎంతో ప్రియం. భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగానేగాక విదేశాల్లో ఉన్న భక్తులు ,ప్రముఖులు కూడా తమకు ఏదేనికష్టం వస్తే ముడుపుకట్టి తిరుమలేశునికి మొక్కుకుంటారు. కష్టాల నుండి బయటపడగానే కొండకు చేరుకుని మొక్కుతీర్చుకుంటున్నారు. ఇలా రోజువారీగా హుండీకి సుమారుగా 4కోట్ల రూపాయలు కానుకలు చేకూరుతుంటాయి. ఇక తులాభారం మొక్కుల్లో 10లక్షల వరకు ఆదాయం వస్తుందని టిటిడి వర్గాలు చెబుతున్న లెక్కలు. ఆలయంలోపల మహద్వారం దాటగానే ధ్వజస్తంభానికి పక్కన తులాభారం ఉంటుంది. కోరికలు నెరవేరిన భక్తులు పిల్లలకేగాకుండా పెద్దలకు కూడా తులాభారం వేస్తారు. గత ఐదేళ్లలో తులాభారం కానుకలు సగానికిపైగా గత టిటిడి పాలకమండలి పెద్దల జేబుల్లోకి వెళ్ళిందని భానుప్రకాశ్‌రెడ్డి ప్రధాన ఆరోపణ. వందమంది వరకు భక్తులు ప్రతిరోజూ తులాభారం మొక్కులు తీర్చుకోవచ్చని అంచనా. గతంలో తులాభారం వద్ద బ్యాంకు కాంట్రాక్టు సిబ్బంది విధులు నిర్వహించేవారన్నారు.

## ఆపన్న హృదయం పథకానికి విరాళాల సేకరణ

**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం విద్య,వైద్య రంగాల్లోనూ అందిస్తున్న సేవలకు ధీటుగా తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో నిరుపేద పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తోంది. ఇందుకోసం అయ్యే ఖర్చును టిటిడి దాతల నుండి సేకరించే దిశగా ఆలోచన చేసింది.గుండె శస్త్రచికిత్సల కోసం దేశవ్యాప్తం నుండి కూడా తిరుపతిలోని టిటిడి పద్మావతి చిన్నపిల్లల హృదయాలయలకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికే దాదాపు 2వేలకుపైగా ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చేసింది. ఇప్పటికే పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అమలవుతున్న శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం పథకం క్రింద ఒకలక్ష రూపాయలు(1లక్ష)దాత విరాళం అందిస్తే , నిరాదరణకు గురైన నిరుపేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా అవసరమైన ఆపరేషన్ చేసే సదుపాయం ఉంది. నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్టు ఏర్పాటుకు సంబంధించి కూడా టిటిడి ఆలోచన చేస్తోంది. చిన్నపిల్లలను దైవసమానులుగా భావించి, ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే చిన్నారులకు చక్కటి వైద్యసేవలు మెరుగు పరిచేందుకు ఈ పథకం దోహదపడుతుంది. చిన్నపిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో బాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్యపరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లుకు దాతలు విరాళాలందించేలా టిటిడి ప్రోత్సాహిస్తోంది. దక్షిణభారతదేశంలోనే చిన్న పిల్లలకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు, గుండె మార్పిడి చికిత్సలందించేందుకు గతంలోని వైసిపి ప్రభుత్వం తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంను నెలకొల్పింది.

# విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక కార్యక్రమాలు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో పాలస్తీనాకు మద్దతుగా సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాలస్తీనా ప్రజల విమోచనా పోరాటానికి మద్దతుగా, గాజాపై గత రెండేళ్లుగా ఇజ్రాయెల్ చేస్తున్న జినోసైడ్ కు నిరసనగా పాటలు, కవితలు, నినాదాలతో విజయవాడ లెనిన్ సెంటంలో స్వరాలు దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనించాయి. ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా దేశవ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడలో ఈ సాంస్కృతిక సాయంత్రం కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో కార్యకర్తలు, విద్యార్థులు, యువత, ప్రొఫెషనల్స్ హాజరై పాటలు, కవితలు, నినాదాలు, పోస్టర్లు, సందేశాలు, ప్రసంగాల ద్వారా పాలస్తీనాకు సంఘీభావం తెలియజేశారు.ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీనా కార్యకర్త అమూల్య మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న మారణకాండలో 60 వేల మందికి పైగా ప్రజలు మరణించారని, అందులో 20 వేల మంది చిన్నారులేనని అన్నారు. ఈరోజు మనమంతా మనుషులుగా ఉండడం అంటే ప్రాణాలు కోల్పోతున్న గాజా పిల్లలు పక్షాన నిలబడడమే నన్నారు. ఈ అమానవీయ హత్యాకాండకు సాయ పడుతూ, ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల లాభపడుతున్న కంపెనీలను బాయ్‌కాట్ చేయాలనే పిలుపునిస్తూ ప్రపంచవ్యాప్తంగా బిడిఎస్ ఉద్యమం జరుగుతుందనీ, ఇందులో అందరూ భాగం అవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్. రఘు మాట్లాడుతూపిల్లలను, స్త్రీలను చంపడంభావితరం లేకుండా చేస్తున్నారన్నారు.



# తిరుమల సమాచారం

## 20న దీపావళి ఆస్థానం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం ఈనెల 20వతేదీ సోమవారం నిర్వహిస్తున్నారు. దీపావళిపండుగ సందర్భంగా ఈ వైదిక కార్యక్రమం చేపడతారు. దీపావళిరోజు 20వతేదీ సోమవారం ఉదయం బంగారువాకిలిలో ఘంటా మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఆస్థానంలో భాగంగా మలయప్పస్వామి శ్రీదేవిభూదేవులతో కలసి ఘంటా మండపంలో ఏర్పాటుచేసిన సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపుచేస్తారు. సేనాధిపతి విశ్వక్సేనులు స్వామివారి ఎడమపక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపుచేస్తారు. ఆ తరూవాత స్వామికి ప్రత్యేక పూజ,హారతి, ప్రసాద నివేదనలను అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది.

సాయంత్రం ఉత్సవర్లు సహస్ర దీపాలంకారసేవలో పాల్గొని ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. కాగా సోమవారం దీపావళి ఆస్థానం సందర్భంగా ఆలయంలో జరిగే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలు రద్దయ్యాయి. సుప్రభాతం, అర్చన,తోమాల సేవలు ఏకాంతంగా జరుగుతాయి.

## నిండు పున్నమిన గరుడునిపై గోవిందుడు



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఆశ్వయుజ మాసం పౌర్ణమివేళ మంగళవారం సాయంత్రం మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకుని సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్న మలయప్ప అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేషఅలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ వాహనసేవలో టిటిడి ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా పదిరోజుల వ్యవధిలో మళ్ళీ మంగళవారం 108 వైష్ణవదివ్యదేశాలలో గరుడసేవ భక్తులకు మోక్షం కలిగిస్తుంది.

## శాస్త్రోక్తంగా దత్తమందిరంలో చండీహోమం



**తిరుపతి,అక్టోబర్ 7ప్రభాత వార్తప్రతినిధి:** ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు మొగిలిచెర్ల దత్తాత్రేయమందిరంలో శాస్త్రోక్తంగా ఛండీహోమం జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు గణపతి హోమం, పుణ్యాహవచనం చేసిన తరువాత వేదమంత్రోచ్చరణల నడుమ గృహస్థ భక్తులతో హోమాన్ని జరిపించారు. భక్తులే స్వయంగా పాల్గొని ఛండీహోమం చేయడంతో భక్తితో ముక్తిని పొందారు. హోమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ ,ఇడి విష్ణుకౌశిక్‌లు ప్రసాదం అందించారు. అనంతరం దత్తాత్రేయస్వామి దర్శనం భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరిగింది.

## తిరుమలలో భారీ వర్షం



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం ఉన్నఫళంగా రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో తిరుమల ఆలయం ముందు, మాఢవీధులు వర్షపునీటితో నిండిపోయాయి. ఆలయం మాఢవీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాంభగీచా అతిథిగృహాలు, హెచ్‌టి కాంప్లెక్స్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్,ఎస్ఎన్‌సి ప్రాంతాల్లో వాననీరు చేరింది. భారీ వర్షంతో తిరుమల పూర్తిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంటనుండి మూడుగంటల వరకు జోరువాన కురిసింది. ఆలయంలోనికి వెళ్ళే భక్తులు వర్షానికి తడుస్తూ స్వామివారి దర్శనానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆలయం నుండి వెలుపలకు వచ్చిన భక్తులు తడిసి ముద్దయ్యారు. గదులకు చేరుకోవడానికి ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటి ఘాట్‌లో,తిరుమలకు చేరుకునే రెండోఘాట్‌లో వాననీరు జోరుగా ప్రవహించింది. వాతావరణం పూర్తిగా మారిపోయి చల్లటిగాలులు వీస్తున్నాయి.

## స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో మెప్మాకు అరుదైన గౌరవం



సిఎం చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న మెప్మా అధికారులు,ఇతరులు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక అభివృద్ధిలో తమదైన ముద్ర వేస్తూ, పట్టణ పేదల సాధికారత కోసం కృషి చేస్తున్న మెప్మా సంస్థ, ప్రతిష్టాత్మకమైన స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒకే వేదికపై ఏకంగా నాలుగు రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుని, ఆ సంస్థ నిబద్ధత, ఆధునికత కోసం చేసే కృషిని మరోసారి చాటి చెప్పింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.బెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌లో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలను, పేదలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా ప్రదర్శించిన చురుకుదనం ప్రశంసలు అందుకుంది. మెప్మాకుబెస్ట్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్‌అవార్డు లభించడం, డిజిటల్ యుగంలో ప్రభుత్వ సంస్థలు ప్రజలతో ఎలా అనుసంధానం కావాలనేదానికి ఒక ఆదర్శంగా నిలిచింది. మెప్మా మిషన్ డైరెక్టర్, ఎన్. తేజ్ భారత్, ముఖ్యమంత్రి నుండి ఈ అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విజయం, క్షేత్రస్థాయి సిబ్బంది, సామాజిక కార్యకర్తల అంకితభావానికి, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకున్నందుకు నిదర్శనం. పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, జీవనోపాధి కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా సంఘాల (స్లమ్ లెవెల్ ఫెడరేషన్ ఎస్ఎల్ఎఫ్) ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల సమర్థ నిర్వహణకు గాను మరో మూడు ముఖ్యమైన అవార్డులను

## రాష్ట్ర ప్రభుత్వంతో అంతరిక్ష రంగ ఒప్పందానికి రష్యా సుముఖత

### - సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సిఇఒ వెంకటేశ్వర్లు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వంతో సైన్స్,విద్య,అంతరిక్ష రంగాల్లో ఒప్పందం చేసుకునేందుకు రష్యన్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారని సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీఈఓ వెంకటేశ్వర్లు,కేశినేని తెలిపారు. ఢిల్లీలో జరిగిన వరల్డ్ స్పేస్‌వీక్ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. 'ఈ సందర్భంగా రష్యన్ కాస్మోనాట్ డెనిస్ మాట్వీవ్,ఫెడరేషన్ ప్రతినిధులతో మాట్లాడారు.రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు,పరిశ్రమల ఆకర్షణకు రాష్ట్రప్రభుత్వ చేస్తున్న కృషి వివరించారు. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడానికి వారూ ఆసక్తి చూపించారు. త్వరలో రాష్ట్రంలో పర్యటిస్తామని తెలిపారు' అని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

వార్త

శ్రమతో సంపాదించిన సంపదను అనుభవించడమంత మాధుర్యం మరొకటి లేదు.

-గోథే

# మానవత్వంలోనూ అత్యున్నతమే!


అత్యున్నత స్థానాల్లో ఉన్నవారి గౌరవ ప్రతిష్ట లను కాపాడడం ఈ దేశ సంస్కారం. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలు కూడా అదే చెబుతున్నాయి. దేశ స్థాయిలోనే వారు అలంకరించి న స్థానం అత్యున్నతమైనది. అలాంటి భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మీద ఓ సీనియర్ న్యాయవాది బూటు విసిరే ప్రయత్నం చేసాడు. కోర్టులో తమకనుకూలమైన తీర్పులు రానివారు ఆ న్యాయమూర్తు ల పట్ల కసితో రగిలిపోయిన సందర్భాలు చూశాం. కొన్ని ఉదంతాలు కూడా మనకు తెలుసు. కానీ ఏకంగా అత్యు న్నత ధర్మాసనం అధిష్టించిన ప్రధాన న్యాయమూర్తిపై ఈ రకమైన దాడి ఇదే తొలిసారి. సభ్యసమాజం హర్షిం చలేనిది. 'ఈ దాడి భారతీయులందరినీ ఆగ్రహానికి గురి చేసింది. ఇలాంటి చర్యలకు మన సమాజంలో చోటు లేదు' ఈ మాటన్నది ఎవరో కాదు, ప్రధాన న్యాయ మూర్తి గవాయ్‌ని ఫోన్‌లో పరామర్శించిన అనంతరం ప్రధాని నరేంద్రమోడీ అన్న మాటలివి. ఘటన జరిగిన సమయంలోనూ, అదే సందర్భంలోనూ ఆ తర్వాత ప్రశాంతతను కాపాడుతూ సిజెఐ స్పందించిన తీరును ప్రధాని అభినందించారు. ఉన్నత ధర్మాసనాన్ని ఎంతో హుందాగా నిర్వహించడంలో గవాయ్ ఎన్నోసార్లు తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నారు. అనేక సంచలనాత్మక నిర్ణ యాలను తమ తీర్పుల్లో ప్రవచించేవారు. అంతేకాదు కాల మాన పరిస్థితులకు అనుగుణంగా నేటి తీర్పులుండా లని పదేపదే తమ న్యాయమూర్తులకు బోధించేవారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల విచారణ కోసం ఎదురు చూసేవారు కాలాతీతమవుతోందని భావించే ఆందోళనే తప్ప సుప్రీం తీర్పులను విమర్శించేవారు బహు తక్కువ. న్యాయచట్టాల పరిధిలో తీర్పులు, అప్పీళ్లు, పునశ్చరణ, పునః ప్రస్తావన వంటి ఎన్నో ప్రక్రియలు న్యాయస్థానం గౌరవాన్ని పెంచేటట్లుగానే ఉంటాయి. తుది తీర్పుల్లో న్యాయం అందే తీరుతుందని భారతీయులంతా మెచ్చు కుంటూ న్యాయస్థానాలను, న్యాయాధిపతులను గౌరవి స్తూనే ఉన్నారు. కానీ విచిత్రంగా సోమవారం సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరుగబోయిన అఘా యిత్యాన్ని జాతి యావత్తూ ఖండిస్తోంది. ఈ దాష్టీకానికి ప్రయత్నించింది పరాయి దేశస్థుడో, జాతికుల మత ద్వేషాలున్నవారో కాదు. అతనూ భారతీయుల్లో ఒకరే. ఆయనెలా విమర్శించినా, ఎన్ని ఎత్తుగడలు గుప్పించినా అతని మీద ఎలాంటి కేసు నమోదు చేయవద్దని సిజెఐ ఆదేశించడం ఆయనలోని వ్యక్తిత్వమే చెబుతోంది. ఉన్నత ధర్మాసనాధిపతిగా తీసుకునే ప్రతి చర్యా ఆ స్థానంగౌరవ ప్రతిష్టలను ఇనుమడింప చేసేవిగానే ఉంటాయి. సాధార ణంగా తమ ముందుకొచ్చిన కేసుల్లోని వాస్తవాలను, లోతుపాతుల్ని వెలికితీసేందుకు న్యాయమూర్తులు బెంచి మీద నుంచి ప్రశ్నలు వేయడం ద్వారా కక్షిదారుల తరపు న్యాయవాదుల వాదనలు, వాటిలోని పసను రాబట్టుకునే ప్రయత్నం చేస్తుండడం సహజం న్యాయ ప్రక్రియలో అదీ ఒక భాగమే. అంతేకాదు కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యలు చేస్తుంటారు. అది సానుకూల వ్యాఖ్యలు కావొచ్చు. కాక పోవచ్చు.అవన్నీ న్యాయాన్వేషణలో భాగంగానే చూడాలి. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించబోనంటూ' కోర్టు హాల్‌లోని సీనియర్ న్యాయవాది రాకేష్ సురేష్ ఒక్కసారి గా ప్రధాన న్యాయమూర్తి వైపు లంఘించబోగా వేదిక వద్దకు చేరకుండానే భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకొని వారించారు. ఆ సమయంలో కోర్టు నెం.1 బెంచి మీద జస్టిస్ గవాయ్, జస్టిస్ కె. వినోద చంద్రన్‌లు కేసులు నిర్వహిస్తున్నారు.సిజెఐ గవాయ్ మాత్రం ఇలాంటివ్యాఖ్య లు తనను ప్రభావితం చేయబోవని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖజురాహోలో విష్ణుమూర్తి విగ్రహ పునఃస్థాపన విషయంలో కోర్టులో సిజెఐ వ్యాఖ్యలకు నిరసనగానే ఇలాంటి ప్రయత్నం జరిగినట్లు తెలిసింది. కేసును కొట్టేసి 'ఆ దేవుడినే ఏదైనా చేయమని అడగండి' అన్న వ్యాఖ్య లపై కొందరికి అసంతృప్తి కలిగిన మాట నిజమే. అది తీర్పులో భాగం కాదు. వ్యాఖ్యానప్రస్తావన మాత్రమే. ఈ అంశాలేవీ తీర్పును ప్రభావితం చేయవు. న్యాయప్రక్రియ లో దీనికి పెద్ద దోషమేమీ అంటదు. నిజానికది పురా వస్తు శాఖ స్థలం కనుక వారే అనుమతినివ్వాలని తాను చేయగలిగేదేమీ లేదని అన్నారు. ఆ తర్వాత ఒక సంద ర్భంలో సిజెఐ తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు కూడా. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిందితుడు రాకేశ్ మీద ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించగానే పోలీసులు ఆయనను ప్రశ్నించి వదిలేశారు. ఇప్పుడాయన టీవీ ఛానల్స్‌కు తన చర్యలను సమర్థించుకుంటూ వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. 'ఆ బూటు విసిరించి నేను కాదు, దేవుడేనని' రాకేష్ చేస్తున్న వ్యాఖ్యలు హర్షించదగి నవి కావు. సిజెఐ వ్యాఖ్యల నాటి నుంచి తనకు నిద్రపట్టడం లేదని, తనను 'గమ్మునుంటా వెందుకని ఆ దేవుడు తట్టి లేపాడ'ని ఇలా అర్థం లేని వాగుడుతో 'ఏదో దైవికశక్తి నాతో ఆ పనిచేయించిందం' టూ తన తప్పు కప్పిపుచ్చుకోవాలని సంజాయిషీ చెప్తు న్నాడు. జైలుకైనా సిద్ధమట. బార్‌కౌన్సిల్ ఈ ఉదం తంపై స్పందిస్తూ రాకేశ్ దేశంలోని ఏ కోర్టులోనూ వాదిం చకుండా అతడి సభ్యత్వాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. ఈ ఘటన అన్ని రాజకీయ పక్షాల అగ్రనేతలూ ఖండించారు.ప్రధాన న్యాయమూర్తి తనపై దాడియత్నం మీద మానవత్వంతో స్పందించారన్న ప్రశంసలు అందుకున్నారు. తుచ్ఛమైన ప్రచారం కోసం ఓ వ్యక్తి ఇలాంటి చర్యకు పాల్పడ్డారని కొట్టిపారేశారు. ఈ సంఘటన దురదృష్టకరం. భారతీయ సమాజం ఖండిస్తున్న సంఘటన.

ఉన్నత లక్షణాలు కలిగి ఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకోవడానికి తగిన సామర్థ్యం కూడా కలిగి ఉండాలి.



సెయింట్ థెరిస్సా

దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు. ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించడమే.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### నిరంతర పర్యవేక్షణ అవసరం

ప్రభుత్వ బాలికల గురుకులంలో ఒకేసారి 120 మంది బాలికలు అనారోగ్యంపాలవడం ఆందోళనకరం. అందు లో 80 మందికి పైగా స్థానిక,జిల్లా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా,30 మందిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. వీరంతా పచ్చ కామెర్లు బారిన పడ్డారు.ప్రాథమికంగా అది హెపటైటిస్ ఏ వైరస్ కారణంగా వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఆ వైరస్ కలుషిత మంచినీరు లేదా ఆహారం తీసుకోవడం వల్ల వస్తుంది. ఆ పాఠశాలలో రక్షిత మంచి నీరు ప్లాంట్ పనిచెయ్యడం లేదని,ఈ ఉదంతం బయట పడ్డాక కొత్త ప్లాంట్‌ని అధికార యంత్రాంగం సమకూర్చిందని వార్త. అదృష్టవశాత్తూ అస్వస్థతకు గురైన పిల్లలు వైద్యుల పర్య వేక్షణలో కోలుకొంటున్నారు. శుభ్రమైన వాతావరణం, రక్షిత మంచినీరు, పౌష్టికాహారం,దోమలు,కీటకాల నుండి రక్షణఅన్నవి అన్నిహాస్టళ్లకు ప్రాథమిక అవసరాలు.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అమెరికాపై ఆధారపడడం తగ్గించాలి

భారతఐటీరంగం ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బి వీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియా మకాలనుపెంచడం,రిమోట్ డెలివరీ విధానాలను అభి వృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపే తం చేయడం ద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదే సమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వికసిత భారత్ సాధ్యమా?

పన్నెండవ పంచ వర్షప్రణాళికలో పేర్కొన్నట్టు వేగవంతం అయిన సమ్మిళిత ఆర్థిక వృద్ధభారత్ లాంటి దేశాలకు శ్రీ రామ రక్షఎందుకని భారత్ ఇప్పటికి వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థతో,గ్రామీణ ఆర్థికవ్యవస్థతో ముడిపడి ఉంది. కాబట్టి గ్రామీణ అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపు లు జరగాలి. భారత్ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేపుతు న్నట్టు వికసిత భారతం వైపు అడుగులు వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### కల్తీ నూనె విక్రయాల జోరు

వంటనూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కల్తీ నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు కల్తీనూనె విక్రయిస్తున్నారు. అధికారులు మొక్కు బడిగా తనిఖీలు నిర్వహించి వెళ్తున్నారే తప్ప కల్తీ నూనె విక్రయాలను అరికట్టలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను వివిధప్రాంతాలకు తరలించి విక్ర యిస్తున్నారు. అలాగే లూజు నూనె పేరుతో విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు నకిలీ నూనెను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ ఇనస్పె క్టర్ అధికారు లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

- కామిడి సతీశ్ రెడ్డి,భూపాలపల్లి జిల్లా

### న్యాయస్థాన గౌరవానికి దెబ్బ

దేశ రాజధానిలోని సుప్రీంకోర్టులో జరిగిన ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఢిల్లీకి చెందిన న్యాయవాది రాకేష్ కిశోర్ ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి గారిపై కోర్టు మధ్యలో చెప్పు విసిరిన ఘటన తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. సనాతన ధర్మానికి అవమానం సహించను" అని నినదిస్తూ ఈ ఘటన జరగడంతో కోర్టు వాతావరణం క్షణాల్లో ఉద్రిక్తమైంది. వెంటనే భద్రతా సిబ్బంది ఆ న్యాయవాదిని అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఖండిస్తూ, ఆయన న్యాయవృత్తి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసింది. న్యాయ వ్యవస్థ పట్ల అసంతృప్తి లేదా విభిన్నాభిప్రాయాలు ఉన్నా, వాటిని చట్టపరమైన మార్గాల్లోనే వ్యక్తపరచాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ప్రతిభను ప్రోత్సహించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివి పైకిరావాలని ఆశిం చడం సహజమైనప్పటికీ వారికి ఏరంగంలో ఆసక్తిగలదో తెలు సుకోవాల్సిన అవసరంఉంది.అందుకు ఉపాధ్యాయులు విలువ గల విద్యను అందించి విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తిం చి ప్రోత్సహించాలి. చిన్న చిన్న తప్పులను క్షమించి మరోసారి పునరావృతం కాకూడదని గట్టిగా హెచ్చరించాలి. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ విద్యార్థుల భవిష్యత్‌కు కీలకం కావాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

మన వి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'చేనేత'కు అక్కరకు రాని జిఎస్‌టి

**నిజానికి చేనేత వస్త్రాలు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసి వేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్బర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమరుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి.**



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశంలో చేనేత పరిశ్రమ అత్యంత పురాతనమైన వృత్తి. దీనిని దేశ వారసత్వ సంపదగా కూడా గుర్తిస్తారు. వ్యవసాయ రంగం తరు వాత దేశంలో ఎక్కువమంది గ్రామీణ ప్రజలు ఆధారపడ్డ రంగం చేనేత రంగం. ముఖ్యంగా, ఎక్కువ మంది మహిళలు ఆధారపడ్డ రంగం ఇది. గ్రామీణ మహిళా సాధికారతకు అండ గా నిలిచేది చేనేత రంగం మాత్రమే చేనేత పరిశ్రమ మీద ఆధారపడి దేశం లో కొన్ని లక్షల మంది జీవనం సాగిస్తు న్నారు. 2019-20 జాతీయ హ్యాండ్లూమ్ సెన్సస్ ప్రకారం సుమారు 26,73, 891 మంది నేతకార్మికులు మన దేశంలో ఉన్నారు. వారిలో 88.7 శాతం గ్రామీణ ప్రాంతాలవారు కాగా 11.3 శాతం పట్టణ ప్రాంతానికి చెందినవారు. మొత్తం చేనేత కార్మికుల లో 71.6 శాతం మహిళలు, 28.4 శాతం పురుషులు.సుమారు 2,10,751 మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా చేనేత కార్మికుల సంఖ్య ఎక్కువే. తెలంగాణలో సుమారు 27,916 కుటుం బాలు చేనేత పరిశ్రమ మీద ఆధారపడి ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో 19,417 కుటుంబాలు, పట్టణ ప్రాంతాలలో 8,499 కుటుంబాలు చేనేత వృత్తినే నమ్ముకున్నాయి. అలా గే,ఆంధ్రప్రదేశ్‌లో 1,22,644 కుటుంబాలు ఉండగా,గ్రామీ ణ ప్రాంతాలలో 77,065,పట్టణ ప్రాంతాలలో 45,579 చేనేత కుటుంబాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల చేనేత వస్త్రాలకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. పోచంపల్లి, గద్వాల్, ఉప్పాడ, వేంకటగిరి మంగళగిరి ధర్మవరం వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాల తయారీకి పెట్టింది పేరు. అలాగే ఈ ప్రాంతాలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ సైతం కలిగివున్నాయి. దేశ వ్యాప్తంగా చేనేత వస్త్రాలు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. కానీ ఇటీవల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులలో భాగంగా చేనేత,టెక్స్టైల్ రంగంపై ఏకం గా 18 శాతం జిఎస్‌టిని విధించడంతో ఆయా రంగాల పై పెనుభారం పడనుంది. ఇప్పటికే 5శాతం జిఎస్‌టి వలన చేనేత పరిశ్రమ భారీగా నష్టపోతోంది. జిఎస్‌టి 20 లో చేనేత దుస్తులను 18 శాతం స్లాబ్‌లో చేర్చడంపై పరి శ్రమ వర్గాలే కాకుండా ఇటు వినియోగదారులు సైతం అస హనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 1000 రూపాయల కంటే తక్కువ ధర ఉన్న చేనేత వస్త్రాలపై 12 శాతం జి ఎస్‌టిని విధిస్తున్నారు. నూతన జిఎస్‌టి మార్పులలో భాగంగా, 2500 రూపాయల కంటే తక్కువ ధర ఉండే వస్త్రాలపై 5 శాతం,2500 రూపాయల కంటే ఎక్కువ ధర ఉండే చేనేత, ఇతర వస్త్రాలపైఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతంకు పెంచారు. ఈ నెల 22నుండి నూతన రేట్స్ అమలులోకి వచ్చాయి. వాస్తవానికి, జిఎస్‌టి మార్పులలో భాగంగా చేనేత వస్త్రాలపై పన్నును ఎత్తివేస్తారు అనిభావిం చిన పరిశ్రమ వర్గాలకు జిఎస్‌టిని 12 శాతం నుండి 18 శాతంకు పెంచడం ఆశ్చర్యానికి గురి చేసింది. జిఎస్‌టి పెంపుతో దేశవ్యాప్తంగా చేనేత వస్త్రాల ధరలుపెరుగుతాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి చేనేత పరిశ్రమకు నష్టాలు వాటిల్లే అవకాశం ఉన్నది. మొదటి నుండి చేనేత రంగానికి జీఎస్టీ



భారంగా మారింది. 5శాతం పన్నుతో ఈ రంగం మనుగడ కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. దేశంలో కొన్ని రాష్ట్రాలు ముడి సరుకుపై సబ్సిడీని, చేనేత వస్త్రాలపై జిఎస్‌టి పన్ను భారాన్ని భరించడానికి ముందుకు వచ్చినప్పటికీ దేశవ్యాప్తం గా చేనేత కార్మికులు, సంఘాలు, పరిశ్రమ పన్నుల భారం తో నష్టాలు ఎదుర్కొంటున్నారు. చేనేత కార్మికులు చేతితో తయారు చేసే వస్త్రాలు భారతీయ సంస్కృతి సంప్రదాయా లకు ప్రతిబింబాలు. చేనేత వస్త్రాలను తయారు చేయడం అంత సులభమైన ప్రక్రియకాదు. ఒక్కో చీరను తయారు చేయడానికి సుమారు 4 నుండి 5 గంటల సమయం పడు తుంది. సహజ సిద్ధమైన దారాలు, రంగులు వంటి ఇతర ముడిసరుకులను ఉపయోగించి భారతీయత కనిపించేలా చేనేత వస్త్రాన్ని తయారు చేస్తారు. అయితే గత కొన్నేళ్లుగా, మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా వస్త్రాలధరలు పెంచడం ద్వారా 5 శాతం స్లాబ్ నుండి 12 శాతం స్లాబ్‌లోకి రావడంతో పన్నుభారం పెరిగి, ధరలు పెరిగి వస్త్రాలకు మార్కెట్‌లో డిమాండ్ లేకుండా పోతుంది.ఫలితంగా ఆదాయం లేక ఇప్పటికే చాలా కుటుం బాలు చేనేత వృత్తిని వదిలి ఇతర వృత్తులను ఎంచుకుంటు న్నారు. ఇక ప్రస్తుత 12శాతం నుండి 18 శాతానికి జిఎస్ టి పెంచడంతో రానున్న రోజుల్లో చేనేత పరిశ్రమ మరింత నష్టాలను ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే, చేనేత వృత్తి లాభ దాయకం కాకపోవడంతో యువత ఈ రంగాన్ని ఎంచుకోవ డంలేదు. భవిష్యత్‌లో పన్నులు పెరగడంతో చేనేత వస్తువు లకు ధరలు పెరిగి,మార్కెట్‌లో డిమాండ్ పడిపోయి మరిం త నష్టాలు రావడం. తద్వారా చేనేత పరిశ్రమ కనుమరు గయ్యే అవకాశాలు లేకపోలేదు. కార్మికుడి శ్రమతో యంత్రా లు ఉపయోగించకుండా, చేతులతో తయారు చేసే చేనేత ఎంతో మన్నికైనవి. సహజ సిద్ధమైన ముడి సరుకుల ధర కూడా అధికం. ఎంతో కష్టంతో కూడుకుని ఉన్న చేనేత వస్త్రాలు 2500రూపాయల కంటే తక్కువ ధరతో మార్కెట్ లో అమ్మడం సాధ్యమేనా? దేశంలో పేరొందిన పోచంపల్లి, కంచి, బెనారస్, ధర్మవరం, గద్వాల్ వంటి ఇతర చేనేత వస్త్రాలు కేవలం 2500 రూపాయలకు మార్కెట్‌లో దొరు కుతాయా? కొత్త జిఎస్‌టి ప్రకారం 2500 పైన ధర ఉండే వస్త్రాలపై 18 శాతం పన్ను విధింపపడతాయి. అంటే, భవి ష్యత్‌లో ముడిసరుకు,ఇతర కారణాలతో చేనేత వస్త్రాల ధర లు పెరగక తప్పదు. ఫలితంగా, 5 శాతం పన్ను నుండి 18 శాతం పన్ను స్లాబ్‌లోకి రావడంతో ధరలు పెరిగి ఆ భారం వినియోగదారుని మీద పడుతుంది. అప్పుడు చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో కొనుగోలు తగ్గి వాటి మీద ఆధార పడ్డ చేనేత కార్మికులకు నష్టాలు వస్తాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే,చేనేత వస్త్రాలపై జిఎస్‌టిని 18 శాతా నికి పెంచిన కేంద్రం, ఎటువంటి శ్రమ లేకుండా కృత్రిమ దారాలతో, యంత్రాల సహాయంతో తయారు చేసే పాలిస్టర్ వంటి వస్త్రాలపై జిఎస్‌టిని 12 శాతం నుండి 5 శాతంకు తగ్గించింది. యంత్రాల సహాయంతో తయారు చేసిన వస్త్రా లు తక్కువ ధరలకు లభించడంతో వినియోగదారులు వాటి పై మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ఫలితంగా చేనేత పరిశ్రమకు మరింత నష్టాలు తప్పవు. నిజానికి చేనేత వస్త్రా లు విలాసవంతమైన వస్తువులు కావు. అవి సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక. ముఖ్యంగా, లక్షలాది మందికి జీవనోపాధి. అలాంటి వస్తువులపై జిఎస్‌టిని తీసివేయాలి. లేదా ధరల సీలింగ్ లిమిట్‌ను పెంచాలి. స్వదేశీ వస్తువులనే ప్రోత్సహించాలి. వోకల్ ఫర్ లోకల్, స్వదేశంలోనే ప్రతి వస్తువును తయారు చేయాలంటూ 'మేక్ ఇన్ ఇండియా'. ఆత్మనిర్బర్ భారత్ వంటి పథకాలకు శ్రీకారంచుట్టింది కేంద్ర ప్రభుత్వం. కానీ స్వదేశీ సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే చేనేత వస్త్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించడం సరికాదు. జిఎస్‌టి పెంపు ద్వారా చేనేత రంగంపై ఆధార పడ్డ కార్మికుల జీవనోపాధిని దూరం చేయడమే కాకుండా శతా బ్దాలుగా వారసత్వ సంపదగా వస్తున్న చేనేత సంస్కృతిని అడ్డుకోవడమే. ఒకవిధంగా ఈ నిర్ణయంతో గ్రామీణ జీవన విధానాలలో భాగమైన చేనేత వృతి కనుమ రుగవడం కాయం. అందుకే, కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జిఎస్టని పునఃసమీక్షించాలి. •

# ప్రపంచ దేశాల నెత్తిన ఆర్థిక అస్థిరత్వం

ఐ.ప్రసాదరావు

కోవిడ్ 19 సంభవించిన నాటి నుంచి నేటివరకు దాదా పు అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నా యి. నేటికీ చాలా దేశాల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ పారి శ్రామిక సేవారంగాలు పుంజుకోలేదు. ప్రజల్లో కొనుగోలు శక్తి క్షీణించింది. ముఖ్యంగా మన దేశంలో పేద మధ్యతరగతి ప్రజలు కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి నేటికీ తేరుకోలేదు. వలస వెళ్ళినవారు స్వస్థలాలకు చేరు కుని, తిరిగి వెళ్ళలేదు.దీంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయిరి. అల్ప ఉపాధితో కాలం గడుపుతున్నారు. దీనికి తోడు అధిక ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలతో బ్రతుకులు బహు భారంగా మారింది. నిన్నటి వరకూ జి.యస్.టి భారం. ఇదే సమయంలో విద్యా, వైద్య వైద్యం ప్రైవేటీక రణ జరుగుటచే,సంపాదించిన ఆదాయం కాస్త వీటిపై ఖర్చు చేయడం ద్వారా, దాదాపు డెబ్భై శాతం కుటుంబాలు అప్పు లు ఊబిలో చిక్కుకుపోయాయి. గతంలో పారు ( మొండి) బకాయిలు ఎక్కువగా బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రా మిక వేత్తల పేర్ల మీద ఉండేవి. వీటికితోడు, నేడు ఈ బకాయిలు ఎక్కువగా వ్యక్తిగత ఖాతాల్లో నమోదు అవుతు న్నాయి.ఈ పరిణామాలు ఆందోళనకరమైనవి.దీనికి ప్రధాన కారణం ఉపాధి అవకాశాలు లేకపోవడం. నిరుద్యోగం పెరు గుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతు న్నాయి. అన్నిటికీ మించి 'పొదుపు' కరువైంది. దీనికితోడు 'అనవసర వినియోగం' అనగా 'వినిమయ సంస్కృతి' పెరు గుతుంది. దీంతో మధ్య తరగతి ప్రజల్లో పొదుపు కరువైం ది. అప్పులు కుప్పలుగా కుటుంబాలు నెలవు అవుతున్నా యి. ఇక పేద ప్రజల కష్టాలు వర్ణనాతీతం. దేశంలో నేటికీ ఎనభై శాతం మంది ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్, ఉచిత బియ్యం పథకం పై జీవనం సాగిస్తున్నారు. అయితే విచి త్రంగా దేశంలో మిలియనీర్లు, బిలియనీర్ల సంఖ్యపెరిగింది.. సంపద కేంద్రీకృతమైంది. ముఖ్యంగా జి.డి.పి పెరుగుతుం ది. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. వాస్తవానికి ఈ జీ.డి.పికి, దేశం లో ఎనభై శాతం ఉన్న పేద మధ్యతరగతి ప్రజల ఆదాయా నికి, జీవన ప్రమాణాలకు,ఆర్థిక పరిస్థితులకు చాలా వ్యత్యా సం ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా.ఇక్కడే పాలకులు, మేధావులు, వివిధ ఆర్థిక సర్వే సంస్థలు, ఆర్థికవేత్తలు బహు జాగ్రత్తగా పరిశీలించా లి. నేటికీ పేదరికం భారీస్థాయిలో ఉంది. చాలామంది వేత నాలు కనీసం మూడుపూటలా భోజనం చేయడానికి సరిపో వడం లేదు అనేది కఠోరవాస్తవం. బడా పారిశ్రామిక సంస్థ లకు వ్యక్తుల కు కారుచౌకగా ప్రకృతి వనరులు ధారాదత్తం చేయరాదు. ఋణ మాఫీలు, రాయితీలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తోంది. ముఖ్యంగా పాలకులుఆర్థిక వ్యవస్థను బలోపే తం చేసేందుకు సన్నాహాలు చేయాలి. ప్రజలకు, యువతకు ఉద్యోగఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలను అభివృద్ధి పరుచుకోవా లి. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు ఆందోళనకరంగా మారడానికి కరోనా వైరస్ సృష్టించిన విలయతాం డవం ఒక కారణం అయితే, తదుపరి రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్, పాలస్తీనా గాజాపై యుద్ధం, ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న 'టారిఫ్ నిర్ణయాలు' మొత్తం ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సాక్షాత్తూ అమెరికాలో కూడా 'షట్ డౌన్' అవుతుంది. అమెరికా డాలర్ విలువ క్షీణిస్తుంది. అమెరికా ఆంక్షల వల్ల యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.చైనాలో పరిస్థితి గోప్యం గా ఉన్నా, కొంతమేరకు అక్కడ వస్తు ఎగుమతులు లేక పరిశ్రమలు మూతపడ్డాయి అని నిఘా వర్గాలు తెలుపుతు న్నాయి.ఇక మన ఆసియా ఖండంలో ముఖ్యంగా మన ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్,నేపాల్, పాకి స్థాన్, మయన్మార్ రాజకీయ అస్థిరత్వంతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. మరోవైపు భూకంపాలు,వరదలు వలనఎంతో నష్టం చవిచూస్తున్నాయి. రష్యా గత నాలుగు సంవత్సరా లుగా యుద్ధం చేయడంవల్ల, ఆర్థికపరిస్థితి దెబ్బతింటున్నది. వేళ్ళమీద లెక్కపెట్టే కొన్నిదేశాలు మినహా,దాదాపు ప్రపంచం లోని అన్నిదేశాలు ఆర్థిక అస్థిరత్వంతో తల్లడిల్లుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ దేశాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవాలి అంటే ముఖ్యంగా దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహసంబంధాలు మెరుగు పరుచుకోవాలి. ఆధిపత్యధోరణి తగ్గించుకోవాలి.గ్లోబలైజేషన్ వలన ప్రపంచం అంతా కుగ్రామంగా మారిన ప్రస్తుత పరి స్థితుల్లో అన్ని దేశాలు ఒకరికి ఒకరు సహకారించుకోవాలి. ఎగుమతి దిగుమతి సుంకాలు అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఉండాలి. వలస వ్యతి రేకత ఉండరాదు. ప్రతీకార సుంకాలతో పగలు పెంచుకోరాదు. ముఖ్యంగా యుద్ధాలు జోలికి పోకుండా, సమస్యలను చర్చల ద్వారా పరిష్కారిం చుకోవాలి.ఏ ఉద్దేశంతో అయితే 1945లో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేయడం జరిగిందో, ఆ ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చడానికి అన్ని దేశాలు ప్రయత్నాలు చేయాలి. •

# జపాన్ ప్రధాని ముందున్న సవాళ్లు

డి జె మోహన రావు

జపాన్ రాజకీయం మరోసారి కల్లోలంలో పడింది. మధ్యలోనే ప్రధాని పదవి ముగియడం, పార్టీలో అంత ర్గత గొడవలు, ఆర్థిక సంక్షోభం, ప్రజల నమ్మకం కోల్పో వడం వంటి కారణాలతో దేశం అస్థిరతలోకి జారుకుంది. అయితే, ఈ సంక్షోభం ఒక చారిత్రక పరిణామానికి నాంది పలికింది. సనే తకైచి జపాన్ తొలి మహిళా ప్రధానమంత్రి గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రాజకీయ సంక్షోభంలో పదవిని కోల్పోయిన మాజీ ప్రధాని షిగేరు ఇషిబా. 2024 అక్టోబర్‌లో ప్రధాని అయిన ఆయన, కేవలం ఒక సంవత్స రంలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అవినీతి ఆరోప ణలు, ఎన్నికల్లో ఘోర పరాజయాలు, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి)పై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి ఇందుకు ప్రధాన కారణాలు. దశాబ్దాల తర్వాత, ఎల్‌డిపి పార్లమెం ట్‌లో తన మెజారిటీని కోల్పోయింది. యెన్ విలువ పడి పోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం, జీతాలు పెరగక పోవడం వంటి ఆర్థిక సమస్యలు ప్రజల కోపానికి కారణమ య్యాయి. ఈ అంశాలతో పాటు, పార్టీలోని వారి ఒత్తిడి కారణంగా ఇషిబా రాజీనామా తప్పనిసరి అయ్యింది.ఇషిబా రాజీనామాతో ఎల్‌డిపిలో హోరాహోరీ పోటీ జరిగింది. ఈ పోటీలో సనే తకాయచి విజయం సాధించి, అక్టోబర్ మధ్య నాటికి పార్లమెంట్ ఆమోదంతో ప్రధానిగా ప్రమాణ స్వీకా రం చేయనున్నారు. ఆమె గెలుపు కేవలం జపాన్ తొలి మహిళా ప్రధాని కావడమే కాదు, కఠిన సంప్రదాయవాద భావజాలం కలిగిన నాయకురాలు అధికారంలోకి రావడం కూడా ఒక చారిత్రక ఘట్టం. ఆమె దివంగత ప్రధాని షింజో అబేకు అత్యంత సన్నిహితురాలు.అబే జాతీయవాద విధానాలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం ఆమెకు ఉంది. దేశం మార్పు కోరుకుంటున్న సమయంలో, ఆమె విజయం మరింత గంభీరమైన రాజకీయ మార్పుకు సంకేతం.నూతన ప్రధాని ముందు ఉన్న సవాళ్లు చిన్నవి కావు. దేశంలో రాజకీయ స్థిరత్వాన్ని తీసుకురావడం, ఆర్థిక ఒత్తిళ్లను తట్టు కోవడం, సామాజిక సమస్యలను పరిష్కరించడం ఆమెకు అత్యంత కీలకం. జపాన్ చరిత్రలో తరచుగా ప్రధానులు తక్కువ కాలంలోనే పదవీ విరమణ చేయడం సర్వసాధార ణం. ఇప్పుడు అదే పరిస్థితి మళ్లీ ఎదురవుతుందేమోనని జపనీయులు ఆందోళన చెందుతున్నారు. తకాయచి ముందు ఉన్న అతిపెద్ద సవాలు ఇదే. ముఖ్యమైన చట్టాలు, బడ్జెట్ ఆమోదం పొందాలంటే ప్రతిపక్షం మద్దతు అనివార్యం.ప్రతి పక్షంతో కలిసి పనిచేస్తూ, ప్రభుత్వాన్ని స్థిరంగా నడిపించ



గలిగితేనే ఆమె నాయకత్వం నిలబడుతుంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దశాబ్దాలుగా స్తబ్దంగా ఉంది. యెన్ విలువ తగ్గిపో వడంతో జీవన వ్యయం పెరిగింది. అబే తరహాలోనే తకా యచి కూడా ప్రభుత్వవ్యయాన్ని పెంచేందుకు మొగ్గు చూపి నా, ప్రజలు కోరుకునేది మాత్రం జీతాల పెంపు, మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ దిశగా ఆమె తీసుకునే చర్యలుఆమె పాలనకు కీలకం కానున్నాయి. పెరిగిన వృద్ధ జనాభా వల్ల సామాజిక సంక్షేమ ఖర్చులు పెరుగుతూ, దేశంపై మరింత ఆర్థిక భారం పడుతోంది. ఎన్నికల ఓటములు పార్టీ నాయ కత్వంపై నమ్మకాన్ని దెబ్బతీశాయి. 'జపాన్ ఫస్ట్' అనే నినా దంతో వలసలు, భద్రత, సైనిక బలోపేతంపై కఠిన వైఖ రిని కోరుకునే వర్గాలు పార్టీలో బలంగా మారుతున్నాయి. తకాయచి కఠిన వైఖరి ఈ వర్గానికి అనుకూలంగా ఉన్న ప్పటికీ, ప్రజల అసంతృప్తిని తగ్గించాలంటే ఆమె సమన్వయం సాధించాల్సి ఉంటుంది. దేశీయ సవాళ్ల మాది రిగానే విదేశాంగ విధానం కూడా తకాయచికి కీలకం. ఆమె జపాన్ భద్రత కోసం బలమైన సైన్యం, అమెరికాతో పటి ష్టమైన భాగస్వామ్యం, చైనాపై కఠిన వైఖరిని కోరుకుంటా రు. అమెరికాతో సంబంధాలు బలంగానే కొనసాగే అవకాశం ఉన్నా,తిరిగి అధికారంలోకి వచ్చిన డొనాల్డ్ ట్రంప్ వల్ల కొత్త చిక్కులు తలెత్తవచ్చు. జపాన్ రక్షణ ఖర్చులను జీడీపీలో 3.5శాతం వరకు పెంచాలని ట్రంప్ డిమాండ్ చేసే అవకా శంఉంది. ఈ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ, అమెరికా మద్దతును నిలుపుకోవడం తకాయచికి ఒక సవాలు.ఆసియా పొరుగు దేశాలైన చైనా, దక్షిణ కొరియా పట్ల ఆమె వైఖరి కఠినంగా ఉండవచ్చు. అబే జాతీయవాదానికి మద్దతు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 9 మార్పు సూచనలు, యాసుకుని మందిర సందర్శన వంటి అంశాలు ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచవచ్చు.అయినప్పటికీ, చైనా జపాన్‌కు ప్రధాన వ్యాపార భాగస్వామి కాబట్టి, తకాయచి తన మాటల్లో కొంత మృదు త్వాన్ని పాటించే అవకాశం ఉంది. ఆమె భారతదేశం, ఆస్ట్రే లియా వంటి దేశాలతో సంబంధాలు బలోపేతం చేసి,క్వాడ్ కూటమిలో జపాన్ పాత్రను మరింత పెంచాలనుకుంటు న్నారు. సనే తకాయచి అధికారంలోకి రావడం రాజకీయం గా అనివార్యమైనప్పటికీ, ఇది పాత సంప్రదాయవాదానికి కొత్త చారిత్రక మలుపుగా మారింది. ఎల్‌డిపి తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తూనే, ఒక మహిళా నాయకురా లిని ప్రోత్సహించడం జపాన్ రాజకీయ మార్పుకుసంకేతం. తకాయచికి ముందు ఉన్న పరీక్షలు కఠినమైనవి. ప్రతిపక్షం తో సయోధ్య, ఆర్థిక స్థిరత్వం, విదేశాంగ సమతుల్యత. ఈ పరీక్షల ఫలితమే ఆమెను జపాన్ 'ఐరన్ లేడీ'గా మారుస్తుం దా లేదా మరో తాత్కాలిక ప్రధానిగా మిగిలిపోతుందా అన్నది నిర్ణయిస్తుంది. యుద్ధానంతర రాజకీయ స్థిరత్వం ముగిసిన తర్వాత, జపాన్‌లో ప్రారంభమైన ఈ కొత్త అధ్యా యం ఎంతవరకు కొనసాగుతుందో చూడాలి. •

# కల్తీ మద్యానికి కర్త, కర్మ, క్రియ అంతా జగనే

## ఏపీ డబ్ల్యూసీఎఫ్‌సీ ఛైర్మన్ పీతల సుజాత

గుంటూరు–ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7: పురాణాల్లో దేవుళ్లు మంచి పనులు చేస్తుంటే రాక్షసులు అడ్డుపడినట్టు... సీఎం చంద్రబాబు మంచి పనులు చేస్తుంటే జగన్ అడ్డుపడుతున్నాడని మాజీ మంత్రి, ఏపీ డబ్ల్యూసీఎఫ్‌సీ ఛైర్మన్ పీతల సుజాత మండిపడ్డారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ గారికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. 2.42 కోట్ల మంది మహిళల కోసం స్త్రీ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇప్పటివరకు 10 కోట్ల మంది మహిళలు, విద్యార్థినులు ఉచిత బస్సులో ప్రయాణించారు. ఇప్పటివరకు రూ.400 కోట్లకుపైగా వారికి ఆదా అయింది. ప్రతి ఇంటికి స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఆటో డ్రైవర్లను మోసం చేసిన జగన్: ఆటో డ్రైవర్ సేవలో పథకం ప్రజల మన్ననలు పొందుతుంది. వైసీపీ హయాంలో రూ.10 వేలే ఇస్తే... కూటమి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుంది. జగన్ ఇచ్చిన దానికంటే రూ.5 వేలు అదనంగా ఆటో డ్రైవర్ సోదరులకు అందజేస్తున్నాం. రూ.436 కోట్లు ఈ పథకం కోసం ఖర్చు చేస్తున్నాం. జగన్ హయాంలో రూ.10 వేలు ఇస్తే రూ.83 వేల వరకు ఏడాదికి లాక్కున్నాడు. డీజిల్ ధరలు పెంచేశాడు. రహదారులు బాగు చేయలేకపోయాడు. పోలీసుల జరిమానాలు, అన్న క్యాంటీన్లు రద్దు చేశాడు. జగన్ తన హాయంలో రహదానులను పట్టించుకోలేదు. రోడ్లకు గుంతలు పడి అనేక మందికి రోడ్డు ప్రమాదాల్లో మరణించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రూ.1400 కోట్లు ఖర్చు చేసి నేడు 20 వేల కి.మీ. గుంతల రహిత రహదారులను బాగు చేశామన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 'సూపర్ సిక్స్' హక్కులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి



గుంటూరు విద్య,అక్టోబర్ 7,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో జిల్లా ఐక్యవేదిక ఛైర్మన్ చాంద్ భాషా అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా చాంద్ భాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు అమలు చేసిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం,ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు కూడా సూపర్ సిక్స్ హక్కులను అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు.రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలి.ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి కోరుతున్నాము. జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ,జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాద్రి,నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు,నగరశాఖ కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ నాగరాజు తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు,తాడికొండ తదితరులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

CO- SAM(Stressed Asset Management)
డి.నెం.9-35, కావూరి టవర్స్, 1వ అంతస్తు, కామయ్య తోపు సెంటర్, కానూరు, విజయవాడ - 520007, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2428160, E Mail: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై"** దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

**ఇ -వేలం తేది మరియు సమయం : 22-10-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు**

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 21-10-2025, సాయంత్రం 4 గం॥ల లోపు | బిడ్ పెంపుదల మొత్తం : 10,000/-

ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: మెస్సర్స్ హయగ్రీవ సోఫా వర్క్స్ (A/c No. 0570108700000295) ప్రాతినిధ్యం వహిస్తున్న యజమానురాలు : మలిశెట్టి పద్మజ, డి.నెం.41/15/637, అరుంధతి నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001 & శ్రీమతి మలిశెట్టి పద్మజ, భర్త : మలిశెట్టి దుర్గ అరవింద్, యజమానురాలు, డి.నెం.29-280-1, కొండిశెట్టి వీధి, కొండపల్లి, గుంటూరు జిల్లా, కొండపల్లి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 521228. వేరొక చిరునామా: శ్రీమతి మలిశెట్టి పద్మజ, భర్త : మలిశెట్టి దుర్గ అరవింద్, యజమానురాలు, డి.నెం. 55-3-819, వాసవీ నగర్, 4వ లేన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001 & శ్రీ ఇక్కుర్తి వెంకట శివరావు, తండ్రి : ఇక్కుర్తి శివయ్య, హామీదారు, 55-3-956, ఆర్‌టిసి కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522001. బ్రాంచ్ ఆఫీస్ : కొత్తపేట, గుంటూరు (057010), డిమాండ్ నోటీసు తేది.27-08-2024, ఈ అమ్మకం ప్రకటన జారీ చేసిన ప్రకారం తేది: 30-09-2025 నాటికి బకాయి రూ.12,13,141.11 పై + తేది.01-10-2025 నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు, (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును). లాంఛనాత్మక స్వాధీనతా తేది : 26-11-2024

| సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు | రిజర్వు ధర | బయానా (ఇఎమ్‌డి) |
|---|---|---|
| ఎమ్‌ఒడి డాక్యుమెంట్ నెం.4624/2022, తేది.16.12.2022తో మరియు రిజిస్టర్డు గిఫ్ట్ డీడ్ నెం.2847/2022, తేది.01.08.2022 ప్రకారం శ్రీ ఇక్కుర్తి వెంకట శివరావు, తండ్రి : ఇ. శివయ్య గారి పేరున గల ఆస్తి : సమాన తనఖాలో గల గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ డిస్ట్రిక్ట్, ప్రత్తిపాడు మండలం, యనమదల గ్రామం, డి.నెం.137/3 లోని ఎ.1.00 సెంట్ల భూమి లే అవుట్ ప్లాన్ ప్రకారం మారిన భూమి మొత్తంలో ప్లాట్ నెం.10 లోని 150 చ॥గ॥ల విస్తీర్ణంతో గల ఆస్తి. హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.15 స్థలం - 27 అ॥లు, దక్షిణం : ప్లాట్ నెం.11 స్థలం - 50 అ॥లు, పడమర : 40 అ॥ల వెడల్పు రోడ్డు - 27 అ॥లు, ఉత్తరం : ప్లాట్ నెం.9 స్థలం - 50 అ॥లు., | రూ. 8.50 లక్షలు | రూ. 0.85 లక్షలు |

ఇ-వేలం నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తి అమ్మకం గురించి అధీకృత అధికారి వారు నిర్ధారణచేయుదురు. విజేత అయిన బిడ్డరు యొక్క ధరావత్తు (ఇఎమ్‌డి) సొమ్మును అమ్మకం విలువలో భాగంగా ఉంచెదరు. విజేత కాని బిడ్డరు ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించెదరు. సదరు ధరావత్తు పై ఏ విధమైన వడ్డీ చెల్లించబడదు. అధీకృత అధికారిచే బిడ్డుధర అంగీకరించబడిన 24 గంటల లోపూగా ముందుగా చెల్లించిన బయానా సర్దుబాటుతో విజయము పొందిన బిడ్డరు అమ్మకపు ధరలో 25% ను వెంటనే జమ చేయవలెను. మరియు మిగిలిన 75% అమ్మకము ధరను అమ్మకపు తేదీ నుండి 15వ దినమున లేక ముందుగా లేదా అధీకృత అధికారి నిర్ణయం మేరకు వ్రాతపూర్వకముగా విస్తరించబడిన అట్టి కాలములోపుగా చెల్లించవలెను. విజయము పొందిన బిడ్డరు చెల్లింపులో విఫలమైనచో అధరువారా ఇంతకు ముందుగా ధరావత్తు చేసిన మొత్తము స్వాధీనము చేసుకొనబడును మరియు ఆస్తి తిరిగి వేలము వేయబడును ఆస్తి/మొత్తమునకు సంబంధించి విఫలమైన ఋణగ్రహీతకు ఎట్టి క్లెయిము/హక్కు ఉండబోదు.
5. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://baanknet.com ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.22.10.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
6. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://baanknet.com & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 06-10-2025, ప్రదేశం : విజయవాడ | సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్



పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

CO- SAM(Stressed Asset Management)
డి.నెం.9-35, కావూరి టవర్స్, 1వ అంతస్తు, కామయ్య తోపు సెంటర్, కానూరు, విజయవాడ - 520007, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2428160, E Mail: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 9(1)తో చదువుకోవలసిన రూలు 8(6) ప్రకారం సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన / ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై"** దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు / సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు) / హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

**ఇ -వేలం తేది మరియు సమయం : 22-10-2025 ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు**

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 21-10-2025, సాయంత్రం 4 గం॥ల లోపు | బిడ్ పెంపుదల మొత్తం : 10,000/-

ఋణగ్రహీత పేరు/బ్యాంకుకు మొత్తం బకాయిలు: మెస్సర్స్ శ్రీ విజయ సాయి ఫర్నీచర్స్ (A/c No.0570108700000259) ప్రాతినిధ్యం వహిస్తున్న పార్ట్‌నర్స్, షాప్ చిరునామా 17వ లైన్, 2వ క్రాస్ రోడ్డు, అరండల్‌పేట, గుంటూరు - 522002 & శ్రీ ఇక్కుర్తి వెంకటశివరావు, తండ్రి : శివయ్య, మేనేజింగ్ పార్ట్‌నర్, నివాసం: డి.నెం.8-19-1-403, 2/2, అరుంధతి నగర్, కొత్తపేట, గుంటూరు - 522001 & శ్రీ ముత్యాల శివ సందీప్ రెడ్డి, తండ్రి : వెంకట సుబ్బారెడ్డి (పార్ట్‌నర్), నివాసం: ఇ.నెం.21-16-806/2, అంజనేయ పేట, 2వ లైన్, కొరిటెపాడు, చెరువు దగ్గర, చంద్రమౌళి నగర్, గుంటూరు - 522007. బ్రాంచ్ ఆఫీస్ : గుంటూరు (057010), డిమాండ్ నోటీసు తేది.10-06-2024, ఈ అమ్మకం ప్రకటన జారీ చేసిన ప్రకారం తేది: 30-09-2025 నాటికి బకాయి రూ.12,23,690.54/- + తేది.01-10-2025 నుండి తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు, (డిమాండ్ నోటీసు తరువాత ఏవైనా చెల్లింపు ఉన్న యెడల మినహాయించబడును). లాంఛనాత్మక స్వాధీనతా తేది : 08-10-2024

| సెక్యూరిటీ / ఆస్తుల వివరాలు మరియు ఆస్తుల యజమాని / తనఖా పెట్టిన వ్యక్తి పేరు | రిజర్వు ధర | బయానా (ఇఎమ్‌డి) |
|---|---|---|
| సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.2848/2022, తేది.01.08.2022 మరియు ఎమ్‌ఒడి డాక్యుమెంట్ నెం.4325/2022, తేది.21.11.2022 ప్రకారం శ్రీ ఎక్కుర్తి వెంకట శివరావు, తండ్రి : శివయ్య గారి పేరున గల ఆస్తి : గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్ డిస్ట్రిక్ట్, ప్రత్తిపాడు గ్రామ పంచాయితీ ఏరియా పరిధిలో, ప్రత్తిపాడు గ్రామ సర్వే నెం.డి.నెం.968/2, 968/3 లోని మొత్తం విస్తీర్ణం ఎ.3.00 సెంట్లు మరియు డి.నెం.40/1 లోని ఎ.0.18 సెంట్లు, మొత్తం విస్తీర్ణం ఎ.3.18 సెంట్లు విస్తీర్ణం గల భూమి లే అవుట్ ప్లాన్ ప్రకారం ఆమోదం పొంది ప్లాట్లుగా మార్చబడినది. ప్రత్తిపాడు గ్రామం వద్ద, డోర్ నెం.9-209 దగ్గర, ప్లాట్ నెం.6 లోని 258.34 చ॥గ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.7 యొక్క స్థలం - 34.4 అ॥లు, దక్షిణం : ఇతరుల భూమి - 76.8 అ॥లు, పడమర : ఇతరుల భూమి - 30.4 అ॥లు, ఉత్తరం : 33 అ॥ల వెడల్పు రోడ్డు - 76.8 అ॥లు., ఈ హద్దులలోని విస్తీర్ణం 258.34 చ॥గ॥లు లేదా 215.99 చ॥మీ॥ల ఖాళీ స్థలం మాత్రమే. | రూ. 14.50 లక్షలు | రూ. 1.45 లక్షలు |

ఇ-వేలం నియమ నిబంధనలు:
1. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును.
2. ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి.
3. అధీకృత అధికారి గారి వద్దగల పైన తెలిపిన షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, వదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారి సమాధానం తెలుపవలసిన అవసరం లేదు.
4. అత్యధిక బిడ్డరుకు ఆస్తి అమ్మకం గురించి అధీకృత అధికారి వారు నిర్ధారణచేయుదురు. విజేత అయిన బిడ్డరు యొక్క ధరావత్తు (ఇఎమ్‌డి) సొమ్మును అమ్మకం విలువలో భాగంగా ఉంచెదరు. విజేత కాని బిడ్డరు ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించెదరు. సదరు ధరావత్తు పై ఏ విధమైన వడ్డీ చెల్లించబడదు. అధీకృత అధికారిచే బిడ్డుధర అంగీకరించబడిన 24 గంటల లోపూగా ముందుగా చెల్లించిన బయానా సర్దుబాటుతో విజయము పొందిన బిడ్డరు అమ్మకపు ధరలో 25% ను వెంటనే జమ చేయవలెను. మరియు మిగిలిన 75% అమ్మకము ధరను అమ్మకపు తేదీ నుండి 15వ దినమున లేక ముందుగా లేదా అధీకృత అధికారి నిర్ణయం మేరకు వ్రాతపూర్వకముగా విస్తరించబడిన అట్టి కాలములోపుగా చెల్లించవలెను. విజయము పొందిన బిడ్డరు చెల్లింపులో విఫలమైనచో అధరువారా ఇంతకు ముందుగా ధరావత్తు చేసిన మొత్తము స్వాధీనము చేసుకొనబడును మరియు ఆస్తి తిరిగి వేలము వేయబడును ఆస్తి/మొత్తమునకు సంబంధించి విఫలమైన ఋణగ్రహీతకు ఎట్టి క్లెయిము/హక్కు ఉండబోదు.
5. అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://baanknet.com ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.22.10.2025న ఉదయం 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు నిర్వహించబడును.
6. అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయచేసి https://baanknet.com & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

SARFAESI చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

తేది : 06-10-2025, ప్రదేశం : విజయవాడ | సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్


# గుంటూరు వార్త



## సిబ్బంది సంక్షేమానికి సహకారం : ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ను జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రస్తుత అరండల్‌పేట సిఐ ఆరోగ్యరాజు,కార్యదర్శి లాలాపేట సీఐ శివప్రసాద్ ఇతర అసోసియేషన్ అధికారులు ఎస్పీకి అసోసియేషన్ కార్యకలాపాలు,జిల్లా పోలీసు సిబ్బందికి అందిస్తున్న సేవలు మరియు సహాయ సహకారాల గురించి వివరించారు.ఎస్పీ మార్గదర్శకం,సహకారం లభిస్తే మరింత విస్తృత స్థాయిలో సేవలు అందించగలమని తెలిపారు.జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించి,పోలీసు శాఖ తరఫున అందవలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని,అలాగే అసోసియేషన్ సేవలకు పూర్తి స్థాయి సహకారం అందిస్తామని ఎస్పీ వకుల్ జిందాల్ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సురేష్,వైస్ ప్రెసిడెంట్ మైలా సాంబశివరావు,సభ్యులు బేబీ రాణి,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్లు డ్రైయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలోప్రజారంజక పాలన సాగుతోందని సంక్షేమం,అభివృద్ధి జోడు గుర్రాల పరుగులు తీస్తున్నాయని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.నగరంలోని 9వ డివిజన్ సుద్దపల్లి డొంక యాదవ బజారు,గణేష్‌నగర్ 2వలైనులో రూ.84లక్షలతో సిసి రోడ్లు డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నగరాన్ని నరకంగా మార్చారని మండిపడ్డారు.ఏ వీధికెళ్ళినా గుంతల మయ మేనని విమర్శించారు. నలభై 40ఏళ్ళనుండి అపరిష్కృతంగా ఉన్న మొండిగేటు వద్ద సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామ న్నారు.కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ,సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని వెల్లడించారు.దీంతోపాటు ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే ఆటోడ్రైవర్లకు వరాలిచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నార.కార్యక్రమంలో కార్పొరేటర్ యల్లావుల అశోక్,జాగర్లమూడి శ్రీనివాసరావు,ఐలా శ్రీనివాసరావు,అల్లం బాజీ,డివిజన్ అధ్యక్షులు బట్ట రాజా,రియాజ్,జాడ సురేష్ గట్టు శ్రీకాంత్,కందుకూరి వెంకట్,కూరాకుల ప్రభాకర్,ప్రసాద్,ఆరీఫ్,నరసింహా,కొలగాని కృష్ణ,రియాసత్ తదితరులు పాల్గొన్నారు.



## పాతగుంటూరు పోలీస్టేషన్ పరిధిలో వ్యక్తి దారుణ హత్య
### పోలీసుల వైఫల్యం అంటూ ఆరోపణలు



గుంటూరు క్రైమ్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : స్థానిక పాతగుంటూరు పోలీస్టేషన్ పరిధిలో వ్యక్తి దారణ హత్యకు గురైన సంఘటన మంగళవారం జరిగింది.స్థానికుల తెలిపిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చూడగా మృతుడు నాగ గణేష్ అప్పటికే మృతి చెంది ఉన్నాడు.పోలీసులు తెలిసిన వివరణ మేరకు తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన వీర అంజలిదేవీ అనే యువతిని కుర్ర నాగ గణేష్ 12రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు.పెళ్ళైన తర్వాత ఇద్దరు కలసి తమకు రక్షణ కల్పించాలని నల్లపాడు పోలీస్టేషన్‌ను ఆశ్రయించడం జరిగింది.నల్లపాడు సిఐ వంశీధర్ వాళ్ళ ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు.ఈ నేపథ్యంలో మృతుడు నాగ గణేష్ తన భార్యను తీసుకొని పొన్నూరు రోడ్డులోని పవన్ స్టేషన్ లో వర్క్ చేస్తూ బుడంపాడులో నివాసం ఉంటున్నాడు.అంజలీదేవి అన్నకు వీరి వివాహం ఏమాత్రం ఇష్టంలేదు.నాగ గణేష్‌ను చంపితే తమ చెల్లి తన దగ్గరకు వస్తుందనే నమ్మకంతో మంగళశారం పొన్నూరు రోడ్డులోని ఎంమ్ కనె ్వన్షన్ వద్ద కత్తితో గణేష్ పై దాడి చేసి అత్యంత కిరాతంగా చంపాడు.ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడన్న కసితోనే గణేష్‌ను యువతి అన్న దుర్గారావు దారుణంగా హత్యచేసి ఉంటాడని పోలీసులు తెలిపారు.హత్య చేసిన దుర్గారావు పై గతంలో రౌడీషీట్ కూడా ఓపెన్ అయింది.అంతేకాకుండా ఇతను పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు.పాతగుంటూరు పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిజిహెచ్‌లోని శవాగారంలో భద్రపరిచారు.

## 'విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి'



కాకుమాను అక్టోబర్ 7(ప్రభాత వార్త): కాకుమాను జెడ్పీ హైస్కూల్ లో మంగళవారం ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించబడినవి. ఎంఈఓ కె.ఎఫ్. కెన్నెడీ పోటీలను ప్రారంభించి విద్యార్థులను ప్రోత్స హించారు. ప్రధానోపాధ్యాయులు జి.బి. వి. వెంకటరావు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో తమ ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు.ఈ పోటీలలో జెడ్పీహెచ్ఎస్ కొమ్మూరు, జెడ్పీహెచ్ఎస్ బోడిపాలెం, జెడ్పీహెచ్ఎస్ కొండపాటూరు, ఎన్.జెడ్పీహెచ్ఎస్ కాకుమాను, జెడ్పీహెచ్ఎస్ రేటూరు, జెడ్పీహెచ్ఎస్ గరికపాడు మరియు ఎ పి డబ్ల్యూ ఎస్ ఆర్ కాకుమాను పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రూ.26లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం,ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాదాన్యమని,అరోగ్య రక్షణ కవచంగా సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతోందని తూరు ్పఎమ్మెల్యే నసీర్ అన్నారు.తూర్పు నియోజకవర్గంలో రూ.26లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా ఒక్కరూ కూడా ఇబ్బంది పడకూడదనే కృతనిశ్చ యంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పేద వర్గాల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.5.41



కోట్ల మేర సీఎంఆర్‌ఎఫ్ నిధులతో ప్రజల ప్రాణాలు కాపాడామని వెల్లడించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్దిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలను పెద్దమనస్సుతో ఆదుకున్న సీఎం చంద్రబాబు,ఎమ్మెల్యే నసీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు గంజాం రాఘవేంద్ర,జాగర్లమూడి శ్రీనివాసరావు,గోళ్ళ ప్రభాకర్,మహంకాళి నరసింహారావు,బత్తిని శంకర్,వేలూ ్చరి కిరణ్,పఠాన్ జమీర్,చల్లా అంజనేయప్రసాద్,వంగర ఏడుకొండలు,కోటా పిచ్చిరెడ్డి,డిప్యూటీ మేయర్ గౌస్,చామర్తి ఆనంద్‌సాగర్,నిజాముద్దీన్,చెట్టు కనకారావు,వాసు కాశింబాబు,డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ సలీం,తాడిపోయిన చిన్న బుజ్జి,గుడిమెట్ల దయారత్నం,ఎర్రగుంట్ల ఆనంద్,బత్తిని దినేష్,ముకుందరావు ,వహీద్,బాబురావు,వజా లక్ష్మీ,అన్వర్ అఖాని,ఫారూఖ్,హుస్సేన్,ఏలూరి నరేంద్ర,ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ జగన్

## టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి

గుంటూరు–ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7: కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్ రెడ్డి అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారింది. కల్తీ మద్యానికి చాలా మంది అనారోగ్యానికి గురై మరణించిన సంఘటనలను మనం ఎన్నో చూశాం. ఈ రోజు కల్తీ మద్యం గురించి జగన్ రెడ్డి మాట్లాడుతూంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. జగన్ రెడ్డి పాలనలో స్వయంగా వారి పార్టీ నాయకులే డిస్టిలరీలను ఏర్పాటు చేసి నగదుకు లిక్కర్ అమ్ముకుని సొమ్ము చేసుకున్న సంఘటనలు చూశాం. వారి నాయకులే టీవీల్లో కట్టాలు అన్ని ఎగ్జిబిషన్ పెట్టింది టీవీల్లో అందరం చూశాం. వైసీపీ పాలనలో రూ.3 వేల నుంచి రూ.4 వేల కోట్ల మద్యం కుంభకోణం జరిగింది. మీరు కూడా కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం అంటూ మాట్లాడుతున్నారు. తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎప్పుడు అధికారంలో ఉన్న శాంతి భద్రతలపై కానీ, అవినీతి, ఆరాచకాల పాలిత సింహస్వప్నంలా వ్యవహరించారు. ఈ రోజు ప్రజల ఆరోగ్యమే.. ప్రభుత్వ బాధ్యత, భద్రత అని నకిలీ మద్యం అమ్మకాలపైన, తయారీ కేంద్రాలపైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. అంతేకాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్తీ మద్యం తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తుంది. ఇందులో పార్టీలకుతీతంగా చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అవినీతి, ఆరాచక వ్యవహారాలు ఎవరు చేసిన కూడా చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీడీపీ నాయకులనే సస్పెండ్ చేసిన విషయం అందరికి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లో కల్తీ మద్యం వ్యవహారంలో రాజీపడే పడేది లేదు. పార్టీ ఇంచార్జీ జయచంద్రరెడ్డిని, అదేవిధంగా సురేంద్ర నాయుడు అనే వ్యక్తిని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేశారని. పోలీసులు కూడా వారి మీద చర్యలు తీసుకుంటున్న పరిస్థితులు కూడా చూస్తున్నామని అన్నారు.



# డ్రెయిన్లపై ర్యాంపుల ఆక్రమణల తొలగింపుపై యుద్ధప్రాతిపదిక చర్యలు

## కమీషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 7,ప్రభాతవార్త : జిఎంసి పరిధిలోని హనుమయ్య విగ్రహం నుంచి బృందావన్ గార్డెన్స్,లక్ష్మీపురం,మథర్ థెరిస్సా విగ్రహం వరకు బుధవారం నుండి ఇరువైపులా డ్రైన్లపై ర్యాంపులు,ఆక్రమణలు తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని జిఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.జిఎంసి ప్రధానకార్యాలయంలో కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక,ప్రజారోగ్య అధికారులతో సంయుక్తా సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ నగరంలో వర్షం నీరురోడ్డ మీద నుండి నేరుగా డ్రైన్‌లోకి వెళ్ళాలని,అందుకు తొలుత డ్రైన్లను ఓపెన్ చేసి,నూరు శాతం పూడిక తీయాలన్నారు.అలాగే జిన్నాటవర్ నుంచి చేపట్టిన డ్రైన్లపై శ్లాబ్లు,ఆక్రమణల తొలగింపు పూడికతీత పనులను మరోవైపు వేగంగా చేస్తూ వైజంక్షన్ వరకు చేట్టాలని డిసిపిని ఆదేశించారు.కొని ్న డివిజన్లలో మస్టర్ అనంతరం విధుల్లో కార్మికులు ఉండడం లేదని,మధ్యాహ్నం పని చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని,తమ క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎస్ఎస్‌లకు కేటాయించిన అదనపు ట్రాక్టర్లు,కార్మికులతో చెట్ల కొమ్మలు,భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు.సమావేశంలో డిప్యూటీ కమీషనర్ టి.వెంకట కృష్ణయ్య,సిటి ప్లానర్ రాంబాబు,ఎస్ఈ సుందరామిరెడ్డి,ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ,ఇంజనీరింగ్,పట్టణ ప్రణాళిక,ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.




## రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేదు : 'పశ్చిమ' ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ పంపిణీ వ్యవస్థపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో తహశీల్దార్,డిప్యూటీ తహశీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రేషన్ సరఫరా,లబ్దిదారుల వివరాలు,డీలర్ల పనితీరు నియమ నిబంధలు అమలు పై విస్తృతంగా చర్చ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 95రేషన్ షాపులు ఉన్నాయి.ప్రతి షాపు తన పరిధిలో ఉన్న లబ్దిదారులందరికీ సమయానికి సరుకులు అందించాలి ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వారి హక్కుగా ప్రభుత్వ సరుకులు తప్పక అందాలి, ఇది అధికారుల బాధ్యత,డీలర్ల కర్తవ్యం అని స్పష్టం చేశారు.ప్రజల విశ్వాసం ప్రభుత్వంపై నిలబెట్టడం మనందరి భాద్యత,ఇక నుండి పశ్చిమలో రేషన్ పంపిణీ సమస్యలు రాకుండా కఠిన పర్యవేక్షణ ఉండాలి, నవంబర్ నెల నుండి ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని ఎమ్మెల్యే ఆదేశించారు.



**రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను పక్కకు తొలగించాలి**

నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్‌లలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను పక్కకు జరిపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు.

**-చాకలికుంటను పరిరక్షిస్తాం:**

స్థానిక 36వ డివజన్‌లో ఉన్న చాకలికుంట ఆక్రమణలకు గురైందని,వెంటనేసర్వే జరిపి ఈ కుంటను పరిరక్షించాలని ఎమ్మెల్యే టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణ స్వామిని ఆదేశించారు.అదే విధంగా కొండయ్యకాలనీలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవి ఆదేశించారు.69

## 9నుంచి 'సిబార్'లో దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు విద్య,అక్టోబర్ 7,ప్రభాతవార్త : సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 9నుంచి 15వరకు దంత వైద్య వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు.మంగళవారం కళాశాల్లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు.ఈ ప్రదర్శనతో ప్రజలకు,విద్యార్థులకు దంత వ్యాధులు,నిర్ధారణ,నియంత్రణ,చికిత్సా విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## దాత శ్రీనివాసరావుకు ఘనసత్కారం



పెదనందిపాడు అక్టోబర్ 7 (ప్రభాతవార్త): అమెరికాలో డాక్టర్ గా స్థిరపడిన గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలం. నందిగామకు చెందిన దాత డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరావు మంగళవారం సత్య ఇన్వెస్టిగేషన్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కు విచ్చేసిన సందర్భంగా .పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల. పాలకవర్గ అధ్యక్షులు. విశ్రాంతి విజిలెన్స్ ఎస్పి కాళహస్తి సత్యనారాయణ. దాత డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతూ. శ్రీనివాసరావు వైద్యుడుగా అమెరికా లో స్థిరపడినప్పటికీ తన జన్మ భూమిలో పలు సేవా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నా రన్నారు. ది పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీకి" విద్యాభివృద్ధి కొరకు, రెండు లక్షలు విరాళమందించినారు. ఈ సందర్భముగా వారికి పాలక వర్గం తరుపున ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.

## పెదనందిపాడు జడ్పీ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల ప్రారంభం



పెదనందిపాడు అక్టోబర్ 7 (ప్రభాతవార్త) స్కూల్ గేమ్స్ ఫ్రేడరేషన్ ఆదేశాల మేరకు పెదనందిపాడు జడ్పీహెచ్ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి కం సెలక్షన్ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు కేఎఫ్ కెనడి. పి జాకబ్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల స్థాయి పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు చెస్. యోగ .బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు . గురు శుక్రవారాల్లో వాలీబాల్. కోకో. కబడీ. అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్ రావు లు తెలిపారు.

# అమరావతిలో ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం 2వ రోజు పర్యటన



గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7: ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) బృందం రాజధాని అమరావతి పర్యటన వరుసగా 2వ రోజు కొనసాగింది. ఏడీబీ వాటర్ అర్బన్ డెవలప్మెంట్ సెక్టార్ బృందంలోని సభ్యులైన నోరియో సైటో(సీనియర్ డైరెక్టర్), మనోజ్ శర్మ(డైరెక్టర్), సంజయ్ జోషి(ప్రిన్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్), అశ్విన్ హోసూర్ విశ్వనాథ్(సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్)లు ఉదయం విజయవాడలోని సిఆర్డిఏ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్, అమిలినేని భార్గవ తేజ్ ఐఏఎస్‌లతో సమావేశమయ్యారు. అనంతరం బ్యాంకు బృందం అమరావతి సచివాలయంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్ ఐఏఎస్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఐఏఎస్, పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఐఏఎస్. ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ ఐఏఎస్‌లను కలిశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఐఏఎస్‌ను ఆయన ఛాంబర్‌లో ఏడీబీ బృందం కలిశారు. ఈ సమావేశాలలో సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్, అడిషనల్ కమిషనర్ అమిలినేని భార్గవ తేజ ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సమావేశాలలో రాజధాని అమరావతి ప్రాజెక్టు పనులలో పురోగతి, ఏడీబీ అందజేస్తున్న ఆర్థిక సహకారం తదితర అంశాలను బృందంలోని సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించారు.

## 8వ రాష్ట్రీయ పోషణ మాసం ర్యాలీ

పెదనందిపాడు అక్టోబర్ 7 (ప్రభాతవార్త): 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా మంగళవారం పెదనందిపాడు అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎండి జరిగిన అధ్యక్షతన ఏర్పాటు



చేసిన సమావేశంలో తల్లి బిడ్డల వెయ్యి రోజుల సంరక్షణ గురించి వివరించారు. ప్రతి ఒక తల్లి మొక్కలు నాటడం వలన బిడ్డలు ఆరోగ్యవంతమైన వాతావరణంలో పెరుగుతారని. స్థానికంగా దొరికే ఆకుకూరలు మునగాకుతో మిల్లెట్స్ తయారు చేసే విధానాన్ని తల్లులకు వివరించారు. పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. పెరటి తోటల పెంపకం గురించి బాల అమృతం వాడకం గురించి వివరిస్తూ పలు సూచనలు చేశారు. ఆకుకూరలు వాడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆకుకూరలు విలువలు తెలియజేస్తూ పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అమరేశ్వరి. కోటేశ్వరమ్మ. కమల. రాజేశ్వరి. పలువురు చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్ల ధర్నా



పెదనందిపాడు అక్టోబర్ 7. (ప్రభాతవార్త): ఆశా వర్కర్స్ న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పెదనందిపాడు లోని మండల ఆరోగ్య కేంద్రం వద్ద వద్ద ఆశా వర్కర్స్ చేపట్టిన ధర్నాలో రమణ పాల్గొని ప్రసంగించారు.ఆశా డే సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాపితంగా ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా కార్యక్రమం జరుగుతుందని రమణ తెలిపారు.ఆశాలకు కనీస వేతనం పెంచి 26 వేలు ఇవ్వాలని అన్నారు.అన్ని రకాల సెలవులు ఇవ్వాలనికోరారు.జాతీయ శెలవులు,పండుగ శెలవులు,వారాంతపు శెలవులు,క్యాజువల్, మెడికల్ లీవ్ లు ఇవ్వడం లేదని అన్నారు.కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ను ఆశా వర్కర్స్ గా మార్పు చేయాలని కోరారు.అప్పటివరకు ఆశాలతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు, వేతనం చెల్లించాలని కోరారు.దహన సంస్కారాల ఖర్చు 20 వేలు చెల్లించాలని కోరారు.5జి మొబైల్స్, సిమ్ కార్డులు ఇవ్వాలన్నారు.నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని,పి.హెచ్.సి.కి వెళ్ళి న ప్రతి సందర్భంలో టి.ఎ., డి.ఎ. లు చెల్లించాలని కోరారు.ఎ.ఎన్.ఎం.,జి.ఎన్.ఎం.శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్ట్ ల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.సి.ఐ.టి.యు.మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల నియామకం చేయాలని కోరారు.నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని కోరారు.రికార్డ్స్ మరియు అదనపు పనులు చేయిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఆశాలను పి.హెచ్. సి.లోనే కుర్చోబెట్టడం మానుకోవాలని అన్నారు.అనంతరం పి.హెచ్. సి.డాక్టర్ బి.ప్రియంవదకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో మద్దూరి సరిత ,పి.సరళాదేవి,మేరి మణి,టి. రత్నకుమారి ,రాణి,త్రివేణి,జ్యోతి,మరియమ్మ,విజయ,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## సజ్జ సాగు... రైతుకు, భూమికి లాభదాయక మైన పంట : శాస్త్రవేత్తలు

యడ్లపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త : శనగ పంటకు ముందు పొలం ఖాళీగా ఉంచకుండా లాభదాయక పంటగా సజ్జ సాగు రైతుకు ఎంతో ఆదాయాన్ని ఇవ్వడంతోపాటు భూసారాన్ని పెంపొందించి రైతుకు దోహదపడుతుందని ఆచార్య యన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ



పరిశోధన సంచాలకులు డాక్టర్ పివి సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని జాలాది గ్రామంలో మంగళవారం ఏరువాక కేంద్రం వారిచే నిర్వహించిన జిబిన క్షేత్రదినోత్సవం మరియు రైతు సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడో 40,50సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో పండించిన సజ్జ ఇప్పుడు రైతులు సాగుచేసే మంచి దిగుబడులను సాధించగలుగుతున్నారని, గ్రామంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన ఎబివి 04 రకం అశాజనకమైన దిగుబడుల సాధించే అవకాశం ఉందని, రైతులు నిరూపించారన్నారు. ఈ ప్రాంత పంటల సరళిలో సజ్జ పంట రావడం ఎంతో ఆనందంగా ఉందని, పంట ఆరోగ్యం, పశువుల ఆరోగ్యంతోపాటు, మానవ ఆరోగ్యాన్ని కాపాడటంలో సజ్జ పంట ముందు ఉంటుందన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయంలో యువత ముందుకురావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ నూతన వంగడాల సాగు ద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉండటంతోపాటు కొంతసులువుగా ఉంటుందన్నారు. కాబట్టి యువత వ్యవసాయంలోకి రావడం ద్వారా వ్యవసాయాన్ని వాణిజ్య దిశగా తీసుకొని వెళ్లవచ్చని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్ఎస్ఎన్ దుర్గాప్రసాద్, చిరుధాన్యాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సివి చంద్రమోహన్ రెడ్డి, నర్సరావుపేట ఎడిఎ కెవి శ్రీనివాసరావు, డిఆర్సిసి మేనేజర్ డాక్టర్ కె అమలకుమారి, బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన విద్యార్థినులు, అభ్యుదయ ఆభ్యుదయ రైతులు, దుర్గా శంకరరావు, నిమ్మల శంకరరావు, పోపూరి శివరామకృష్ణ, గరగ రమేష్, జాగర్లమూడి రామారావు, ముద్దన పున్నారావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్ నగేష్, శాస్త్రవేత్త పిపి సత్యగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేష్ పర్యటన : ఎమ్మెల్యే ప్రవీణ్



పెదకూరపాడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త : రాష్ట్ర యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా విద్యా, ఐటీశాఖమంత్రి నారా లోకేష్ పర్యటన జరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. యువత భవిష్యత్తు కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం విద్యా, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ముంబై పర్యటన చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పెట్టుబడులపరంగా, ఉద్యోగ అవకాశాల పరంగా వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి తిరిగి మంచి రోజులు వచ్చాయన్నారు. ముంబై పర్యటనలో భాగంగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశమై ఏపిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కంపెనీల స్థాపనకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.

## ఉత్పత్తి దశలోనే నకిలీ మందులను అడ్డుకోవాలి



గుంటూరు కల్చరల్,అక్టోబర్ 7,ప్రభాతవార్త : కల్తీ మందుల కట్టడిలో ఉదాశీనంగా వ్యవహరిస్తే దేశ పురోగతే ప్రమాదం లో పడుతుందని ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ ఉత్పత్తి దశలోనే వాటిని అడ్డుకోవాలని అవగాహన సంస్థ సభ్యుల సమావేశంలో పాల్గొన్న వక్తలు డిమాండ్ చేశారు.సంస్థ కార్యాలయంలో “నకిలీ మందులు-దేశ విదేశాల్లో మృతు య్యవు పాలవుతున్న ప్రజలు” అన్న అంశంపై సమావేశం జరిగింది.సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ చేవలేని ఔషధ నియంత్రణ విభాగాల పుణ్యమా అని విచ్చలవిడిగా సాగుతున్న నకిలీ మందుల దందాలు ప్రజారోగ్యాన్ని బలితీసుకుంటూనే ఉన్నాయన్నారు.తాజాగా దగ్గుమందుల కాటుకు మధ్యప్రదేశ్,రాజసా ్ధన్‌లలో పదుల సంఖ్యలో పిల్లలు కడతేరి పోవడం దేశవ్యాప్తంగా కలవరం సృష్టిస్తుంది.సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఇండియాలో లభించే ఔషదాల్లో 25శాతం నకిలీవేనని గతంలో ఒక అధ్యాయనంలో తేలిందని,నిజానికి ప్రస్తుతం పట్టుబడుతున్న వాటిల్లో పోలిస్తే నకిలీల బెడద ఇంకెన్నో రెట్లు అధికంగా ఉంటుందన్నారు.సమావేశంలో భావన్నారాయణ,వెంకటరత్నం తదితరులు ప్రసంగించారు.

## ఎంటిఎంసి కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ 2047 యూనిట్ ఏర్పాటు



తాడేపల్లి, అక్టోబర్ 7,ప్రభాతవార్త : మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్వర్ణాంధ్ర విజన్ 2047 యూనిట్ కార్యాలయాన్ని రాజస్తాన్ రాష్ట్ర ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు సందర్శించి ఏపి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదరిక నిర్మూలన కార్యక్రమమైన పి4కు సంబంధించిన సమగ్ర సమాచారం,అది అమలుచేసే విధానం నియోజకవర్గం మరియు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా వివరించారు.అలాగే వివిధ శాఖల పనితీరు ను ఎప్పటికప్పుడు మదింపు చేస్తూ 2047నాటికి అనుకున్న లక్ష్యం నెరవేర్చు నిమిత్తమై రూపొందించిన కీ పెర్ఫ్మామెన్స్ ఇండికేటర్స్ గురించి సమూలంగా తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కొరకు అలాగే స్వర్ణాంధ్ర సాధనకొరకు తీసుకోంటునన కార్యక్రమాలను చాలా గొప్పగా ఉనా ్నయని ఆనందం వ్యక్తంచేశారు.కార్యక్రమంలో డైరెక్టర్లు చేతన్ ప్రకాశ్‌మండల్,నిర్మల్ సేధీ,వినేష్ సింగ్వీ,డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ నుండి లతీష్,స్టాటిస్టికల్ ఆఫీసర్,ప్లానింగ్ నుండి ఉపగణాంక అధికారి బాబురావు,జిల్లా ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆఫీసు నుండి ఉప గణాంక అధికారి సౌలురాజు,మంగళగిరి సహాయ గణాంక అధికారి దానబోయిన బాల నాగేశ్వరరావు,జిల్లా మరియు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## జాతీయ స్థాయిలో ఇంటాక్ కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్

గుంటూరు విద్య,అక్టోబర్ 7,ప్రభాతవార్త : 6 నుంచి 9వ తేదీ వరకు సభ్యులు శిక్షణ ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) సభ్యులకోసం జరిగిన సామర్థ్య నిర్మాణ



వర్క్‌షాప్ 1వ రోజు దేశంలోని విభిన్న వారసత్వ రకాల జాబితా, డాక్యుమెంటేషన్,పరిరక్షణకు సంబంధించిన కీలకాంశాలపై దృష్టి సారించింది. సెషన్‌లో తొలిరోజు ఇంటాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్,చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా,మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్,వివిధ డివిజన్స్ డైరెక్టర్ ్స డాక్టర్ సప్న,పూర్ణిమ, నిరూపమా, ఏ. విజయ,దీప్తి సభ్యులను ఉద్దేశించి దిశానిర్దేశం చేశారు.డాక్యుమెంటేషన్ సెషన్‌లో శిక్షణ,సామర్థ్య నిర్మాణం మరియు వారసత్వంలో పరిశోధన తదితర అంశాలపైన అవగాహన కలి ్పంచారు.ఏపి నుండి ఇంటాక్ సభ్యులు గుంటూరు చాప్టర్,విజయవాడ,కడప,విశాఖపట్నం నుంచి ఢిల్లీలో మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ లోధిరోడ్డులోని ఇంటాక్ ప్రధాన కార్యాలయంలో హాజరైయ్యారు.అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు,అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్,ఇంటాక్ సభ్యులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు,మేకల రవీంద్రబాబు, ఎన్.సుకీర్తి,కె.ప్రవీణ, డాక్టర్ రేణుకారాణి,ఎస్.మహిపాల్‌రెడ్డి, ఈ.రమేష్,ఎం.వెంకటసుబ్బారెడ్డి,నాగభూషణం,వెంకట్రామిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## మాస్టర్ ప్లాన్-విజన్ డాక్యుమెంట్‌కు సహకరించాలి



పొన్నూరు, అక్టోబరు 7,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి అధారిటీ(సిఆర్‌డిఏ) ఆదేశాల మేరకు పొన్నూరు మునిసిపాలిటీ మాస్టర్ ప్లాన్, విజన్ డాక్యుమెంట్ తయారీకి పొన్నూరు పురప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్వే ఇంజనీరింగ్ కన్సల్‌టెన్సీ లిమిటెడ్, హైదరాబాదు వారు మాస్టర్‌ప్లాన్ తయారీ, విజన్ డాక్యుమెంట్ తయారీకి సంబంధించిన పలు సూచనలు చేశారన్నారు. 59,913మంది మునిసిపాలిటీ జనాభా కలిగి ఉన్నందున ఈ ప్రాంతంలో టూరిజాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారన్నారు. స్వర్ణపురి పట్టణంలో ఎక్కువ అతి పురాతనమైన దేవాలయాలు ఉన్నందున దీన్ని ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధిచేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. చెరువులు, కాలువలు శుభ్రపరచుకునేందుకు, పార్కులు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ఆర్వే ఇంజనీరింగ్ వారు చెప్పారన్నారు. మాస్టర్‌ప్లాన్ తయారీ, విజన్ డాక్యుమెంట్ తయారీపై ఏవైనా సందేహాలు, సలహాలు, సూచనలు ఉన్నట్లయితే మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పూర్తి వివరాలను తెలియజేయాలన్నారు. పొన్నూరు పట్టణాభివృద్ధికి ప్రజలు, మేధావులు, విద్యావంతులు సహకరించాలని కోరారు. ఈ సదస్సులో మునిసిపల్ డిఇ వెంకయ్య, పట్టణ ప్రణాళికాధికారి రఘురామ్, రెవెన్యూ అధికారి తోట వెంకటేశ్వరరావు, పట్టణ సర్వేయర్ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, ఆర్వే ఇంజనీరింగ్ సిబ్బంది, నాయకులు ఆకుల సాంబశివరావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్, పఠాన్ అహమ్మద్‌ఖాన్, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్,గురుబాలు తదితరులు పాల్గొన్నారు.

## ఛలో విజయవాడ ధర్నాకు తరలి వెళ్లిన ఉపాధ్యాయులు




పొన్నూరు, అక్టోబరు 7,ప్రభాతవార్త: విద్యారంగ,ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టి పోరుబాట ఛలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి పొన్నూరు నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్,ప్రధాన కార్యదర్శి ఎం.వెంకయ్య, స్టేట్ కౌన్సిలర్ ఎస్.విజయబాబు, జిల్లా కార్యదర్శి జి.శివరామకృష్ణ, కాకుమాను మండలాధ్యక్షుడు ఎం.సీతారామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి జి.రాజేష్, జిల్లా కార్యదర్శి కె.ఆదినారాయణ, అన్వర్‌బేగ్, లాల్‌సాహెబ్, వివిడి ప్రసాద్, షేక్ బద్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సిద్ధంగా ఉండండి



పొన్నూరు, అక్టోబరు 7,ప్రభాతవార్త: త్వరలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అందుకు అన్నీ రాజకీయ పార్టీల నాయకులు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బిఎల్వోల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు ఇంటింటికి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్‌కు ఒకరు చొప్పున బిఎల్యేలను నియమించుకొని అందుకు సంబంధించిన వివరాలను కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇంటింటికి తిరిగి సర్వే చేసే బిఎల్వోలతోపాటు రాజకీయ పార్టీలు నియమించిన బిఎల్యేలు కూడా సర్వేలో పాల్గొన్నట్లయితే ఓటర్ల జాబితా నూరుశాతం పక్కాగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. మరణించిన ఓటర్లను, శాశ్వితంగా వలస వెళ్ళిన ఓటర్లను, డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్లను తొలగించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభమయ్యే తేదీలను, అందుకు సంబంధించిన విధి విధానాలను త్వరలో తెలియజేస్తామన్నారు. మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీనియర్ అసిస్టెంట్ మొగసాటి శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్ లాల్, సిరాజ్, రాజకీయ పార్టీల నాయకులు బండ్లమూడి బాబూరావు, చింతలపూడి మురళీకృష్ణ, గోపిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

## వీధులను పరిశుభ్రంగా ఉంచుదాం !



పొన్నూరు, అక్టోబరు 7,ప్రభాతవార్త: మండల కేంద్రమైన చేబ్రోలులో వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని చేబ్రోలు పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. రోడ్లు, కాలువల పక్కన పిచ్చిమొక్కలు, గడ్డి, తదితరాలు పెరిగి విష సర్పాలకు, దోమలకు నిలయంగా మారడంతో పిచ్చిమొక్కలు, గడ్డి నివారణకు గడ్డి మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంట్లోని చెత్తా చెదారాలను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి పంచాయితీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజస్థాపనకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచినీటిని కాచి చల్లార్చి వడపోసుకొని తాగాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైనట్లయితే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి...



పొన్నూరు, అక్టోబరు 7,ప్రభాతవార్త: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే విధంగా నాయకులు, కార్యకర్తలు ఆలోచన చేయాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి నాయకులు సూచించారు. మంగళవారం తాడేపల్లిలో జగన్మోహనరెడ్డిని పొన్నూరు వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ అన్ని విభాగాలకు సంబంధించి నాయకులను నియమించుకోవాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రానున్న 2029నాటికి తప్పని సరిగా అధికారంలోకి వచ్చి అన్నీ వర్గాల పేదలకు మేలు జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

## మాచర్ల స్లమ్ ఎస్ఎల్ఎఫ్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు

మాచర్ల, అక్టోబరు 7 ప్రభాతవార్త: స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ స్లమ్ (ఎస్ఎల్ఎఫ్) ప్రతిష్టాత్మక స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవవార్డును సాధించింది. హోమ్ కంపోస్టింగ్ నిర్వహణ, టెర్రస్ గార్డెన్‌లో మొక్కల పెంపకం వంటి పర్యావరణ హిత




కార్యక్రమాల్లో చూపిన కృషికి ఈ అవార్డు లభించింది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా నెహ్రూనగర్ ఎస్ఎల్ఎఫ్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం, హోమ్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెన్ నిర్వహణలో మాచర్ల నెహ్రూనగర్ ఎస్ఎల్ఎఫ్ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కేసీపీ జీఎం వెంకటరమణ, మెప్మా సీడీఎం, సీఓ అంజలి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నెహ్రూనగర్ ఎస్ఎల్ఎఫ్ సభ్యుల కృషిని అధికారులు అభినందించారు.

## మృతి చెందిన మహిళా కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



మాచర్ల, అక్టోబరు 7 ప్రభాతవార్త: 25వ వార్డులో తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళా కార్యకర్త మందుల అచ్చమ్మ అకస్మాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మట్టి ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, 25వ వార్డు ఇన్‌ఛార్జి దొడ్డా చందు, జ్యోతి, అంజి, మంజుల వెంకటేశ్వర్లు, మాచర్ల బాబు చింతమళ్ల అడవిరాముడు, మందుల విజయలక్ష్మి, దాసరి శిరీష, దొడ్డా వెంకటేష్, కృష్ణ, షేక్ బాషా, చిరుమామిళ్ల శేఖర్, పల్లం బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



పిడుగురాళ్ల, అక్టోబరు 7 ప్రభాతవార్త : గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ, రాష్ట్ర ఎంబీసీ సాధికార సమితి సభ్యుడు బిజ్జిలి వెంకట్రావు, పట్టణ కార్యనిర్వహణ కార్యదర్శి యడవల్లి కొండలుగౌడ్, పట్టణ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యరగని వెంకట్ (లడ్డు), 16వ వార్డు ఇన్‌చార్జి జమ్మిశెట్టి రామకృష్ణ (జెమిని), 26వ వార్డు ఇన్‌చార్జి షేక్ సైదా, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు కెపి వెంకయ్య, టీడీపీ నేత మీనిగల అంజిబాబు, కూటమి నేతలు, వాల్మీకి బోయ సంఘ నేతలు పాల్గొన్నారు.

## పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి




అమరావతి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని క్రైస్తవులు తమ ప్రార్ధన మందిరాలు నిర్మించుకున్న స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ దానియేల్‌కు పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఎంతోకాలంగా క్రైస్తవ ప్రార్ధన మందిరాలు ఏర్పాటు చేసుకున్న స్థలాలకు ఆయా మందిరాల పేర్లపై పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని వినతితో కూడిన సంతకాలు చేసి తహశీల్దార్‌కు అందించారు.

## అమరావతి ప్రభుత్వ ఆయుర్వేద హాస్పటల్‌కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడంపై హర్షం



అమరావతి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : మండల కేంద్రమైన అమరావతిలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పటల్‌కు స్వచ్ఛఆంధ్ర అవార్డు రావడం హర్షనీయమని మండల వైకాపా అధ్యక్షులు భవిరిశెట్టి హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన అమరావతిలోని ఆయుర్వేద హాస్పటల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జైనాబ్ జహను, మండల వైకాపా అధ్యక్షులు భవిరిశెట్టి హనుమంతరావు, వైకాపా పంచాయితీరాజ్ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలా లక్ష్మీనారాయణ, వైకాపా నాయకులు ఇర్ల శివరామకృష్ణలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల వైకాపా అధ్యక్షులు భవిరిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆయుర్వేద హాస్పటల్ రూపురేఖలు మార్చిన ఘనత డాక్టర్ జైనాబ్ జహ కే దక్కిందన్నారు.

## అమరావతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



అమరావతి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : అమరావతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు దక్కిందది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సర్వేలో పల్నాడు జిల్లాలో అమరావతి ఆయుర్వేద వైద్యశాలకు ప్రతిష్ఠాత్మక ఉత్తమ డిస్పెన్సరీ అవార్డు దక్కింది. ఎంతో కృషి చేసి అమరావతి వైద్యశాలకు జిల్లాస్థాయిలో మంచి పేరు తీసుకువచ్చిన డాక్టర్ జనాబ్ జహాని ఏపి పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు కౌశిక ప్రసాద్, శ్రీ సరస్వతీ శిశువిద్యామందిర్ ప్రధానోపాధ్యాయులు కోలా వెంకటేశ్వరరావు, పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

## గుండెపోటుతో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మృతి



పెదకూరపాడు, అక్టోబర్ 7 ప్రభాతవార్త : గుండెపోటుతో ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మృతిచెందిన ఘటన పెదకూరపాడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయం ఉపాధిహామీ పథకం విభాగంల ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాదర్‌బాషా (47) గుండెపోటు సంభవించడంతో మార్గమధ్యలో మృతిచెందారు. గుంటూరు నుండి మంగళవారం రోజువారి విధులకు హాజరైన ఖాదర్‌బాష పెదకూరపాడు బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఒక్కసారిగా ఒళ్ళంతా చెమటలు పట్టి తీవ్ర గుండెనొప్పి రావడంతో స్థానిక యువత, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ స్టాఫ్ పెదకూరపాడు సిహెచ్‌సికి తరలించారు. వైద్య పరీక్షల నిర్వహించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఖాదర్‌బాషా స్వగ్రామం పేరేచర్ల. పిల్లల చదువు కోసం గుంటూరులో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. మృతినికి భార్య ఆశాబేగం, అభినా పర్వీన్, రుభినా పర్వీన్ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయనకు ఎంపిడివో సాయిలీల, ఏపీడీ నారాయణ, ఏపివో కోటమ్మ, ఏవో సోమయాజులు, క్షేత్ర సహాయకులు నివాళులర్పించారు.

## శ్రీశివలింగేశ్వర భక్తబృందం ఆధ్వర్యంలో అన్నదానం

తెనాలి టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన శ్రీశివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి ఆధ్వర్యంలో, మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద, నందివెలుగు గ్రామానికి చెందిన, మాజీ మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దివంగత ఆరిశెట్టి వెంకటరావు 9వ వర్ధంతి సందర్భంగా, వారి



కుటుంబసభ్యుల సహకారంతో, సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో, వికలాంగులు, వృద్ధులు, నిరాశ్రాయులకి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను మాట్లాడుతూ, కీ.శే ఆరిశెట్టి వెంకటరావు 9వ వర్ధంతి సందర్భంగా, వారి కుటుంబసభ్యుల సహకారంతో నేడు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని, గుంటూరు కు చెందిన స్వామి జ్ఞానప్రసన్న పిలుపు మేరకు గత ఏడున్నర సంవత్సరాలుగా, మా సేవాసమితి ఆధ్వర్యంలో, దాతల సహకారంతో, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఏ ఒక్కరూ ఆకలి దప్పికతో మరణించ కూడదని, సేవాసమితిని వేదికగా చేసుకుని, దాతలసహకారంతో, ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యులను చేసేవిధంగా సేవాసమితి పనిచేస్తుందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న అందరికీ, ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో దివంగత ఆరిశెట్టి వెంకటరావు కుటుంబసభ్యులు, రాధారాణి, తోట గోపినాథ్ మరియు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## సిజెపై దాడిని ఖండించిన బిఎస్పీ

తెనాలి టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడి న్యాయ వ్యవస్థ పైజరిగిన దాడిగా పేర్కొంటూ, ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామని, బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇంచార్జ్ కారుమంచి సునీల్ సందీప్ పేర్కొన్నారు. దేశ న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా



సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడి పట్ల సునీల్ సందీప్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ భారత రాజ్యాంగానికి ప్రధాన స్తంభమని, అవ్యవస్థను భయపెట్టే ప్రయత్నాలు దేశ ప్రజాస్వామ్య ఆత్మను కించపరుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు జడ్జి పై దాడి అనేది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని, అది న్యాయం, సత్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమేనన్నారు. దేశ ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల ఉన్న విశ్వాసం దెబ్బతీసే విధంగా ఇటువంటి చర్యలు జరిగినప్పుడు, ప్రభుత్వం మరియు కేంద్ర సంస్థలు దానిపై అత్యంత కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగం, న్యాయం, సమానత్వం, స్వాతంత్ర్యం అనే విలువల కోసం నిలబడు తుందని ఆయన గుర్తుచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడిని, బహుజన సమాజ్ పార్టీ తరఫునతీవ్రంగా ఖండిస్తూ, దేశ వ్యాప్తంగా ప్రజలు, న్యాయవాదులు, మరియు సామాజిక సంస్థలు ఈ ఘటనపై ఐక్యంగా స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాజేష్, బోగీనల ప్రవీణ్, అరిగె ప్రసాద్, గద్దటి ప్రకాష్, కంచర్ల సుమంత్, బోనిగల ప్రవీణ్, పిల్లి దాసు తదితరులుపాల్గొన్నారు.

## 'స్వచ్ఛ తెనాలి'ని సాధిద్దాం : మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలి మునిసిపాలిటీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త: స్వచ్ఛ తెనాలికి ప్రజలందరి భాగస్వామ్యం కావాలని, మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుటలో పురపాలక పారిశుధ్యసిబ్బంది చాలా అంకితభావంతో పనిచేస్తున్నారని, వారికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలోని 28వ వార్డు నందు నిర్వహించిన మెయిన్ డ్రైవ్ మరియు స్పెషల్ శానిటేషన్ వర్క్ పనులను పర్యవేక్షణ చేసి మునిసిపల్ అధికారులకు శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చిన చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక. ఈ కార్యక్రమంలో 28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముప్పా ఏసుబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్యసిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

తెనాలి మునిసిపాలిటీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై కోర్టు హాల్లో జరిగిన దాడిని నిరసిస్తూ, తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. అనంతరం కోర్టు ప్రాంగణం ఎదుట ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్



గవాయి పై దాడి సంఘటన అత్యంత బాధాకరమని, సాక్షాత్తు దేశ సుప్రీంకోర్టు జరుగుతుండగా కోర్టు హాల్లోనే ఈ రకమైన దాడి చేయడం క్షమించరాని నేరమని, ఈ రకమైన చర్యలు న్యాయవ్యవస్థకు తలవంపులు తెచ్చే విధంగా ఉంటాయని, మరల ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకొని శిక్ష పడాలన్నారు. న్యాయస్థానంలో న్యాయమూర్తి పై దాడి జరగటంపై, కేంద్ర ప్రభుత్వం చాలా తీవ్రంగా స్పందించాలని, ప్రజాస్వామ్య వాదులందరు కూడా ఈ సంఘటనను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు భేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షులు అన్నం పిన్నారావు, కార్యదర్శి హరిదాసు గౌరిశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, దాసరి శ్రీధర్, సుభాష్ బాబు పలువురు న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

## కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందాలి: హరిప్రసాద్



తెనాలి టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త: అసంఘటిత కార్మికులకి ప్రభుత్వపథకాలు అందించ టంలో, తెలుగునాడు కార్మిక సంఘం ముందుంటుందని, పట్టణ తెలుగునాడు కార్మికసంఘం అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళ వారం, పట్టణంలోని మారీస్ పేటలో గల కార్మికశాఖ కార్యాలయంలో, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ ని కలిసి, అసంఘటిత కార్మికులకు ఉన్న ప్రభుత్వ పథకాలు, వాటిని కార్మికులకు చేరవేసే విధానాలు తెలుసుకుని, నియోజకవర్గంలో ఉన్న అన్ని రంగాలలో ఉన్న కార్మికులుకు కలిగే ప్రయోజనాలు గురించి తెలుసుకొని, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను, వారికి కూటమి ప్రభుత్వం ద్వారా ఉపయోగాలు తెలియచేసి, వారిని లబ్ది దారులను చేయుటకోసం చేసే ప్రయత్నంలో భాగంగా తెలుగునాడు కార్మికసంఘం కార్మికులకి అండగా ఉంటుందన్నారు.

## గంజాయి కేసులో నిందితులకు జైలు

తెనాలి టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:గంజాయి అక్రమంగా కలిగివున్న కేసులో నిందితులకి జైలుశిక్ష విధించిన వైనం. వివరాల్లోకి వెలితే, 2021వ సంవత్సరం అక్టోబర్ 16న, తెనాలి మండలం పెదరావూరు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా పోలీసుల్ని చూసి ముగ్గురువ్యక్తులు పారిపోయే ప్రయత్నంలో వారిలో ఒక వ్యక్తి దొరకకుండా పోగా మిగిలిన ఇద్దరిని పోలీసులు వెంబడించి పట్టుకోగా వారి పేర్లు గంటలపల్లి పూర్ణచందు, ముత్తంశెట్టిపాలెం, తెనాలి, రెండో వ్యక్తి తన పేరు మొగలి సాయి, సి,యం, కాలనీ, తెనాలి అని చెప్పి పారిపోయిన మూడో వ్యక్తి పేరు గండికోట గోపి అలియాస్ పవన్ కళ్యాణ్, అని చెప్పగా, అప్పటి రూరల్ సిఐ వారిని మధ్యవర్తుల



సమక్షంలో సోదా చేయగా, వారి వద్ద ఉన్న నల్లటి కవర్ ని పరిశీలించగా ఆ కవర్లో ముదురు ఆకులు పూలు కాయలు ఉండి గంజాయి కు సంబంధించిన వస్తువులు కల్గి ఉన్నారు. అనంతరం సిఐ ఆ గంజాయి కి సంబంధించిన పూలు ఆకులు కాయలు వారి నుండి స్వాధీనం చేసుకొని ముద్దాయిలు ఇద్దరినీ మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న ఆటోని మరియు 500 గ్రాములు గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. తదుపరి పరిశోధనలో భాగంగా మూడో ముద్దాయిని కూడా అరెస్టు చేసి కోర్టులో చార్జీలు దాఖలు చేసినారు. మంగళవారం కోర్టు విచారణలో మొదటి ఇద్దరు ముద్దాయిలు పూర్ణచందు మరియు మొగిలి సాయి లపై కేసు నిరూపణ కాగా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ ఏ పవన్ కుమార్ వారి ఇద్దరికీ చెరోక 3 నెలల జైలు శిక్ష మరియు చెరోక 1000/ రూపాయలు జరిమానా విధించినారు. మూడో ముద్దాయిపై నేరం నిరూపణ కానందున అతని మీద కేసుని కొట్టివేశారు. ఈ కేసులో అప్పటి తెనాలి రూరల్ ఇన్స్పెక్టర్ సి. సుబ్రహ్మణ్యం కేసుని పరిశోధించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా అప్పటి ఎస్సై డి.ఏడుకొండలు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ వాదించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి. శ్రీనివాసరావు మరియు ప్రస్తుత ఎస్సై ఆనంద్ పర్యవేక్షించారు.

# బాపట్ల జిల్లా వార్త



## సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి: కలెక్టర్

బాపట్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త: సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం , జాప్యం ఉండరాదన్నారు.. 406 సామాజిక మరుగుదొడ్లు మొదటి విడతలో జిల్లాకు మంజూరు కాగా, 217 సామాజిక మరుగుదొడ్లు మాత్రమే నిర్వహించడం ఏమిటని వివరాలు అడిగి



తెలుసుకున్నారు. 37 సామాజిక మరుగుదొడ్లు ఇప్పటివరకు ప్రారంభించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. మండలాలవారీగా సమీక్షించారు. సత్వరమే నిర్మించాలని ఆయన సూచించారు. నూతనంగా జిల్లాకు మరో 342 సామాజిక మరుగుదొడ్లు మంజూరయ్యాయన్నారు. 171 సామాజిక మరుగుదొడ్లు నిర్మాణం ప్రారంభించక పోవడం ఏమిటని ఆరా తీశారు. ఇంజినీరింగ్ అధికారులు చురుకుగా పని చేయాలని సూచించారు. 4,242 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యం కాగా నేటికీ పెండింగ్ లో ఉండటం పై ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యపరిచి నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన జిల్లాస్థాయి ప్రదర్శన బాపట్లలో నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు చేపట్టాలన్నారు. వాణిజ్యశాఖ అధికారులు, ఎంపీడీవోలు సమన్వయంతో ఈ కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించాలన్నారు. అక్టోబర్ 13న సెమినార్ లు, స్వదేశీ ఉత్పత్తులపై ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో అవగాహన ప్రదర్శనలు చేయాలన్నారు. ఆప్కో, చేనేత రంగంలోని 230 ప్రాంతాలలో ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి వచ్చిన 144 దరఖాస్తులు పెండింగ్ లో ఉండడంపై ఆరా తీశారు. రెవిన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పాలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, డిపిఓ ప్రభాకర్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా ధర్మబద్ధంగా ముందుకు సాగాలి: ఎస్పీ

బాపట్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త: వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ధర్మబద్ధంగా ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని రచించిన



మహనీయుడు వాల్మీకి మహర్షి అని అన్నారు. యుగాలు మారినా సైతం రామాయణం ఇచ్చే ఆదర్శాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు.. ప్రతి మనిషిలో ఉన్న చెడును తొలగించి మంచి దారిలో నడిపించే శక్తి వాల్మీకి రచనలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి. సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ. షేక్ మోలుద్దీన్ గార్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామాయణ కావ్యం పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస గ్రంథం



బాపట్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ధర్మబద్ధమైన జీవితాన్ని నడిపేందుకు దోహదపడే సామాజిక మరియు తాత్విక అంశాలతో రామాయణ కావ్య రచన చేసిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డా. పి. ప్రసూన రాణి అన్నారు. వ్యవసాయ కళాశాలలో మంగళవారం జరిగిన వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం రచించబడిన రామాయణ కావ్యం పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాస గ్రంథమని, ఆ గ్రంథంలో పొందుపరచబడిన అనేక ఉదాత్తమైన పాత్రల స్వభావాలు నేటి తరానికి అనుసరణీయాలన్నారు. నీతివంతమైన పరిపాలనకు, నియమ నిబంధనలతో కూడిన ప్రజా ప్రవర్తనకు మూలస్తంభాలుగా నిలిచిన పాత్రల స్వరూప స్వభావాలను కళ్ళ ముందు నిలిపి, ఒక క్రమబద్ధమైన సామాజిక నియమావళిని తన కావ్యం ద్వారా రూపొందించిన వాల్మీకి కవి జయంతిని జరుపుకోవడం సామాజిక బాధ్యత అన్నారు. ఆయన చేసిన ఆధ్యాత్మిక కృషి అఖండ భారతావనికి ఆదర్శనీయమైందన్నారు. విస్తరణ విద్య విభాగాధిపతి డా.ఎం.రమాదేవి విద్యార్థులు రామాయణ తత్వ మూలాలను గ్రహించి విలువలకు కట్టుబడి ఉండాలన్నారు. వాల్మీకి బోధించిన సత్యం, ధర్మం, కరుణ నేటికీ ప్రేరణగా నిలుస్తాయన్నారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ అధికారులు డా. జి.విజయకుమార్, డా. షేక్ అబ్దుల్ సలాం, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 'జలజీవన్ మిషన్ అమలులో అధికారుల నిర్లక్ష్యం బాధాకరం'

బాపట్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త: జలజీవన్ మిషన్ అమలులో అధికారుల నిర్లక్ష్యం బాధాకరం అని ఎంపిటీసి సభ్యులు, రాష్ట్ర మాజి సైనిక సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. కర్లపాలెం మండలం కొత్త నందాయ పాలెం గ్రామంలో మంగళవారం జరిగిన గ్రామ సభలో సర్పంచ్ ఆట్ల వెంకటేశ్వరమ్మ అయ్యప్ప రెడ్డి తో కలిసి పాల్గొని పలు సమస్యల పై మరియు గ్రామాభివృద్ధి కి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ అధికారుల




అంచనాల ప్రకారమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జల జీవన్ మిషన్ కోసం కొత్త నందాయ పాలెం గ్రామానికి షుమారు 26 లక్షల యాభై వేల రూపాయల నిధులు మంజూరు చేసినప్పటికీ, గ్రామంలో ఇంకా షుమారు నూట ఇరవై ఇళ్లకు మంచి నీటి కుళాయిలు బిగించలేక పోవటానికి కారణం కేవలం అధికారుల నిర్లక్ష్యమే అని దుయ్యబట్టారు. జలజీవన్ మిషన్ ఆరంభం నుండి ప్రజా ప్రతినిధిగా ఎన్నో సార్లు అడిగినా అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకుండా, పదేపదే గ్రామ సభలలోనూ మరియు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాలలో అడుగుతున్నందుకు రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వచ్చి పొంతన లేని సమాదానాలు చెప్పటం బాధాకరం అని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు విచారం వ్యక్త పరిచారు. ఈ విషయం పై ఆర్డబ్ల్యుఎస్ ఏఈ వసుధను వివరణ కోరగా, ఈసారి మళ్ళీ కొత్త అంచనాలు తయారు చేసి పంపిస్తాం అని సమాధానం ఇవ్వగా, మళ్ళీ అంచనాలు ఎందుకు వేయాలి అని మరియు అప్పుడు కూడా గ్రామానికి సరిపడానే అంచనాలు వేశారన్నారు. అంచనాల ప్రకారమే నిధులు కూడా వచ్చాయన్నారు. మరి ఇంకా వందకు పైగా ఎందుకు వేయకుండా , పని పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ కు ఎలా బిల్లు లు పెట్టారన్నారు. కొత్త నందాయ పాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద మంజూరు కాబడిన నిధులతో ప్రతి ఇంటికి మంచినీళ్ల కుళాయిలు బిగించవలసి ఉండగా, ఇంకా నూట ఇరవై ఇళ్లకు మంచి నీటి సరఫరా కోసం కుళాయిలు బిగించక పోవటానికి అప్పటి జల జీవన్ మిషన్ పనులు చేయించిన అధికారులే బాధ్యత వహించేలా బాపట్ల జిల్లా కలెక్టర్ గారు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ తాండ్ర కోరారు. కార్యక్రమంలో సెక్రెటరీ మురళి రెడ్డి, సచివాలయం సిబ్బంది మరియు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌యు ను సందర్శించిన జర్మనీ ప్రతినిధుల బృందం

తాడేపల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీని జర్మనీకి చెందిన చెన్నైలోని జర్మన్ కాన్సూల్ జనరల్ మైఖేల్ హాస్పర్, హైదరాబాదులోని జర్మనీ కాన్సుల్ అమిత దేశాయ్‌లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు వర్సిటీలోని ఆచార్యులను, పరిశోధకులను కలసి విద్యా, పరిశోధన సహకారాల అవకాశాలను గురించి విస్తృతస్థాయిలో చర్చలు జరిపారు. అనంతరం వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొఫెసర్ డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయ్ మారుతీ, విదేశీ భాషల విభాగాధిపతి జమిందార్‌లను కలిశారు. చర్చల తర్వాత కాన్సుల్ జనరల్ క్యాంపస్‌లో సౌకర్యాలను చూసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలోని వందలాది మంది విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు చూసి ఆశ్చర్యపోయారు. ఈ బృందం జర్మన్ భాషలో చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించింది..

## కుచ్చెళ్ళపాడులో అంగన్‌వాడీకి స్వచ్ఛంద అవార్డు

వేమూరు అక్టోబరు 7 (ప్రభాతవార్త) : స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అమృతలూరు ప్రాజెక్టు పరిధిలోని వేమూరు మండలం ఎస్సీ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రానికి జిల్లా స్థాయిలో స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు లభించినట్లు సిడిపిఓ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోనే వేమూరు మండలం కుచ్చెళ్ళపాడు చుండూరు మండలంలోని యడ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న అనసూయ మహాలక్ష్మిలకు కలెక్టర్ చేతుల మీదుగా స్వచ్ఛందంగా అవార్డులు లభించాయన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త అనసూయ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు







నాయుడు ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సిడిపిఓ లక్ష్మీదేవి సూపర్‌వైజర్ అమృతవాణి సూచనలతో అంగన్‌వాడీ కేంద్రాలో ప్రతినెల మూడవ శనివారం అంగన్‌వాడీ పరిసరాలను కేంద్రాలను పరిశుభ్రతను చేపట్టామన్నారు. నా ఇల్లు ఎలా పరిశుభ్రంగా ఉంటుందో అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా పరిశుభ్రంగా ఉంచానన్నారు. రాష్ట్రస్థాయి అధికారులు మా కేంద్రాన్ని సందర్శించి పిల్లల హ్యాండ్ వాష్ విధానాన్ని పరిసరాలు పరిశుభ్రత వంట గదులు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించిపై అధికారులకు రిపోర్టు పంపించగా జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది అన్నారు. అవార్డు రావడానికి సూచనలు, సలహాలు ఇచ్చి సిడిపిఓ లక్ష్మీదేవి సూపర్‌వైజర్ అమృతవాణికి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ మద్యం విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి



వేమూరు అక్టోబరు 7 (ప్రభాతవార్త) : నకిలీ మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ కమీషనర్ ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి కె.విజయ తెలియజేశారు. మంగళవారం వేమూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి కొందరు నకిలీ మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నారని అటువంటి వారిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. నకిలీ మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి సత్వరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా నకిలీ మద్యం తయారీదారులపై కూడా దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెతో ఎక్సైజ్ సిఐ రవి, ఎస్సై శ్రీరామ్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

## ప్రతి క్షణం సాయిబాబా సేవకే అంకితం చేసిన ఘనత బాబూజీదే

పొన్నూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త: తన జీవితంలో ప్రతి క్షణాన్ని శ్రీ షిరిడి సాయిబాబాకే అంకితం చేసిన ఘనత శ్రీ సాయినాథుని శరత్ బాబూజీకే దక్కుతుందని శ్రీ సాయి రాంబాబు మెస్ అధినేత, ఆధ్యాత్మిక వేత్త వెలగం విజయ్‌గణేష్‌బాబు అన్నారు. శ్రీ సాయి



నాథుని శరత్ బాబూజి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాబూజీ తనను తాను ఎన్నడూ గురువుగా ప్రకటించుకోలేదన్నారు. 13 నవంబర్ 2010న బాబూజీ జర్మనీలోని ముర్నౌలో మహాసమాధి అయ్యారన్నారు. పేదలు, అనాథలు, వృద్ధులు, వికలాంగులు, పీడితుల పట్ల ప్రతి ఒక్కరూ జాలి, దయ, కరుణ చూపించాలని సూచించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ సాయి తత్వాన్ని గుర్తెరగాలని చెప్పారన్నారు. ఈ సందర్భంగా సాయినగర్‌లోని శ్రీ షిరిడి సాయి మందిరంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి కీర్తలను ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. విద్యానగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం, దుప్పట్లు, తదితర వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి పంచాయితీ కార్యదర్శి రాజు, పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్, కార్యదర్శి గుడివాడ పవన్, కోశాధికారి చిలకపాటి సింహాద్రి, జాహ్నవి, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలకు ఉత్తమ అవార్డు



పొన్నూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి ఉత్తమ అవార్డు దక్కింది. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించడం.....వైద్యశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి తదితర అంశాలకు సంబంధించి.. ..ప్రభుత్వం ప్రతి నెలా ప్రవేశపెట్టి వివిధ థీములతో ముందుకు సాగినందుకు గాను నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని ఉత్తమ వైద్యశాలగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా ఉత్తమ అవార్డును వైద్యశాల వైద్యాధికారి పిరోజ్‌ఖాన్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యశాల సిబ్బంది, పురప్రముఖులు డాక్టర్ పిరోజ్‌ఖాన్‌ను అభినందించారు.

## విషపు ఎరను ఉపయోగిస్తే సత్ఫలితాలు

పొన్నూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త: రైతులు విషపు ఎరను సక్రమంగా ఉపయోగిస్తే సత్ఫలితాలు వస్తాయని ఎడిఎలు సిహెచ్ తిరుమలాదేవి, వి.రామకోటేశ్వరి సూచించారు. మంగళ వారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎలుకల నివారణకు పంపిణీ చేసిన విషపు ఎర పంపిణీ



కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ రైతులు ఎలుకల బొరియలను పరిశీలించి విషపు ఎరను పది గ్రాముల పొట్లాలు కట్టి ఎలుక కన్నముల వద్ద ఉంచాలన్నారు. దీని ద్వారా సామూహిక ఫలితాలు వస్తాయన్నారు. రైతులందరూ ఒకే సమయంలో ఈ విధానాన్ని అవలంభించాలన్నారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాల ద్వారా ఈ విషపు ఎరను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, విఏఏ, ఎంపిఈఓలు సుప్రజ, వి.వాసవి, వెంకయ్య, ఎస్.సురేష్‌బాబు, ప్రియాంక, రైతులు, నాయకులు మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, సముద్రాల ఆశీర్వాదం, గూడూరు శేషగిరిరావు, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాష్ట్రపతి దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

### -ప్రజా సంఘాల నాయకులు

పొన్నూరు, అక్టోబరు 7, ప్రభాతవార్త: భారతదేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. స్థానిక మానవ హక్కుల వేదిక కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షకురాలైన భారత రాష్ట్రపతి ఈ దుస్సంఘటనకు చింతిస్తూ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన ఈ దాడి భారత రాజ్యాంగంపై, రాజ్యాంగ విలువలపై, లౌకికవాదంపై, న్యాయవ్యవస్థలపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ చర్య వ్యక్తిగతంగా, ఆవేశపూరితంగా చేసిన చర్య కాదన్నారు. దీని వెనుక ఒక ఉన్మాద పూరితమైన భావజాలం దాగి ఉందన్నారు. అదే సనాతన ధర్మ



పరిరక్షణోన్మాదమన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మనువాదులు గత కొంత కాలముగా నిరాటకంగా ఒక క్రమంలో జరుపుతున్న రాజ్యాంగ వ్యవస్థల విధ్వంసంలో ఇది ఒక భాగమని భావిస్తున్నామన్నారు. గవాయ్‌పై జరిగిన దాడి వెనుక ఉన్న కుట్ర కోణాన్ని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు జరిపించి, కుట్ర కోణాన్ని వెలికితీసి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని, న్యాయవాది రాకేష్ కిషోర్‌పై కోర్టు దిక్కారనేరం కింద ప్రాసిక్యూట్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు, మానవ హక్కుల వేదిక నాయకుడు జిఎస్ రాయెల్, కెఎన్‌పిఎస్ నాయకుడు శ్రీనివాస్ తోడేటి, షేక్ సుబాని, బి.శ్యామ్‌సుందర్, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## బిఎస్ఆర్‌ను ఘనంగా సత్కరించిన 'కూటమి' నాయకులు



వినుకొండ,అక్టోబర్7,ప్రభాతవార్త: శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన మహానాడు మీడియా అధినేత,ప్రముఖ పారిశ్రామికవేత్త వినుకొండ వాసి బోడేపూడి వెంకట సుబ్బారావు (బిఎస్ఆర్)ను కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కలిసిన వారిలో శివశక్తి ఫౌండేషన్ రిటైర్డ్ మేనేజర్ జీ.వీ రమణారావు,శావల్యాపురం సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం,వినుకొండ బీజేపీ ఇంచార్జి యార్లగడ్డ లెనిన్,పట్టణ తెలుగు యువత నాయకులు ఎన్.శ్రీనివాసరావు,బోడెపూడి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛాంధ్రలో వినుకొండను నెంబర్1గా నిలపడమే లక్ష్యం: చీఫ్‌విప్ జీవి



వినుకొండ, అక్టోబర్ 7, ప్రభాతవార్త: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వినుకొండను నెంబర్1 స్థానంలో నిలపడమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజి వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీ.వీ పాల్గొని డంపింగ్ చేసిన చెత్త తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ వైకాపా పాలనలో డిగ్రీ కాలేజి వద్ద డంపింగ్ యార్డు పెట్టి చదువుకునే విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. పట్టణం మూడు వైపులా చెత్త కొండలుగా పేర్చారని దీని వల్ల ప్రజలకు ఎంతో అసౌకర్యం కలిగిందని చెప్పారు. ప్రస్తుతం కూటమి పాలనలో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టడంతో క్లీన్ అండ్ గ్రీన్‌లో వినుకొండ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు,అధికారులు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్,కౌన్సిలర్లు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి క్రీడా పోటీల ప్రారంభం

వినుకొండ,అక్టోబర్7,ప్రభాతవార్త: స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని జెడ్పి పాఠశాల నందు మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా మొదలయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు హాజరై క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి వరకు ఎదగాలన్నారు. క్రీడల వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందని గెలుపోటములతో నిమిత్తం లేకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలని చెప్పారు. అలాగే పాఠశాల నందు ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జీ.వీ ప్రారంభించారు. స్కూల్‌కు సహాయ,





సహకారాలు అందజేస్తున్న దాతలను,ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో జఫ్రుల్లా, మున్సిపల్ ఛైర్మన్ షకీలా దస్తగిరి,జనసేన నాయకులు నాగశ్రీనురాయల్,పీఈటి రాధాకృష్ణమూర్తి,టిడిపి సీనియర్ నాయకులు పి.వి సురేష్,నంది నరసింహారావు,ముత్తినేని ఏడుకొండలు,గంగినేని రాఘవరావు,యశోద తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది'



వినుకొండ, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు అన్నారు. డిఎస్సీలో ఎంపికైన టీచర్లకు శిక్షణ కార్యక్రమం స్థానిక విఠంరాజుపల్లి సమీపంలోని వివేకానంద బీఈడి కాలేజి నందు మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్,ఎమెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాలన్నారు. గత వైకాపా పాలనలో డిఎస్సీ అభ్యర్థులు మోసపోయారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రతి ఏటా డిఎస్సీ విడుదలకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

## ఈపూరు ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాల్లో తనిఖీ

ఈపూరు,అక్టోబర్7,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్లలో త్రికోటేశ్వర వైన్స్,ఈపూరు గ్రామంలోని జనతా వైన్స్ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. ముందుగా డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా మద్యం కొనుగోలుదారులతో మాట్లాడి ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. క్యూఆర్ స్కాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేని యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎక్సైజ్ సంబంధిత నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



## కల్వర్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం



నూజెండ్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త: మండలంలో పెద్దవరం గ్రామం నుంచి ఐనవోలు గ్రామానికి వెళ్లే రోడ్డు కల్వర్టు అధిక వర్షం కారణంగా పడిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## శంకర్‌నాయక్‌కు ఎమ్మెల్యే 'కన్నా' నివాళి



సత్తెనపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త : పట్టణంలోని 3వ వార్డులో ఎస్.టి.సెల్ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ కన్నుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్‌నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే 13వ వార్డులో నోముల వెంకటేశ్వర్లు మృతి సమాచారం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సత్తెనపల్లిలో ఘనంగా వాల్మీకి జయంతి



సత్తెనపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : పట్టణంలోని 12వ వార్డులో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం, రచనల గురించి గుర్తు చేశారు. సమాజం క్షేమంగా ఉండేందుకు వాల్మీకి మహర్షి వంటి పెద్దలు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ రామాయణం చదివి ఆచరించాలన్నారు. రామాయణ విలువలు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త : పట్టణంలో పేద విద్యార్థులకు ఈ నెల 11వతేదీ శనివారం అందించే స్కాలర్‌షిప్‌లకు సంబంధించి కార్యక్రమ కరపత్రాలను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన స్కాలర్‌షిప్ దాతలు మండవ సీతా రామాంజనేయులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయడం సంతోషమన్నారు. స్కాలర్‌షిప్‌లతో పేద విద్యార్థులు ముందుకు వెళ్ళేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సమాజంలో ఆర్థిక వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరూ పేద కుటుంబాల చదువులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బంగారు కుటుంబాలను ఎంపిక చేసి దత్తత తీసుకొని ఆ కుటుంబాలకు అండగా నిలిచే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, నేరెళ్ళ విజయలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 7 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం రామాయణాన్ని రచించిన వాల్మీకి మహాఋషి జయంతిని నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ, మానవతా విలువలు ప్రతిభంభించే విధంగా వాల్మీకి రామాయణాన్ని రచించారని తెలిపారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే కావ్యం రామాయణం అన్నారు. వాల్మీకి ఆశయాలను, పవిత్రమైన ఆలోచనలను పాటించి సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ బి.కృష్ణారావుతో పాటు అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, సత్తిరాజు, డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## బంగారు వర్తకులకు అసోసియేషన్ అండగా ఉంటుంది : కపలవాయి విజయ్‌కుమార్



నరసరావుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త : రాష్ట్రంలో వెండి, బంగారు, నగల తయారీ దారులు, అమ్మకం దారుల సమస్యల పరిష్కారానికి బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కాకినాడ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెండి మరియు బంగారం, వజ్రాల వ్యాపారుల అసోసియేషన్ సమావేశానికి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో జిఎస్‌టి నిబంధనలకు సంబంధించి జరిగిన సడలింపులు ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. అదే విధంగా బంగారు నగల తయారీ, అమ్మకాలకు సంబంధించి, బంగారు వినియోగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ నిబంధనల గురించి అసోసియేషన్‌లు సమావేశాలలో తెలియజేయాలని కపలవాయి విజయ్‌కుమార్ సూచించారు. కాకినాడ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్‌షోతో పాటు కపలవాయి విజయ్‌కుమార్‌కు ఘన సత్కారం జరిగింది.

## కల్తీ మద్యంపై వైకాపా తప్పుడు ప్రచారం : కొమ్మాలపాటి



నరసరావుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త : కల్తీ మద్యంపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు.స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను సైతం లెక్క చేయకుండా గడిచిన ఐదేళ్ళ వైకాపా పాలనలో దుర్మార్గాలు చేశారని ఆరోపించారు. వారి హయాంలో రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని విమర్శించారు. కల్తీ మద్యం మరణాలపై వైకాపా సమాధానం చెప్పాలన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం వైకాపాకు అలవాటుగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఇచ్చిన హామీలను నూటికి నూరుశాతం అమలు చేశారన్నారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం తయారు చేసే వారిని గుర్తించి ప్రభుత్వం అరెస్ట్ చేసిందన్నారు. అయితే ఈ సంఘటనలో తెలుగుదేశంపార్టీ నాయకులైన జైచంద్రారెడ్డి, సురేంద్రనాయుడు పాత్ర ఉందని ప్రభుత్వం గుర్తించి విచారణకు సైతం ఆదేశించిందన్నారు. కల్తీ మద్యం ఎవరు చేసినా వారిని ఉపేక్షించబోమని కొమ్మాలపాటి శ్రీధర్ తెలియజేశారు.

## పట్టణంలో అల్లు అరవింద్ పర్యటన



నరసరావుపేట, అక్టోబర్ 7 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మంగళవారం ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితో కలిసి ఆయన పల్నాడు రోడ్డులోని కాసు మల్టీ ఫ్లెక్స్ సినిమా థియేటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ కాసు కుటుంబంతో తమకు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వారితో తమ ప్రయాణం స్నేహపూర్వకంగా కొనసాగుతుందన్నారు. మాజీమంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి తమకు ఎంతో మిత్రుడు అని, తమ తండ్రి అల్లు రామలింగయ్యతో ఎంతో సన్నిహితంగా ఉండేవారని తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తమకు మంచి మిత్రుడు అని పేర్కొన్నారు. తమకు ఉన్న స్నేహంతోనే కాసు సెంట్రల్ మాల్‌లో థియేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని అల్లు అరవింద్ తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ తమకు అల్లు అరవింద్ కుటుంబంతో ఎన్నో ఏళ్ళుగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలియజేశారు.

## వ్యక్తి అనుమానాస్పద మృతి

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 7 ప్రభాతవార్త : పట్టణ పరిధిలో లారీ క్లీనర్ ఒకరు మంగళవారం అనుమానాస్పదంగా మృతిచెందారు. 50 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుడు కోటేశ్వరరావుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుంటూరు రోడ్డుకు వెళ్ళే మార్గంలో కోటేశ్వరరావు అనుమానాస్పదంగా పడి ఉన్నట్లు టూటౌన్ సి.ఐ. అశోక్ తెలిపారు. మృతుడు లారీ క్లీనర్‌గా పని చేస్తుంటాడని సమాచారం. మృతుని భార్య అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. తెలిపారు. మృతునికి ఇద్దరు ఆడ పిల్లలు, భార్య ఉన్నారు.

## 'వాల్మీకుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి'

సత్తెనపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : వాల్మీకుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకిలు కొన్ని ప్రాంతాలలో ఎస్.టి.లుగా, మరికొన్ని ప్రాంతాలలో బిసిలుగా ఉన్నారని తెలిపారు. వాల్మీకి జయంతి రోజున సెలవు ప్రకటించాలని కోరారు. వాల్మీకిలకు సామాజిక భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహంకాళి వెంకట్రామయ్య, రాబట్టు, సుభాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

సత్తెనపల్లి, అక్టోబర్ 7 ప్రభాతవార్త : మండలంలోని నందిగామ గ్రామంలో పంచాయితీ కార్యదర్శులకు మంగళవారం ఒక రోజు జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి, థీమ్ 5 లక్ష్యాలలోని పరిశుభ్రత - పచ్చదనంపై ఎంపిక చేసిన కార్యదర్శులకు వివిధ అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ లక్ష్మణరావు, డిఆర్‌పి నరసింహనాయక్ పాల్గొని మాట్లాడారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ట్రైనర్లుగా రామకృష్ణ, శివ కోటేశ్వరరావు, శివకుమారి వ్యవహరించారు.



## వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శారదా హైస్కూల్‌కు బెంచీలు, కుర్చీలు, ర్యాక్స్ పంపిణీ





చిలకలూరిపేట,అక్టోబర్7,ప్రభాతవార్త: వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, రోటరి, ఇన్నర్‌వీల్ సహకారంతో పట్టణంలోని శ్రీ శారదా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తోటకూర రామకోటయ్య 25వ వర్ధంతిని పురస్కరించుకొని వారి జ్ఞాపకార్థం రూ 4లక్షల విలువచేసే బోధనా పరికరాలను అందచేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సౌకర్యార్థం 50 బెంచీలు, ఉపాధ్యాయులకు 12 ఎస్ చైర్స్, పుస్తకాలు పెట్టుకోవడానికి 12 ఉడెన్ ర్యాక్స్, 4 గ్లాస్ బోర్డులు, 25 సైన్స్ చార్ట్‌లు, 20 ప్రముఖ శాస్త్రవేత్తల ఫోటోలను అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఆచార్య నాగార్జున యూనివర్సిటి రెక్టార్, ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ రామినేని శివరాంప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ తరు పున అందించిన రోబోటిక్స్ తరగతులకు విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరై మంచి పరిజ్ఞానాన్ని సంపాదిస్తే రాబోవు కాలమంతా క్వాంటమ్ కంప్యూటింగ్‌దే కాబట్టి వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నాగార్జున యూనివర్సిటి రిజిష్టార్ ఆచార్య జి సింహచలం పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయిని చేరుకోగలరని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, ఆటో మిషన్లపై అవగాహన పెంపొందించుకుంటారని, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ అలవరుచు కుంటారని, భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఫౌండేషన్‌కు సహాయ సహకారాలు అందిస్తున్న యూఎస్ఎ కు చెందిన ఆళ్ల వెంకట్, తోటకూర వెంకటనారాయణలు ఆత్మీయ అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. వెంకటరాయ ఫౌండేషన్ మరియు యూఎస్ఎ వారి సహకారంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మూడు జిల్లా పరిషత్ పాఠశాల లలో రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాంలను ప్రారంభించడం జరిగిందని వెంకటనారాయణ వివరించారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ హైస్కూల్, ఉన్నవ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, పెదనందిపాడులోని జిల్లా పరిషత్ హైస్కూళ్లకు ప్రతి పాఠశాలకు ఆర్గనైజర్లు రూ 2.75లక్షల విలువైన రోబొటిక్ కిట్లను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకటనారాయణ, చిలకలూరిపేట రోటరిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నార్నె జయలక్ష్మీ, చెన్నుపాటి చైతన్య, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె రత్నజ్యోతి, చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు,రోటరి సెంటనరీ గవర్నర్ జాష్టి రంగారావు, చిలకలూరిపేట రోటరిక్లబ్ సభ్యులు, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. యూనివర్సల్ హెల్ప్ వ్యవస్థాపకులు రెబ్బాధ్రువ్,వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ ఫౌండర్ తోటకూర శ్రీనివాస్, సలహాదారులు కొడాలి అనిల్, పాఠశాల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఏయంజి పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి గుంటూరుజిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

చిలకలూరిపేట,అక్టోబర్7,ప్రభాతవార్త: పట్టణంలోని ఏయంజి పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం అండర్ 19 బాస్కెట్ బాల్ ఉమ్మడి గుంటూరుజిల్లా బాలబాలికల జట్ల ఎంపికను నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు



జిల్లాల పాఠశాలలనుంచి 80మంది విద్యార్థులు పోటీలలో తలపడ్డారు. ఈ పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ కార్యదర్శి నరసింహారావు, సహయ కార్యదర్శి పద్మారావు పర్యవేక్షణలో జరిగాయి. ఈ పోటీలను ఏయంజి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృపాదానం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వీరరాఘవయ్య ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరుజిల్లా బాస్కెట్ బాల్ జట్టుకు నాగశరత్, అస్రాం, యండి అబ్దుల్‌సమీర్, కె జయరాం, యశ్వంత్, హేమంతరెడ్డి, జి అంకమ్మరావు, త్రినాథ్, వెంకట రాజేష్, ఎల్ లాకేష్, సిహెచ్ అక్ష, కె వంశీకృష్ణలు ఎంపిక అయ్యారు. జిల్లా బాలికల జట్టుకు ఈ ప్రశాంతి, చందన, అనిత, మనీషా, నేత్ర, పావని, హరిక, శ్రీవల్లి, రష్మి, శ్రావ్య, గౌతమీ, జ్యోతి చంద్రిక, అమృత వర్షిణీలు ఎంపిక అయ్యారు.

## స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో 'మోడరన్' విద్యార్థి హేమచరణ్ ఎంపిక



చిలకలూరిపేట,అక్టోబర్7,ప్రభాతవార్త: పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ అండర్17 విభాగంలో పట్టణంలోని మోడరన్ స్టెల్లార్ పాఠశాలకు చెందిన విద్యార్థి సిహెచ్ హేమచరణ్ ఎంపికయ్యారు. కాగా పాఠశాలలో సాయంత్రం ఆ విద్యార్థినిని మోడరన్ విద్యాసంస్థల అధినేత చేబ్రోలు మహేష్, డైరక్టర్ ప్రత్యూష, ప్రిన్సిపల్ ప్రసూన, పిఈటి నవీన్‌లు అభినందించారు.

## ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య పనులు



చిలకలూరిపేట,అక్టోబర్7,ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు ఆదేశాల మేరకు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. బస్టాండ్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించారు. ఈ పనులను పర్యవేక్షించిన పారిశుద్య అధికారి సిహెచ్ రమణరావు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బస్టాండ్ ఆవరణలో ఏర్పడిన గుంటలలో వర్షపునీరు నిల్వఉండి దుర్వాసనతో పాటు విషకీటకాలు, దోమలు వృద్ధిచెంది బస్టాండ్ ఆవరణలో అసౌకర్య వాతావరణం నెలకొని ఉన్నదన్నారు. ప్రజా ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు జెసిబితో బస్టాండ్ ఆవరణలోని పిచ్చి చెట్లను తొలగించడం, పారిశుద్య పనులను చేపట్టటం జరిగిందని అన్నారు. అదేవిధంగా వర్షపునీరు నిల్వఉన్న గుంటలలో నీరు నిల్వ ఉండేందుకు వీలులేకుండా డస్ట్‌తో గుంటలను పూడ్చివేయడం జరిగిందని తెలిపారు.

## ఎస్టీయు 'ఛలో విజయవాడ'లో పాల్గొన్న ఉపాధ్యాయులు



చిలకలూరిపేట, అక్టోబర్ 7, ప్రభాతవార్త: ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయు ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ వెళుతూ నరసరావుపేట సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులచే చేపిస్తున్న బోధనేతర పనులు బహిష్కరణ చేస్తున్నామన్నారు. పాఠాల చెపుతాం, మా బడిలో మా పిల్లలకు భోజనం పెడతాం కానీ, ఏ బోధనేతర పనులు చేయమని అన్నారు. విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరణ చేస్తున్నట్లు వివరించారు. జీఎస్‌టి 2.0 వంటి రాజకీయ కార్యక్రమాలు పాఠశాలలో జరగనివ్వమని అన్నారు. బోధనేతర పనుల బహిష్కరణపై ఈనెల 10వ తేదిన జిల్లా కలెక్టర్, డిఈఓలకు మెమోరాండం ఇవ్వాలని తీర్మానించడం జరిగిందన్నారు. సిపిఎస్‌పై సరైన నిర్ణయం చేయకుంటే మరో బిఆర్‌టిఎస్ ఉద్యమం తథ్యమని అన్నారు. వెంటనే 12వ పిఆర్‌సి ఛైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో ఎస్టీయు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి అక్కయ్య, ఎస్‌టియు నాయకులు వి జయప్రకాష్, బొంతా రవి, షేక్‌మస్తాన్‌వలి, జి కోటేశ్వరరావు, సతీష్ కుమార్, షేక్ ముగ్బుల్ బాషా, దుర్గాప్రసాద్, చావలి మల్లేశ్వరరావుతో పాటు చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల ఫ్యాప్టో నాయకులు 150మంది విజయవాడ ధర్నా శిబిరంలో పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



యడ్లపాడు, అక్టోబర్ 7, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం నుండి చెంఘీస్కాన్‌పేట వెళ్ళే మార్గంలో ఆటో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై టి శివరాకమకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు స్నేహితులు మద్యం సేవించి గుంటూరు నుండి మండల పరిధిలోని చెంఘీస్కాన్‌పేట బంధువుల ఇంటికి ఆటోలో వచ్చే సమయంలో ఇరువురు మద్యం సేవించి ఉన్నారని, అయితే మార్గ మధ్యలో ప్రమాదం చోటు చేసుకోవటంతో గుంటూరుకు చెందిన షేక్ రఫీ మృతి చెందాడని, అతని తల భాగం పూర్తిగా దెబ్బతినటంతో గుర్తుపట్టరాని విధంగా ఉందని, సంఘటనా స్థలంలో లభించిన కొన్ని అధారాలనుగునంగా చెంఘీస్కాన్‌పేట గ్రామంలో దర్యాప్తు నిర్వహణలో భాగంగా బంధువుల ఇంటికి వచ్చిన రెండవ వ్యక్తి వారు ప్రయాణించిన ఆటో గుర్తించటం జరిగిందన్నారు. ఆటోను, సదరు వ్యక్తిని స్టేషన్‌కు తరలించి విచారించుతున్నామని తెలిపారు. పూర్తివివరాలు తెలియవల్సి ఉంది.

8-10Pg5 9TH_8-10Pg5.qxd 10/7/2025 11:59 PM Page 1



# భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు




## తెలుగు రాష్ట్రాల మీదుగా గుజరాత్‌కు రాకపోకలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 7, ప్రభాత వార్త:** తీర్థయాత్రలలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించాలనుకునే ఔత్సాహిక యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ సీమాంధ్ర మీదుగా గుజరాత్ కు భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 26న మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట నుండి బయలు దేరే 'భారత్ గౌరవ్' ప్రత్యేక పర్యాటక రైలు భవ్య గుజరాత్ ప్యాకేజ్ (9 రాత్రులు / 10 రోజులు) కోసం బయలు దేరుతుంది. ఈ రైలు ఈనెల 27న, సికింద్రాబాద్ కు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్,నాందేడ్, పూర్ణాల మీదుగా ద్వారకాలోని ద్వారకాధీశ్ ఆలయం,నాగేశ్వర ఆలయం, బేట్‌ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం,మోడేరా లోని సూర్యదేవాలయం (మోడేరా), రాణి కి వావ్ (పటాన్), ఏకతా నగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీలను యాత్రికులకు చూపుతుంది.

**ప్రయాణ మార్గం:** రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు,ఒంగోలు, చీరాల,తెనాలి,విజయవాడ, ఖమ్మం,కాజీపేట్, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్,పూర్ణా మీదుగా ప్రయాణిస్తుంది.

**ప్యాకేజ్ ధరలు:** ఎకానమీ క్లాస్ (స్లీపర్) రూ.18, 400, స్టాండర్డ్ (3ఎసి) 30,200 వేలు, కంఫర్ట్ (2ఏసి) 39,900 వేల రూపాయలు.

**సౌకర్యాలు:** రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో కూడా ఐఆర్‌సిటి సిసిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు**

ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ తిరుపతి-అనకాపల్లితిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే నెంబర్ 07481 ప్రత్యేక రైలు నవంబరు 02 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 0800 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 09 30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబరు 07482 ఎక్స్ ప్రెస్ ఈనెల 03 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 0535 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 0740 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.



# ప్రజాజీవితంలో పాతికేళ్లు!

## ప్రధానిమోడీ పునఃశ్చరణం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 యేళ్ల పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 యేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తనపరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సిఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆనాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సిఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తుచేశారు. భారీభూకంపం, సూపర్‌సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లోపెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

# సిజెఐపై దాడిపై నాకెలాంటి పశ్చాత్తాపంలేదు

## ఆ దేవుడే ఇలా చేయించాడు: న్యాయవాది రాకేశ్ కిశోర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని న్యాయవాది రాకేశ్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఓ విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై సిజెఐ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, అందుకే ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 16న మధ్యప్రదేశ్‌లోని జవారీలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై సిజెఐ ముందు పిటిషన్ విచారణకు వచ్చిందని రాకేశ్ కిశోర్ గుర్తుచేశారు. ఆ సమయంలో "వెళ్లి మీ దేవుడినే ఏదైనా చేయమని అడగండి" అంటూ సిజెఐ వ్యాఖ్యానించడం తనను కలచివేసిందన్నారు. "న్యాయం చేయకపోయినా పర్వాలేదు కానీ, నమ్మకాలను ఎగతాళి చేయకూడదు. పిటిషన్‌ను తిరస్కరించడం అన్యాయం" అని ఆయన పేర్కొన్నారు. తాను హింసకు వ్యతిరేకినని, అయితే ఒక సాధారణ పౌరుడు ఎందుకిలా చేశాడో ఆలోచించాలని అన్నారు. "నేను ఏ మత్తులోనూ లేను. ఆయన చర్యకు ఇది నా ప్రతిస్పందన మాత్రమే. నాకు భయంలేదు, పశ్చాత్తాపం లేదు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు. ఈ పని దేవుడే చేయించాడు. నన్ను జైలుకు పంపినా, ఉరితీసినా అది ఆయన చిత్తమే'నని రాకేశ్ కిశోర్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం, గుర్తింపు ప్రమాదంలో ఉన్నాయని, ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. తనను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేయడంపైనా రాకేశ్ కిశోర్ స్పందించారు. న్యాయవాదుల చట్టంలోని సెక్షన్ 35 ప్రకారం, క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి, నోటీసు ఇచ్చి, తన వాదన విన్న తర్వాతే చర్యలు తీసుకోవాలని, కానీ బార్ కౌన్సిల్ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఇక, సిజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలిపింది. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్



జాన్ క్లార్క్



మైఖేల్ హెచ్. డివోరెట్



జాన్ ఎం. మార్టినిస్

## క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌పై పరిశోధన

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకుగాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్లగలదు. దీనినే టన్నెలింగ్ అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్‌సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే స్థూల కణంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.

# 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఐదురాష్ట్రాలపరిధిలోని 18 జిల్లాలను కలుపుతూ నాలుగు ప్రాజెక్టుల రైల్వే నెట్‌వర్క్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశంలో ఈ నాలుగు ప్రాజెక్టులకు సుమారు రూ.24, 634 కోట్ల వ్యయం కాగలదని అంచనావేసారు. వాటిలో మహారాష్ట్రలోని వార్ధా భూసావాల్‌ల మధ్య ఉన్న మూడు, నాలుగో లైన్లు 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌పరిధిలోని గోండియా, డోంగర్‌గఢ్ నాలుగోలైన్ 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్ పరిధిలోని 259 కిలోమీటర్ల నిడివికలిగిన వడోదర, రత్లాం మూడు నాలుగు లైన్లను అభివృద్ధి చేస్తారు. ఇటార్సీ, భోపాల్, బీనాలమధ్య నాలుగోలైన్ 237 కిలోమీటర్ల నిడివికలిగింది కూడా ఈ రైల్వే నెట్‌వర్క్ పరిధిలోఉంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు 85.84 లక్షల జనాభా ఉన్న 3633 గ్రామాలకు, రెండు ప్రధాన స్ఫూర్తిదాయక జిల్లాలు విదిషా, రాజ్‌నంద్‌గావ్‌లకు రవాణాసదుపాయం మరింతగా మెరుగు పడుతుందని కేబినెట్ అనంతరం సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అంతే కాకుండా 18 జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికూడా పెరుగుతుందని, ప్రజల్లో ఆత్మనిర్భరతను మరింత పెంచాలన్న ప్రధానిమోడీ లక్ష్యానికి అనుగుణంగా ఈప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని తెలిపారు.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

## ఏడుగురికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని శికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. శికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈపేలుడు సంభవించినట్లు శికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని శికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మోహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. అంతకు ముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ఉగ్రవాదులు ఇదేరైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది.

# నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

## రక్షించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**లక్నో, అక్టోబరు 7:** ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు సాధారణంగా కరెంటు, నీళ్లు, రోడ్లు, రేషన్ కార్డుల వంటి సమస్యలపై ఉంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు విని అధికారులు నివ్వెరపోయారు. తన భార్య రాత్రిపూట పాముగా మారి తనను కాటు వేయడానికి ప్రయత్నిస్తోందని ఓ భర్త చేసిన ఆరోపణ ఇప్పుడు సంచలనంగా మారింది. మహమూదాబాద్ పరిధిలోని లోధ్సా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి సమాధాన్ దివస్ (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిశాడు. "అయ్యా, నా భార్య నసీమున్ రాత్రి అయితే చాలు పాములా మారిపోతోంది. నన్ను కాటు వేయడానికి వెంట పడుతోందని ఫిర్యాదు చేశాడు. తన భార్య వల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆమె తనను మానసికంగా తీవ్రంగా హింసిస్తోందని వాపోయాడు. ఇప్పటికే చాలాసార్లు తనను చంపడానికి ప్రయత్నించిందని, అయితే ప్రతీసారి తాను మెలకువతో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డానని మెరాజ్ తెలిపాడు. నిద్రలో ఉన్నప్పుడు ఏదో ఒక రాత్రి తనను చంపేయగలదని భయం వ్యక్తం చేశాడు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు సమర్పించాడు. ఈ వింత ఫిర్యాదుతో ఆశ్చర్యపోయిన జిల్లా కలెక్టర్, వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం), పోలీసులను ఆదేశించారు. పోలీసులు దీన్ని మానసిక వేధింపుల కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో వేగంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఇంకెంత మందిని కరుస్తోందో ఏమో అని ఒకరు వ్యాఖ్యానించగా, ఏమైనా నాగమణి దాచిపెట్టావా? అని మరొకరు చమత్కరించారు. నీ పెళ్లి జీవితంలో శ్రీదేవి దొరికింది, చాలా అదృష్టవంతుడివి అంటూ 1986 నాటి నాగిన్ సినిమాలో నటి శ్రీదేవి పోషించిన ఇచ్ఛాధారి పాము పాత్రను గుర్తుచేస్తూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. ఈ విచిత్రమైన కేసులో అసలు నిజం ఏంటో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# యేడాది తర్వాత కేజ్రీవాల్‌కు అధికారిక నివాసం కేటాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు అధికారిక బంగ్లా లభించింది. సిఎం అధికారిక నివాసాన్ని విడిచిపెట్టిన దాదాపు ఏడాది తర్వాత ఆయనకు కేంద్రం అధికారిక బంగ్లాను కేటాయించింది. 95, లోధి ఎస్టేట్‌లోని టైప్ 7 బంగ్లాను కేటాయించింది. అయితే, బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్‌లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరింది. కానీ ఆ బంగ్లాను జూన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించడంతో.. కేజ్రీకి వేరే బంగ్లా అలాట్ చేశారు. 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు. ఈ క్రమంలో తనకు అధికారిక బంగ్లా కేటాయించాలంటూ కేజ్రివాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పదిరోజుల్లోగా ప్రభుత్వనివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# సింగర్ జుబీన్ బాడీగార్డ్ ఖాతాల్లో రూ. కోటి లావాదేవీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఓ కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గార్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సిఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్నిప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.


# ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్!



**న్యూయార్క్, అక్టోబరు 7:** మధ్య శ్రేణి, హెవీ డ్యూటీ ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ ట్రక్కులను అమెరికాకు అధికంగా ఎగుమతి చేసే 5 దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ ఉన్నాయి.

# వలసలపై ట్రంప్ ఉక్కుపాదం

## యుఎస్ వెళ్లేందుకు భారతీయ విద్యార్థుల అనాసక్తత




**వాషింగ్టన్, అక్టోబర్ 7:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యుఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్రదేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు చైనా విద్యార్థులకు యుఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్యకంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ యేడాదిమేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనావేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే సోషల్ మీడియా వెట్టింగ్ అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్1బి వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

# సంక్షిప్తంగా..

## పికెతో చిరాగ్ చెట్టాపట్టాల్

**పాట్నా, అక్టోబరు 7:** బీహార్‌లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని చిరాగ్‌అన్నారు. బిజెపి కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు.

## 'కమల్‌హాసన్ అంతరాత్మను అమ్ముకున్నారు'



**చెన్నై, అక్టోబరు7:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై బీజేపీ నేత అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటంపై మండిపడ్డారు. కమల్ అధికార డిఎంకెకి అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యసభ సీటు కోసం తన ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరూర్ బాధితుల పరామర్శకు వెళ్లి తొక్కిసలాటలో ప్రభుత్వం తప్పు లేదని అంటే ఎవరైనా అంగీకరిస్తారా ఆయన మరీ ఇంత దిగజారాలా అసలు ఆయన మాటలను తమిళనాడు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నామలై అన్నారు.

## అధైర్య పడకండి.. నేనొస్తా, ఆదుకుంటా!

**చెన్నై, అక్టోబరు 7:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరూర్‌లో ఘటనాస్థలిని ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## బిజెపి నేతపై కాల్పులు.. దుర్మరణం

**బర్హంపూర్, అక్టోబరు 7:** ఒడిశాలోని బరంపురంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత, సీనియర్ న్యాయవాది పీతాబాస్ పాండాను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చంపారు. గత రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో బైకుంఠనగర్‌లోని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఇంటి సమీపంలోనే మాటువేసిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి పాండాను అడ్డగించారు. అత్యంత సమీపం నుంచి ఆయనపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో పాండా ఛాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

## గ్రేస్ ఓమైలీకి బ్రిటన్ పౌర పురస్కారం

**లండన్, అక్టోబర్ 7:** రెండేళ్ల క్రితం నాటింగ్‌హాంలో స్నేహితురాలిని కాపాడే ప్రయత్నంలో కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన భారత సంతతి యువతి గ్రేస్ ఓమైలీ కుమార్ (19)కి మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ద్వితీయ అత్యున్నత పౌర పురస్కారం జార్జ్ మెడల్‌ను ప్రకటించింది. 2023 జూన్ 13న గ్రేస్ తన స్నేహితురాలు జానబీ వెబర్‌తో కలిసి ఇంటికి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దాడి జరిగింది. వాల్డోకైలోకేన్ అనే వ్యక్తి వెబర్‌పై వెనకనుంచి కత్తితో దాడి చేయగా, గ్రేస్ ధైర్యంతో అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దాడిలో స్నేహితులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గ్రేస్ క్రీడాకారిణి కూడా. ఆమె ధైర్యం అసలైన శౌర్యానికి మంచి ఉదాహరణ అని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. గ్రేస్ కుటుంబ సభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఇలా మొత్తం 20 మందిని గౌరవిస్తారు.

8-10pg6exHMNWJQE 10_8-10pg6exHMNWJQE.qxd 10/8/2025 12:04 AM Page 1



# ప్రత్యేక కమిషన్‌తో బిసిల కులగణన నిర్వహించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**విజయవాడ, అక్టోబరు 7, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్ల అమలుకు ముందస్తుగా విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్‌కు విజ్ఞప్తి చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమాజ్ వాది పార్టీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు యాదవ్ వెల్లడించారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల తరహాగా రాష్ట్రంలోను జనగణనలో కులగణన చేపట్టాలని, ఆ దిశగా స్థానిక సంస్థల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేలా కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరామన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు రామకృష్ణ నేతృత్వంలో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర నాయకులు, వంగేపురం కార్తీక్ రాజు, ఆర్‌జెడి రాష్ట్ర నాయకులు, శ్రీనివాస్, వాసు సత్యనారాయణ మూర్తి, పార్టీ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, బీసీ సంఘాల నేతలు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, సమాజ్‌వాద్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్జేడీ నాయకులు ఆర్ఎస్ యాదవ్ తదితరులతో కూడిన బృందం వినతిపత్రం అందజేసింది. విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి బీసీలకు దామాషా రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కీలకమైన చర్యలు అమలయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను వాయిదా వేయాలని అభ్యర్థించింది. అనంతరం రాజ్‌భవన్ ఎదుట వివిధ రాజకీయ, బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకరులతో రామకృష్ణ మాట్లాడారు. వెనుకబడిన తరగతుల సామాజికఆర్థిక పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేయడానికి, ఖచ్చితమైన ఆధారాల ఆధారిత విధాన ప్రణాళిక కోసం ఒక ప్రత్యేక కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించామని వివరించారు. బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను అమలు చేయడం చాలా అవసరమని, అంకితమైన బీసీ కమిషన్ ద్వారా కుల గణన నిర్వహించిన తర్వాత, వాస్తవ వెనుకబడిన తరగతుల జనాభాను ప్రతిబింబించే ఫలితాల ఆధారంగా, విద్య, ఉపాధి మరియు స్థానిక సంస్థలలో బీసీలకు దామాషా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉపాధిలలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నమూనాను గవర్నరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రాజ్యాంగ ఆమోదాలు ఎదురుచూస్తున్నప్పటికీ, అడ్డంకులు కొనసాగుతున్నప్పటికీ, బీసీలను రక్షించడానికి రాష్ట్ర స్థాయిలో నిర్ణయాత్మక కార్యనిర్వాహక చర్య సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా ప్రదర్శించిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక సంస్థల ప్రస్తుత పదవీకాలం ఏప్రిల్ 2025 వరకు పొడిగించారని, రాష్ట్ర ఎన్నికల సంఘం ద్వారా, ప్రభుత్వం షెడ్యూల్‌ను ముందుకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తోందన్నారు. 2026 జనవరిలో ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు, పెండింగ్‌లో ఉన్న అన్ని అడ్డంకులను మొదటి కుల జనాభా గణన ద్వారా పరిష్కరించాలని, దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరగా, ఆయా అంశాలపై గవర్నరు సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర కుల గణన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరామన్నారు.



లండన్‌లోని ఇండియా హౌస్‌లో స్పీకరు అయ్యన్నపాత్రుడు,ఇతర ప్రముఖులు

# కామన్వెల్త్ పార్లమెంటరీ 68వ సదస్సులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, అక్టోబర్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బార్బడోస్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు (సిపిసి)లో పాల్గొంటారు. మంగళవారం నుండి ఈ నెల 10వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఆయన మంగళవారం లండన్ నుండి బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌కు బయలుదేరి వెళ్లారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ తరఫున ఆయన ప్రతినిధిగా హాజరవుతున్నారు. స్పీకరుతో పాటు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కూడా ఉన్నారు. కామన్వెల్త్ దేశాలలోని శాసనసభల సభాధ్యక్షులు తమ అనుభవాలను పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి మరియు ఆధునిక శాసనసభలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను చర్చించడానికి ఈ సదస్సు ఒక ప్రపంచ వేదికను అందిస్తుంది. 68వ సిపిసి సదస్సుకు బార్బడోస్ పార్లమెంట్ మరియు సిపిఏ బార్బడోస్ శాఖ ఆతిథ్యం ఇస్తున్నాయి. కామన్వెల్త్ పార్లమెంటేరియన్ల అతిపెద్ద సమావేశంగా సిపిసికి పేరుంది. ఈ సదస్సుకు కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) సభ్య దేశాల నుండి స్పీకర్లు, సభాధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు మరియు పార్లమెంటరీ సిబ్బంది హాజరవుతారు. జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ మరియు ప్రాదేశిక శాసనసభలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఏకైక పార్లమెంటరీ సంఘం సిపిఏ. సిపిఏ సభ్యత్వంలో దాదాపు 180 పార్లమెంట్లు మరియు శాసనసభలు ఉన్నాయి. భారత బృందానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహిస్తారు. ఈ పర్యటన సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ శాసనసభ తరఫున 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు, సిపిఏ జనరల్ అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడం మాకు చాలా సంతోషంగా ఉంది. సిపిఏ వార్షిక సదస్సు కామన్వెల్త్ పార్లమెంట్‌లలోని సహచరులతో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, నేర్చుకోవడానికి సభ్యులకు అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది. ఈ అనుభవం ఆంధ్రప్రదేశ్ శాసనసభ పనితీరును మరింత మెరుగుపరచడంలో సహాయపడుతుందని నేను ఆశిస్తున్నాను," అని అన్నారు. ది కామన్వెల్త్: ఎ గ్లోబల్ పార్టనర్ అనే ప్రధాన ఇతివృత్తంతో 68వ సిపిసి సదస్సు జరగనుంది. ప్రజాస్వామ్యానికి మద్దతుగా పార్లమెంట్‌లను బలోపేతం చేయడం, పార్లమెంట్‌లను మార్చేందుకు సాంకేతికత మరియు కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించడం, ప్రపంచ ఆరోగ్యంపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిశీలించడం, శాసనసభలపై విశ్వాసం పెంచడంఖి వంటి అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రతినిధిగా అయ్యన్నపాత్రుడు ప్రజాస్వామ్యానికి మద్దతుగా మన సంస్థలను బలోపేతం చేయడం. పజాస్వామ్యంలో విశ్వాసం మరియు పారదర్శకతను పెంచడం: పార్లమెంట్‌లు, ఎన్నికలలో ఆర్థిక పారదర్శకత., జాతీయ పార్లమెంట్‌లు వర్సెస్ ప్రాంతీయ, ప్రాదేశిక బదిలీ చేయబడిన శాసనసభలు: అధికారాల విభజనను రక్షించడం మరియు పరిరక్షించడంఖి అనే అంశాలపై జరిగే వర్క్‌షాప్‌లలో పాల్గొంటారు. ఇక రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌తో లండన్‌లో అయ్యన్నపాత్రుడు భేటీ అయ్యారు. 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొనేందుకు బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌కు వెళ్తున్న భారత ప్రతినిధుల గౌరవార్థం యూకేలోని భారత హైకమిషనర్ లండన్‌లోని ఇండియా హౌస్‌లో విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పాల్గొన్నారు.

# జిల్లాల పర్యటనకు పవన్‌కళ్యాణ్

### - షెడ్యూల్ సిద్ధం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కార్యాలయం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ నెలలో జిల్లాల పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలును ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సిద్ధం చేస్తోంది. తొలుత పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వెళ్తారు. అక్కడ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆ పాఠశాలను పరిశీలిస్తారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కోనసీమ జిల్లా రాజోలులో పంచాయితీరాజ్ శాఖ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లోనూ పర్యటిస్తారు. ప్రభుత్వ కార్యక్రమాల అనంతరం ఆ ప్రాంత ప్రజలతో పవన్ కళ్యాణ్ సమావేశమవుతారు.

# జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ప్రజలు చనిపోతే మాజీ మంత్రి జోగి రమేష్ అన్న మాటలు మరిచిపోలేదు : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి ప్రజల చనిపోతే మాజీ మంత్రి జోగి రమేష్ అన్న మాటలు మాజీ సీఎం జగన్ గుర్తు తెచ్చుకోవాలని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తాగి జగన్ పాలనలో ఎంతమంది చనిపోయారో జనానికి తెలుసునన్నారు. జంగారెడ్డిగూడెం ఘటనప్పుడు పోతే పోయారు...ఇంకా ఏడుస్తారేంటి?' అని అప్పట్లో మంత్రిగా ఉన్న జోగి రమేష్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయని ఆరోపించారు. కల్తీ మద్యం మరణాల్ని సహజ మరణాలని చెప్పి నిందితుల్ని కాపాడే ప్రయత్నం చేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ధ్వజమెత్తారు. ఇప్పుడు కల్తీ మద్యం నిందితుల్లో టిడిపి నేతలున్నా తమ ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని ఎక్స్ సామాజిక మాధ్యమంలోని తన ఖాతాలో మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'కల్తీ మద్యం పట్టుకుంది మా ప్రభుత్వం. నిందితుల్లో ఇద్దరు మా పార్టీ వారుంటే వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు మా అధ్యక్షుడు. మీ ఐదేళ్ళ పాలనలో ఏం చేశారో మరిచిపోయి ఆరోపణలు చేయొద్దు. డబ్బు కక్కుర్తితో జే బ్రాండ్‌తో వేల ప్రాణాలు తీశారు'అని జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి శవాన్ని డోర్ డెలివరీ చేసిన వైకాపా ఎంఎల్‌సీ అనంతబాబుని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని జగన్‌ను ప్రశ్నించారు. 'సరికదా...ఇంటికి పిలిపించుకొని భోజనం పెట్టి సన్మానించారు. కల్తీ మద్యం గురించి, నిందితులకు వత్తాసు పలకడం గురించి మాట్లాడే అర్హత మీకు ఎక్కడుందని ప్రశ్నించారు.

# అత్యున్నత న్యాయస్థానంపై దాడి అంటే దేశంపైనే దాడి

### బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్




**విజయవాడ, అక్టోబరు 7,ప్రభాతవార్త** అత్యున్నత న్యాయస్థానంపై దాడి అంటే దేశం పైనే దాడి అని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టులో దేశ ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ బిఆర్ గవాయ్‌పై అనాగరిక దాడిని ఖండిస్తూ ది కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు విజయవాడలో న్యాయవాదులు కోర్టుల విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు నిరసనను ప్రదర్శిస్తూ కోర్టు నుండి బీసెంట్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీని కొనసాగించి అక్కడ సేవ్ జ్యుడీషియరీ సేవ్ నేషన్ అన్న నినాదాలు చేస్తూ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ న్యాయస్థానం లోనే ఇలా జరిగితే ఇక సామాన్య న్యాయమూర్తికి, న్యాయవాదులకు రక్షణ ఎక్కడుందని ప్రశ్నించారు. ఇటువంటి హీనమైన చర్యలు ఇక ముందు జరుగకుండా ప్రభుత్వమే తగు చర్యలు తీసుకోవాలన్నారు. బెజవాడ బార్ అధ్యక్షులు ఎకె భాషా మాట్లాడుతూ ఛీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. ఇది వ్యక్తిగత దాడి కాదని, న్యాయస్థానాల మీద దాడి అంటే భారత రాజ్యాంగం పైనే దాడన్నారు. ఇటువంటి హీనమైన చర్యలు ఇక ముందు జరుగకుండా ప్రధాని మోడీ సత్వరమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళా న్యాయవాదులతో పాటు బార్ కౌన్సిల్ మెంబరు చలసాని అజయ్‌కుమార్, బార్ మాజీ అధ్యక్షులు సంపర దుర్గా శ్రీనివాసరావు, మట్టా జయకర్, మహిళా న్యాయవాదులు నరహరిశెట్టి జ్యోతి, రాజా, సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు ఈ దాడిపై తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వానికి సూచనలు చేయాలని వినతిపత్రాన్ని అందచేశారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బాయ్‌కాట్ చేయాలి

### -టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7:** భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి.. శాంతి భద్రతలకు విఘాతం కల్పించి కుట్ర చేసిన వైసీపీని రాష్ట్రం నుంచి బాయికాట్ చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఈమేరకు ప్రకటన చేశారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చే పెద్దల డైరెక్షన్ తోనే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని, డా.బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లడానికి ప్రయత్నించిన వైసీపీ నీచ సంస్కృతిని ప్రజా సంఘాలు, కుల సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు.

క్రూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్ లో ఉన్నారని, అంబేద్కర్ విగ్రహాన్ని నాశనం చేసి నరరూప రాక్షసుల్లా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలను సభ్యసమాజం నుంచి వెలివేయాలన్నారు. రాజ్యాంగం అన్నా, ప్రజాస్వామ్యం అన్నా లెక్కే చేయని క్రూర స్వభావం ఉన్న జగన్ రెడ్డి.. రాష్ట్రంలో ఉండటానికి అర్హుడు కాదన్నారు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం దళితుల మనోభావాలపై దాడి చేయడమేనని, ఇది దళితులను అవమానించడమే అని పేర్కొన్నారు. విగ్రహ ధ్వంసం కేసులో వైసీపీ నేతలు గోవిందయ్య, ఇతరులు స్వయంగా పట్టుబడి జైలుకు వెళ్లినా జగన్ రెడ్డి మౌనంగా ఉండటం దేనికి సంకేతం అని అన్నారు. దళితులంటే జగన్ కి ఎందుకు అంత చిన్న చూపు అని ఆనంద్‌బాబు ప్రశ్నించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకొని హుందా రాజకీయాలు చేయాలని జగన్ రెడ్డికి హితవు పలుకుతున్నానని ఎమ్మెల్యే ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

# ఉద్యోగులకు మీరిచ్చిన హామీలేమయ్యాయి?



**విజయవాడ, అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్నికల ముందు ఉద్యోగులకు మీరిచ్చిన హామీల్లో ఇప్పుడు ఒక్కటైనా అమలు చేశారా అని సిఎం చంద్రబాబును మాజీ సిఎం జగన్ సోమవారం ఎక్స్‌లో ప్రశ్నించారు. బకాయిలపై మంత్రివర్గ సమావేశం జరిగినప్పు డల్లా ఏమైనా ప్రకటన వస్తుందేమోనని ఉద్యోగులు వేచి చూస్తున్నారు. మీరు మాత్రం ప్రతిసారీ ఉసూరుమ నిపిస్తున్నారు. అధికారం లోకి రాగానే ఐఆర్ ఇస్తామన్నారు. ఇచ్చారా? మెరుగైన పీఆర్సీ ఇప్పటికీ ఇవ్వలేదు. మీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మొత్తం 4 డిఏలు పెండింగ్ పెట్టారు. ఉద్యోగస్థులకు ఇవ్వాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ మెడికల్ రీయింబర్స్ మెంట్, పదవీ విరమణ ప్రయోజ నాలు, సరెండర్/ఎన్‌క్యాష్‌మెంట్ సెలవులు ఇలాంట ివన్నీ కలిపి సుమారు రూ.31వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఒకటో తేదీనే జీతాలన్నారు. ఎక్కడిస్తున్నారు? ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు వర్తింప చేస్తామన్న ప్రభుత్వ పథకాలని వారికిస్తున్నారా? సీపీఎస్/జీపీఎస్‌లను పున:సమీక్షించి ఆమోద యోగ్యమైన పరిష్కారం చేస్తామన్నారు. దానిపై ఒక్కసారైనా సమీక్షించారా?'అని జగన్ ప్రశ్నించారు.

# టిడిపి కేంద్ర కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 7:** టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, ఏపీ ఉమెన్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, ఏపీ స్టేట్ బిల్డింగ్, అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు, శ్రీశైలం ఆలయ బోర్డు మెంబర్ ఏవీ రమణ, నేతలు పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

# ఈక్రాప్ నమోదు గడువు 25 వరకు పొడిగింపు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈక్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించింది. సామాజిక తనిఖీ, సవరింపులు, మార్పుచేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈక్రాప్ తుది జాబితాను ఈ నెల 31న రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. గతంలో ఈక్రాప్ నమోదుకు వెళ్తే సాంకేతిక సమస్య వల్ల నమోదు చేయలేదని, ఇప్పుడు అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం గడువు పెంచినందుకు తమకు మంచి జరుగుతుందని రైతులు చెబుతున్నారు. రైతులు పండించిన పంటల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఈక్రాప్ ను ప్రామాణికంగా తీసుకుంటోంది. పంటల సాగు ప్రారంభమై రెండు నెలలు దాటినా కూడా కృష్ణా జిల్లాలో ఈక్రాప్ నమోదు అనుకున్న స్థాయిలో జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వ్యవసాయశాఖ సహాయకుల బదిలీలు రైతులకు శాపంగా మారాయి. ప్రభుత్వం తొలుత సెప్టెంబర్ నెలాఖరుకు గడువు తేదీని నిర్దేశించింది. జిల్లాలో ఈక్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తడం వల్ల పంట నమోదు ముందుకు సాగలేదు. ప్రారంభం నుంచి కూడా పంట నమోదు ప్రక్రియ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. నమోదుకు రైతు సేవా కేంద్రాల చుట్టూ అన్నదాతలు ప్రదక్షణలు చేస్తున్నారు. రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేసిన పంటలను పరిశీలించి వాటి వివరాలను వీఏఏలు ఈక్రాప్ నమోదు చేయాల్సి ఉంది. ఈ సీజన్ ప్రారంభంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 475 మంది వీఏఏలను బదిలీ చేశారు. జిల్లాలో 3,55,824 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ ను సాగు చేస్తున్నారు. ఈసారి ఈకేవైసీని నోటిఫైడ్ పంటలకు మాత్రమే పరిమితం చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, సామాజిక అడవులు, సాగు చేయని బీడు భూములను ఈపంటలో నమోదు చేయాల్సి ఉంది. సచివాలయ ఉద్యోగులు బదిలీ కావడం, కొత్త ప్రాంతాల్లో సిబ్బంది భూ సర్వే నంబర్లు గుర్తించలేకపోవడం, గత రెండు నెలలు అధికారులు యూరియా సరఫరాపైనే పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో ఈక్రాప్ నమోదులో ఇబ్బందులు తలెత్తాయని రైతులు చెబుతున్నారు. పంట నమోదులో జాప్యం జరిగి తాము పంటను ఈ క్రాప్ చేయించుకోలేకపోతే తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని గతంలో జరిగిన ఘటనలను గుర్తుకు తెచ్చుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో తాము పెట్టిన పెట్టుబడి గంగలో కలిసిపోతుందన్నారు.

# అప్పుల బాధతో ముగ్గురు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** చేసిన అప్పులు తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులతో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు చెందిన ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలోని సిరిసిల్లా, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపే టకు చెందిన మొగిలి లక్ష్మణ్ (45) వేములవాడలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. అద్దె వాహనాలతో జీవనోపాధి పొందుతూనే గ్రామం లో ఉన్న ఎకరంలో వ్యవసాయం చేస్తున్నాడు. రెండు బోర్లు వేసినా నీళ్ల పడకపోవడం, అద్దె వాహనాలు సరిగ్గా నడవకపోవడంతో అప్పులు పెరిగాయి. వీటిని తీర్చే స్థోమత లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో సోమవారం పొలం వద్దకు వెళ్లిన లక్ష్మణ్ పురుగులమందు తాగి బలన్మరణానికి పాలపడ్డారు. అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం శివారు పీక్లా తండాకు చెందిన గుగులోత్ భాస్కర్ (40) శివారులో 3 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు. అయితే సాగు కలిసిరాకపోగా, చేసిన అప్పులు పెరిగిపోయి, కుటుంబ ఖర్చులు ఎక్కువై ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తన భూమికి పట్టా పాస్‌పుస్తకం లేకపోవడంతో దాన్ని అమ్ముకునే అవకాశం కూడా లేకుండాపోయింది. దీంతో అప్పులు తీర్చేమార్గం లేక ఇంటి ఆవరణలో ఉన్న పశువుల పాకలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా శాయంపేట మండలానికి చెందిన నాలికె అనిల్ (29)కు సొంతంగా ఎకరం భూమి ఉండగా, మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం సుమారు రూ.2 లక్షల వరకు అప్పు చేశారు. అయితే ఈ యేడు వేసిన పత్తి పంట వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్నది. ఈ క్రమంలో పంట పెట్టుబడికి చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక, తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో గడ్డిమందు తాగి ప్రాణాలు తీసుకున్నారు.

# దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి

### జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించటాన్ని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని పేర్కొన్నారు. ఇది వ్యక్తిపై దాడి కాదు అని, వ్యవస్థపైనే దాడి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందని, దీనికి సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం అని వ్యాఖ్యానించారు. ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి అని చెప్పారు. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు అని, ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తుందని అన్నారు.

# తీర్పుకు లోబడే నియామకాలు స్పష్టం చేసిన హైకోర్టు

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మత్స్యకారుల సహకార సంఘాలకు చీఫ్ ప్రమోటర్లు, పర్సన్ ఇన్‌చార్జీల నియామకాలు తాము ఇచ్చే తీర్పునకు లోబడే ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పునకు లోబడి జీవో నెంబర్ 60 అమలు ఉంటుందన్నారు. జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు లేదా పర్సన్ ఇన్‌చార్జీల నియామకం నేరుగా ప్రభుత్వం చేసేలా గత నెల 3వ తేదీన తెచ్చిన జీవో నెంబర్ 60 చట్ట వ్యతిరేకమంటూ హన్మకొండ జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ తదితరులు వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి మాధవీదేవి విచారించారు. దీనిపై విచారించిన ధర్మాసనం ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పశుసంవర్థక, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ ఎండీ సహా పలువురికి నోటీసులు జారీ చేసింది.

# తెలంగాణ సెక్రటేరియట్‌లో లీకేజీలు.. నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబరు7:** సెక్రటేరి యట్‌లో మరోసారి డొల్లతనం బయటపడింది. దాదాపు రూ.1200 కోట్లతో నిర్మించిన సచివాలయ బిల్డింగ్ పెచ్చులు ఊడడం, స్లాబ్ నుంచి లీకేజ్ కావడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. మంగళవారం 4వ అంతస్తులో మంత్రి కొండా సురేఖ పేషీలోకి వర్షపు నీరు చేరింది. పైపుల్లో వర్షం నీళ్లు నిలవడంతో ఇంటర్నెట్‌కు అంతరాయంఏర్పడింది. విద్యుత్ వైర్లు, ప్రింటర్లు, కంప్యూటర్లు వర్షంనీటిలోనే ఉన్నాయి. దీంతో సెక్రటేరియట్ లోని పలు శాఖల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఇంటర్నెట్ ఆగిపోవడంతో ఫైళ్లు అప్లోడ్‌కి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇంటర్నెట్ పునరుద్ధరణకు సిబ్బంది చర్యలు చేపట్టింది. 2025 ఫిబ్రవరి 12న కూడా సెక్రటేరియట్‌లో పెచ్చులూడి పడ్డాయి. ఆరో ఫ్లోర్(సిఎం చాంబర్ ఉండే అంతస్తు) పై నుంచి పీఓపీ పెచ్చులు కూలి రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ వెహికల్‌పై పడ్డాయి. దీంతో వాహనం పైభాగం దెబ్బతింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

# వర్షాలతో దెబ్బతిన్న సోయాబీన్

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇటీవల, ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో సోయాబీన్ పంట దెబ్బతినడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సోయాబీన్ తోటలు పుష్పించే మరియు కోత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటను దెబ్బతీయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం, నిర్మల్ జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో, ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. నిర్మల్ జిల్లాలో దాదాపు 72 వేలమంది రైతులు సోయాబీన్ పంటను పండించగా, ఆదిలాబాద్ జిలాలో 40 వేల మంది ఈ పంటను సాగు చేస్నారు. అయితే వర్షాలతో సోయాబీన్ దెబ్బతిని ఎకరానికి దిగుబడి 5 నుండి 3 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టం పోయారు. వర్షాల వల్ల జరిగిన నష్టం కారణంగా దిగుబడి బాగా తగ్గిందని రైతులు తెలిపారు. చాలా మంది ఎకరానికి రూ.20 వేల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టారని, కానీ వారి రాబడి ఎకరానికి రూ.15 వేలకు పడిపోయిందని వాపోయారు. దీనికి తగినట్లుగా సాగు పెట్టుబడులు రాబడిని మించిపోయాయి. సోయాబీన్‌కు కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,328గా నిర్ణయించగా, గత కొన్ని రోజులుగా పంట కోతలు కొనసాగుతున్నాయి.

# లాభాల్లో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ

**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రామ గుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ మిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.510 కోట్ల లాభం ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 11.95 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. ఉత్పత్తి చేసిన యూరియాను అంతే మొత్తంలో వివిధ రాష్ట్రా లకు సరఫరా చేయగా, రూ.5,300 కోట్ల టర్నోవర్ సాధించింది. ఉత్పత్తి చేసిన యూరియాలో తెలంగాణకు 4,68,954.76 టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1,78,363.39 టన్నులు, కర్ణాటకకు 1,91,288.07 టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 టన్నులు, చత్తీస్‌ఘడ్‌కు 60,640.38 టన్ను లు, తమిళనాడుకు 1,01,520.99 టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 టన్నుల చొప్పున సరఫరా చేసింది. అదే 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 11.19 లక్షల టన్నుల యూరియాను ఉత్పత్తి చేయగా. తద్వారా రూ.441 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ లెక్కన గతేడాదితో పోల్చితే 76 వేల మెట్రిక్ టన్నులను అధికఉత్పత్తిచేసి, రూ.69కోట్ల లాభం అదనంగా పొందగలిగింది.

8-9P g7exHMNWJQE 11_8-9P g7exHMNWJQE.qxd 10/8/2025 12:41 AM Page 1




మంగళవారంప్రజాభవన్‌లో ప్రజావాణిలో చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్-2 సభ్యులు

# ప్రజావాణికి 302 దరఖాస్తులు

## స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 7,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 302దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 87దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 42దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 102దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 3 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు.సీఎం ప్రజావాణి ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ 2 సభ్యులు**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని మంగళవారం ప్రజాభవన్‌లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రూప్ 2 ఫలితాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పలు మార్లు అభ్యర్థులు ప్రజాభవన్‌లో జరిగే సీఎం ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డిని కలవగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ సెక్రటరీలతోఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపిన చిన్నారెడ్డికి కలిసి సీఎం ధన్యవాదాలు తెలిపి పోస్టింగ్స్ కూడా త్వరగా ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు ఆయనను కోరారు.

# 12 వరకు ఆర్‌టిఐ అవగాహన వారం

## విసిలతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు7:** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంపై సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కీలకంగా మారిందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 5నుంచి 12 వరకు ఆర్‌టిఐ వీక్-2025ను నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆయన యూనివర్సిటీ విసిలు, రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 ప్రజా స్వామ్య పరంపర, పారదర్శకత, జవాబు దారితనం కోసం కీలకమైన చట్టమని తెలిపారు. భారతదేశంలో ఆర్‌టిఐ చట్ట చరిత్ర, రాజ్యాంగ పరిరక్షణలు (ఆర్టికల్ 19(1) (ఎ) అండ్ 21) ప్రధానమైన సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. ఆర్‌టిఐచట్టం అంతర్జాతీయ మానవహక్కుల ప్రమాణాలను భారత రాజ్యాంగ పాలనతోకలిపి పనిచేస్తుందన్నారు.ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్4 (పబ్లిక్ అథారిటీల బాధ్యతలు), సెక్షన్ 8(మినహాయింపులు) పై విశేషంగా దృష్టిపెట్టారు. ఏ సమాచారం వెల్లడించవచ్చునో, ఏదికాదు అనే దిశానిర్దేశాలను విసి, రిజిస్ట్రార్లకు వివరించారు. విశ్వవిద్యాలయాలకు ఆర్‌టిఐ కేసుల నిర్వహణ కోసం సాధారణ బుక్లెట్, హ్యాండ్‌బుక్ తయారీలో భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమం ముగింపులో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఆర్‌టిఐ వారం (5నుంచి 12 అక్టోబర్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫోటోలు, నివేదికలను ఈనెల 15 నాటికి తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలికి సమర్పించాలని సూచించారు.

# జాతీయస్థాయి ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌విఆర్ జేసి కళాశాల విద్యార్థుల ప్రతిభ

గుంటూరు విద్య,అక్టోబర్ 7,ప్రభాతవార్త : జాతీయస్థాయి ఈ-బైక్ డిజైన్ పోటీల్లో ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభకు రన్నరప్ బహుమతి,మరో 4విభాగాల్లో ప్రత్యేక పురస్కారాలు లభించాయని,రవాణా రంగంలో విద్యుత్ వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌కు జాతీయస్థాయిలో అవార్డులతోపాటు,నగదు బహుమతులను కూడా సాధించుకోవడం ఆనందదాయకమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర ్లమూడి మరళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.తమిళనాడు రాష్ట్ర ్రంలోని కొయంబత్తూరులోని శ్రీరామకృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెక్ట్రాన్ మోటర్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ లెవల్ ఈ-బైక్ డిజైన్ ఛాలెంజ్-2025పోటీల్లో వివిధ కళాశాలలనుండి అనేక విద్యార్థుల బృందాలు పాల్గొనగా ఆర్‌విఆర్ జేసి



కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈ-బైక్ ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ అవార్డు రూ.10వేల నగదుబహుమతి,అదనంగా బెస్ట్ హోల్ క్లింబ్ అవార్డు రూ.5వేలు నగదు బహుమతి,బెస్ట్ బంప్ టెస్ట్ అవార్డు రూ.5వేలు నగదు బహుమతి,బెస్ట్ రన్నర్ డ్రాగ్ రేస్ అవార్డు,బెస్ట్ రన్నర్ ఆటో క్రాస్ వంటి 4ప్రత్యేక విభాగాల్లో ప్రత్యేక అవార్డులు గెలుచుకున్నారు.ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం రాయపాటి గోపాలకృష్ణ,సిబ్బంది అభినందించారు.సాంకేతిక ప్రతిభతో జాతీయస్థాయిలో గుర్తింపు పొంది,అవార్డులు సాధించుకోవడం కళాశాలకే గర్వకారణమని రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపక నిపుణుల నేతృత్వంలో ఈ-బైక్ వాహన తయారీలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్ ్స ఇంజనీరింగ్ విభాగం నుండి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి 26మంది విద్యార్థులతో కూడిన జట్టు పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల ఎకాడమిక్ అండ్ ఆర్ డి డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర,ఫైనాన్ ్స డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి శ్రీనివాసరావు లు విజేతలైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.సర్ణశ్రీ,పి.వెంకట మహేష్,ఆర్ మారుతీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై రాజకీయ కుట్ర

## --మాలమహానాడు' జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ రత్నాకర్

గుంటూరు విద్య,అక్టోబర్ 7,ప్రభాతవార్త : మోడీ,బిజెపి లు ఎస్సీవర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ కుట్ర చేశారని మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.రత్నాకర్ విమర్శించారు.స్థానికంగా ఓ హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో రత్నాకర్ మాట్లాడారు.దళితులకు రిజర్వేషన్ పేరుతో పడేసే ఎంగిలి మెతుకుల్లోనేనా వర్గీకరణ పేరుతో వాటాలు,సామాజిక న్యాయం? మిగతా వాటికి అక్కర్లేదా ? చంద్రబాబు అనుభవించే ముఖ్యమంత్రి



పదవికి సామాజిక న్యాయం అక్కర్లేదా? అంటూ దుయ్యబట్టారు.ఎస్సీ వర్గీకరణను శాంపిల్‌గా పంజాబ్ హర్యానాల్లో మొట్టమొదట గా చేశారన్నారు.వర్గీకరణ బీజం కాంగ్రెస్ వేస్తే మోడీ దేశం మొత్తం అమలు చేశాడు.నిజానికి ఎస్సీ వరీ ్గకరణ వల్ల వందలో నలుగురికి బెనిఫిట్ జరుగుతోంది.ఈ వందలో నలుగురికి ఇచ్చే ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు మోడీ గారు? అంటూ ప్రశ్నించారు.ఈ నాలుగు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59ఎస్సీ కులాలకు చంద్రబాబు,రేవంత్‌రెడ్డి ఎలా పంచుతారు ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు బెనిఫిట్ పొందిన మాల ఉద్యోగులు చైతన్యవంతుల కావాలని,ఇకనైనా కళ్ళు తెరిచి బయటకు రావాలని,మా ఈ పోరాటానికి మద్దతు ఇవ్వండి అంటూ అభ్యర్థించారు.పూర్తిగా తెలుగు రాష్ట్రాల్లో మన కులం యొక్క ఉనికిని కోల్పోయాం.శాంతియుత పోరాటానికి సిద్ ్ధం కండి అంటూ మాల వర్గీయులకు పిలుపునిచా ్చరు.కార్యక్రమంలో కీర్తినారా యుడు,తుమ్మల ప్రాన్సిస్,కొప్పుల ప్రేమ్,మేడికొండ సుబ్బయ్య,బడుగు కిరణ్‌కుమార్,బత్తుల వీరాస్వామి,తోట దుర్గాప్రసాద్,బండ్లమూడి స్టాలిన్‌బాబు,చిన్నం విలియం డేవిడ్,కనికెళ్ళ నాని తదితరులు పాల్గొన్నారు.

# అడ్డదారులు తొక్కిన అధికారులు

## ఎసిబి చిక్కిన డ్రగ్ కంట్రోల్ అధికారులు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** ప్రజలకు నమ్మకం కలిగించేందుకు నిరం తరం ఫార్మసీలను తనిఖీలు చేసి నాణ్యమైన మందులు, సేవలందిస్తున్నారని నిర్ధారిం చాల్సిన అధికారులు అడ్డదారులు



తొక్కారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఫార్మసీని తనిఖీచేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్‌చేసి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం జిల్లా కేంద్రం లో పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి జిల్లా కేంద్రానికి డ్రగ్ కంట్రోల్ విభాగం ఉంటుంది.ఫార్మసీలను, అనుమతులు లేకుండా మార్కెట్లో లభ్యమయ్యే మందులను తనిఖీలు చేసి వాటి వినియోగంపై పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాల్సిన పని డ్రగ్ కంట్రోల్ విభాగం విధి. ప్రతి ఏటా ప్రైవేట్ ఆస్పత్రుల ఫార్మసీ దుకాణాలను తనిఖీలు చేసి సర్టిపై చేయాల్సి ఉంటుంది.అదేవిధంగా ఫార్మసీస్ట్ లైసెన్సులు పునరుద్ధరించడం వారి విధుల్లో భాగం..అయితే దీనికోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గల ఫార్మసీకి క్లీన్ చిట్ ఇచ్చేందుకు డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు డబ్బులు డిమాండ్ చేశారు.అధికారుల అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోవడంతో మందుల దుకాణాల నిర్వాహకులు అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం రంగంలోకిదిగారు. బాధితుని నుంచి డిమాండ్ చేసిన లంచం డబ్బులు రూ.20,000 అధికారులకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తి తీసుకుంటుండగా దాడులు నిర్వహించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.డబ్బులు తీసుకున్న రామును అదుపులోకి తీసుకొని అతనిని పురమాయించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి లంచంగా తీసుకున్న డబ్బులను రికవరీచేసి రసాయన పరీక్షలు నిర్వహించి, నిర్ధారించి అధికారులు ఎసిబి కార్యాలయానికి తరలించి విచారణ అనంతరం నిందితుల ముగ్గురిని కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

# భీమ్ పోరాట స్ఫూర్తి ప్రపంచానికి ఆదర్శం: మంత్రి జూపల్లి

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుమ్రం భీం విగ్రహానికి సంప్రదాయ బద్ధంగా నివాళర్పించి,సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేసి



భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆదివాసీల ఆశాజ్యోతి కుమ్రం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం.. బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, స్వయంపాలన ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కుమ్రం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కొమ్రం భీం మనువడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి కార్యాలయంలో వాల్మీకి జయంతి



**హైదరాబాద్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి, ఈ సందర్భ ంగా వాల్మీకి చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు వాల్మీకి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మహర్షి వాల్మీకి ఆలోచనలు, ఆత్మ నిబ్బరత, సత్యం ధర్మం కోసం ఎంతో సేవలు చేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఏఐజి రమణ కుమార్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకులపై ప్రభుత్వం చిన్నచూపు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** బిజెపి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాం జలి ఘటించి, ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాస్తవానికి వాల్మీకి సమాజం వెనుకబడిన తరగతులలో భాగంగా ఉంది. అయితే వాల్మీకి సమాజాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండి పడ్డారు.ఇటీవల గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకి సోదరులు నన్ను కలిసి తమ సమస్యలను వివరించారని,వారికి ఎమ్మార్వో ఆఫీసుల్లో కనీసం కుల ధృవపత్రాలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



వాల్మీకి సమాజం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఇప్పటికైనా వాల్మీకి బోయల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ నేతలు బిజెపి నేతలను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు:బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కాంగ్రెస్ నాయకులు నిత్యం బీజేపీ నేతలను విమర్శించడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారని బిజెపి ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచం దర్ రావుపై ఇష్టాను సారంగా, అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నార న్నారు. ఒక రాజకీయ పార్టీలో మంత్రి పదవిని పొందిన పొన్నం ప్రభాకర్ వంటి నాయకులు దిగజారి మాట్లాడటం తగదని హితవు పలికారు. మొన్నటికి మొన్న సొంత మంత్రివర్గం లోని మాదిగ సమాజానికి చెందిన అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌పై పొన్నం ప్రభాకర్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సమాజం చూసిందన్నారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విష యంలో మద్దతు తెలిపిందని,బిజెపి ఎమ్మె ల్యేలు సంపూర్ణ మద్దతు ప్రకటిం చారని గుర్తుచేశారు.


మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# మంత్రి పొన్నం క్షమాపణలు చెప్పాలి

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నాం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్(తార్నాక), అక్టోబరు 7 ప్రభాతవార్త :** మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ముందు నిర్వహించిన కార్యక్రమంలో మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కట్లూర్ లక్ష్మణ్ ఉద్దేశించి దున్నపోతు అనేమాటను ఉపయోగించి మాట్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు తప్పు జరిగింది వాస్తవమేనని పొన్నం చేతక్షమాపణ చెప్పించే విధంగా చూస్తామని తెలిపారని అన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యచరణను తీసుకోవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, పల్లెర్ల సుధాకర్, బైర పోగు శివకుమార్, జన్న పాల మహేష్, ఎడవెల్లి అజయ్, ఆదిత్య, మంద అనీల్ మాదిగ, మహేంద్ర మదిగ, మామిడి ప్రశాంత్, రవికుమార్, అజయ్ కుమార్, కొమ్ము తురుపతి, మణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


మంగళవారం వివరాలు వెల్లడిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# రిజర్వేషన్లపై 30 బిసి సంఘాల కేసులు

**హైదరాబాద్,అక్టోబరు 7 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్ల కేసులో 30కి పైగా బీసీ సంఘాలు మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఇంప్లిట్ కేసులు వేశారు.కేసులో ఇంప్లీడ్ అయిన వారిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తెలంగాణ బి.సి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల కావణి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి, బీసీ విద్యార్థి యువజనసంఘం అధ్యక్షుడు జామ్మూర్తి గౌడ్, తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ బి.సి ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, కార్మికసంఘం నేత చెదుకు మణికంఠ, తెలంగాణ బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షుడు బి.సాగర్, తెలంగాణ బి.సి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగళ్ళ సతీష్, తెలంగాణ బి.పి యువజన సంఘం కన్వీనర్ భాస్కర్ ప్రజాపతి, నాయి బ్రాహ్మణ సంఘం నేత జగదేశ్. జాతీయ బి.సి సంక్షేమ సంఘం నేత పరదాల సుధాకర్ తదితర సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున కేసులు వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు.

# మద్యం, గంజాయి, నల్లబెల్లం స్వాధీనం



**హైదరాబాద్,అక్టోబరు 7, ప్రభాతవార్త :** వేర్వేరు కేసుల్లో ఎక్సైజ్ అధికారులు 44 మధ్యం బాటిళ్ళను,2.5 కేజిల గంజాయి,120 కేజిల బెల్లంను మంగళవారం పట్టుకున్నారు.ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వచ్చే తెలంగాణ ఎక్స్ ప్రెస్ రైల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 44 మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి.ఈ మధ్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అదే విధంగా నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి ఇచ్చిన సమాచారంమేరకు ఎస్టిఎఫ్ ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించి తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయితోపాటు టు వీలర్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని హట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ కేసులో సంజయ్ తో పాటు శేఖర్ బాబు, కామ్రే బాబు, గంగోలి బహు అనే ముగ్గురు పై కూడా కేసు నమోదు చేశారు.

మరో కేసులో హైదరాబాద్ హైదరాబాదు ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్ కు బస్సులో తరలిస్తున్న బెల్లాన్ని ఎస్టిఎఫ్ బీ టీం సీఐ భిక్ష రెడ్డి ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. బెల్లాన్ని తీసుక వెళుతున్న ఎల్లమ్మ అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 120 కేజీల బెల్లం, 30 కేజీల ఆలమును స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ స్టేషన్‌లోఅప్పగించారు.అదే విధంగా మరో కేసులో నాగర్ కర్నూల్‌కు హైదరాబాదు నుంచి బయలుదేరినటువంటి బొలెరో వాహనాన్ని బిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని అందులోని 900 కేజీల బెల్లాన్ని, 20 కేజీల ఆలమును, వాహనాన్ని నాగర్ కర్నూల్ డి టి ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్ రెడ్డి, డ్రైవర్ రాంబాబును అరెస్ట్ చేశారు.

# టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలంటే ఆవిష్కరణ, నైపుణ్యం మీద దృష్టి సారించాలి: డాక్టర్ క్రిష్ణా ఎల్లా

### ఘనంగా హెచ్‌సియు స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత్ బయోటెక్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా తదితరులు. అవార్డులను అందజేస్తున్న హెచ్‌సియు చాన్సిలర్ నర్సింహరెడ్డి, వైస్ చాన్సిలర్ బిజె.రావు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 7 ప్రభాతవార్త:** టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడే విధంగా ఉండాలని, దానిని భర్తీ చేయకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హెచ్‌సియు చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. విద్య సమాజంలో సమగ్రమైన, అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మించే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎక్జిక్యూటీవ్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 1717మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు ప్రకటించగా, అందులో 990మంది తమ పట్టాలను అందుకున్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు ఆలోచన, విద్యార్థుల కష్టానికి వేడుకగా స్నాతకోత్సవాన్ని అభివర్ణించారు. మానవుడి ఉనికి అంతిమ లక్ష్యం మేధస్సును పెంచడమే కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఊటంకించారు. నేటి యువతకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి, తోటి వారికి సేవ చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేట్లు వనయాన్ని వదులుకోవద్దని, ఇతరులకు అవకాశాలు సృష్టించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు క్రిష్ణ ఎల్లా మాట్లాడుతూ భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే మన యువత ఆవిష్కరణలు, నైపుణ్యం మీద దృష్టి సారించాలని సూచించారు. విశ్వవిద్యాలయం డిగ్రీ పట్టాను ఇస్తుందని, కానీ ఉత్తమ ఆవిష్కరణ, నైపూణ్యం జీవితంలో ముందుకు తీసుకువెళ్తాయని అన్నారు. నేటి విద్యార్థులు ఉద్యోగాల వేటలో పడి ఉద్యోగ అన్వేషకులుగా మారుతున్నారని, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతీయ శాస్త్రవేత్తల సందేహాలు వ్యక్తం చేశారని, కానీ కోవిడ్ వ్యాక్సిన్‌ను సొంతంగా తయారు చేసి భారతీయుల సైన్స్‌ను, మేధోసంపత్తిని ప్రపంచానికి చూపించామన్నారు. హెచ్‌సియు వైస్ చాన్సిలర్ బిజె.రావు మాట్లా డుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని, ఇది ఒక గ్రీన్ క్యాంపస్ అని అన్నారు. ప్రపంచ క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సియు గత సంవత్సరం ఉన్న 372నుంచి ఈ సంవత్సరం 335కు చేరిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, నూతన టెక్నాల జీలో సవాళ్లను పరిష్కరించేందుకు 6 విశ్వవిద్యాల యాలను అనుసంధానం చేస్తూ 100కోట్లతో ఏర్పాటు చేసిన ఎఎన్ఆర్ఎఫ్ ప్రాజెక్టుకు హెచ్‌సియు నాయకత్వం వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపాన్ని అధిగమించి ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో పట్టా అందుకున్న విద్యార్థిని గోపితేజస్వీకి ఓబిసి కేటగిరి గోల్డ్‌మె డల్‌ను అందజేశారు.

08-10pg10 12 GNT_08-10pg10.qxd 10/7/2025 10:56 PM Page 1



## ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్
# వాటర్ పోలోలో భారత్ వరుస ఓటమి

**న్యూఢిల్లీ:** ఆసియా అక్వాటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, వాటర్ పోలోలో భారత పురుషులు వరుసగా మూడో మ్యాచ్‌లో ఓడిపోయారు. వాటర్ పోలో, ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ మూడవ రోజు వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కజకిస్తాన్ చేతిలో భారత పురుషుల వాటర్ పోలో జట్టు 6-20 తేడాతో ఓడిపోయింది. కజకిస్తాన్‌కు చెందిన కరీనా మాగ్రుపోవా, పురుషుల సోలో ఫ్రీలో వరుసగా అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. పురుషుల గ్రూప్ బి లో కజకిస్తాన్ 20-6 తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. బాల్తాబ్‌కులీ ఆదిల్, నెడోకొంట్సేవ్ 4 గోల్స్ సాధించగా, తోసోయ్ ఎడ్వర్డ్ మూడుసార్లు గోల్స్ చేయగా, లామాయేవ్ మాగ్జిమ్, షకెనోవ్



మురాత్, అకింబే అల్దియార్ తలా రెండు గోల్స్ సాధించారు. అలాగే అఖ్మెటోవ్ రుస్లాన్, మాడిమార్ అల్మాట్, బొబ్రోవ్స్కి మిస్టిస్లావ్ తలా 1 గోల్ చేశారు. భారత్ తరపున భాగేష్ కుథే 3 గోల్స్ చేయగా, ఉదయ్ ఉత్తేజ్, ప్రవీణ్ గోపీనాథన్ తలా ఒక గోల్ చేశారు. కాగా మహిళల గ్రూప్ ఎ లో జపాన్ 26-13 తేడాతో సింగపూర్‌ను ఓడించింది. కోబయాషి మహో 6 గోల్స్‌తో ఆధిక్యంలో ఉండగా, సోబాజిమా సాకురా (4), కెప్టెన్ ఫుకుడా షోకా, లోరే నినా, సాండా యుమెకా మరియు శిరోనోషిత కహో (3 చొప్పున) ఉన్నారు. షిబాట కనడే 2 గోల్స్ చేయగా, బాండో రికో, ఎగుచి సెయిరా తలా 1 గోల్స్ చేశారు. సింగపూర్ తరఫున యాప్ జింగ్జువాన్ 4, లిమ్ వాన్ జున్, లీ జువాన్ హై తలా 3 గోల్స్ సాధించగా, టియో జి సువాన్, కో టింగ్, యో యింగ్ తలా 1 గోల్స్ చేశారు.

## ఆస్ట్రేలియాతో రెండో టెస్టు తొలి రోజు
# భారత్ 9 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ అండర్19 జట్టు తొలిసారి బ్యాటింగ్‌లో తడబాటుకు లోనైంది. మెక్‌కే వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి భారత్ 7 వికెట్లు నష్టానికి 144 పరుగులు చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 20, 2 ఫోర్లు, 1 సిక్స్) ఆశించిన రీతిలో ఆడలేక తేలిపోయాడు. ఈ మ్యాచ్ ఓపెనరల్‌గా ప్రమోషన్ పొందిన విహాన్ మల్హోత్రా (11) నిరాశపరిచాడు. మరో ఓపెనర్, కెప్టెన్ ఆయుష్ మాత్రే (4) వైఫల్యాల పరంపర కొనసాగించాడు. వేదాంత్ త్రివేది (25) నిలదొక్కుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. రాహుల్ కుమార్ (9), వికెట్ కీపర్ హర్వంశ్ పంగాలియా (1) సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. ఖిలన్ పటేల్ (26)



కాసేపు పోరాడినప్పటికీ ఆట ముగిసే సమయానికి కొద్ది ముందు ఔటయ్యాడు. హెనిల్ పటేల్ (22 నాటౌట్), దీపేశ్ దేవేంద్రన్ (6 నాటౌట్) సహకారంతో భారత్‌కు గౌరవ ప్రదమైన స్కోరు అందించేందుకు ప్రయత్నిస్తూ క్రీజులో ఉన్నారు. ఇకఆస్ట్రేలియా బౌలర్లలోకేజీ బార్టన్, విల్ బైరోమ్ టీమిండియా టాపార్డర్‌ను ఇబ్బంది పెట్టారు. కేజీ, బైరోమ్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఛార్లెస్‌లచ్‌మండ్, జూలియన్‌కు తలో వికెట్‌దక్కింది. అంతకు ముందు భారత్ బౌలర్లు చెలరేగ డంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది. హెనిల్ పటేల్(9-3-21-3), ఖిలన్ పటేల్ (12-5-23-3), ఉధవ్ మోహన్ (6-0-23-2), దీపేశ్ దేవేంద్రన్ ( 7.3-2-22-1 కలిసికట్టుగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆసిస్ ఇన్నింగ్స్‌లో వికెట్ కీపర్ లీ యంగ్ (66) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు.



## జూడో వరల్డ్ ఛాంపియన్‌షిప్:
# లింతోయ్ విక్టరీతో భారత్‌కు తొలి పతకం

**న్యూఢిల్లీ:** జూనియర్ జూడో ప్రపంచ ఛాంపియన్‌షిప్-2025లో లింతోయ్ చనంబం భారతదేశానికి తొలి పతకం అందించింది. పెరూలోని లిమాలో మంగళవారం జరిగిన జూడో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున తొలి పతకాన్ని గెలుచుకున్న లింతోయ్ చనంబమ్ చరిత్ర సృష్టించింది. మహిళల 63 కిలోల విభాగంలో 19 ఏళ్ల చనంబమ్ కాంస్య పతక పోరులో నెదర్లాండ్స్‌కు చెందిన జోనీ గీలెన్‌పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు, చనంబమ్ తన చివరి గ్రూప్ డి మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన సో మోరిచికా చేతిలో ఓడిపోయింది. మోరిచికా మహిళల 63 కిలోల ఫైనల్‌కు చేరుకున్న తర్వాత మణిపూర్‌కు చెందిన జూడోకా రెపిచేజ్ మార్గం ద్వారా పతక పోరులోకి ప్రవేశించింది. రెపిచేజ్ రౌండ్‌లో, చనంబమ్ మొదట స్లోవేకియాకు చెందిన ఇలారియా సుర్కాన్‌ను ఓడించి, గీలెన్‌తో కాంస్య పతక పోటీకి సిద్ధమైంది. ఇది చానంబంకు లభించిన రెండవ వయసు గ్రూప్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం. క్యాడెట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తొలి భారతీయ జూడోకాగా కూడా ఆమె గుర్తింపు పొందింది. ఆమె మూడు సంవత్సరాల క్రితం 2022లో ఆ ఘనతను సాధించింది. కాగా గత సంవత్సరం కాలంగా, చనంబం గాయాలతో ఇబ్బంది పడింది. తిదిలి గాయంతో ఆమె చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉండి, ఈ సంవత్సరం ప్రారంభంలోనే పోటీ జూడోకు తిరిగి వచ్చింది.

## ఆస్ట్రేలియా పర్యటనలో..
# భారత్ హిట్ ఇన్నింగ్స్

### టాప్5లో 2 సార్లు రోహిత్







**న్యూఢిల్లీ:** భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ఈ నెల 19 నుండి ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతుంది. ఆస్ట్రేలియాతో తలపడే టీమిండియాలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి చోటు కల్పించారు. అయితే ఇప్పటి వరకూ ఆస్ట్రేలియాపై జరిగిన వన్డేల్లో అత్యధిక ఇన్నింగ్స్‌లు ఆడిన పలువురు బ్యాట్స్‌మెన్‌లు ఉన్నారు. టాప్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ శర్మ పేరు రెండు సార్లు రికార్డయింది. జనవరి 2016లో పెర్త్‌లో ఆస్ట్రేలియాపై రోహిత్ 171 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా ఉంది. ఆ సమయంలో పిచ్ వేగంగా మరియు బౌన్సీగా ఉండేది. పరుగులు చేయడం కష్టతరం చేసింది. అయితే, భారత ఇన్నింగ్స్‌ను స్థిరంగా ఉంచడానికి రోహిత్ అద్భుతమైన ఓర్పు మరియు సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. తర్వాత సౌరవ్ గంగూలీ 2000లో అడిలైడ్‌లో పాకిస్థాన్‌పై 141 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ కార్ల్టన్ యునైటెడ్ సిరీస్‌లో భాగం. 267 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గంగూలీ కెప్టెన్‌గా ఆడి జట్టును నడిపించాడు. అతని ఇన్నింగ్స్ అద్భుతమైన పోరాట స్ఫూర్తిని ప్రదర్శించింది. ఇక జనవరి 2004లో యువరాజ్ సింగ్ ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మ్యాచ్‌లో 139 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్ ఒత్తిడిలో కూడా ఆడగల అతని సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 5వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన యువరాజ్, భారత్ 80 పరుగులకే 3 వికెట్లు కోల్పోయినప్పుడు జట్టును స్థిరపరిచి ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను స్వీకరించాడు. జనవరి 2015లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాపై 138 పరుగులు చేసిన రోహిత్ రెండో సారి ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించాడు. ప్రారంభ వికెట్లు కోల్పోయిన తర్వాత, రోహిత్ ఓపికగా ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అతను సింగిల్స్‌తో పరుగులు సాధించాడు. తన విలక్షణమైన శైలిలో ఫోర్లు, సిక్సర్లు కొట్టాడు.

2015 ప్రపంచ కప్‌లో మెల్‌బోర్న్‌లో దక్షిణాఫ్రికాపై శిఖర్ ధావన్ 137 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి. ఇన్నింగ్స్ ప్రారంభించిన ధావన్ దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నాడు.

# జ్వెరెవ్ సంచన ఓటమి
## అగ్రస్థానానికి రిండర్‌క్నెచ్



**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో అలెగ్జాండర్ జ్వెరెవ్ సంచలన ఓటమి చెందాడు. ఫ్రాన్స్‌కు చెందిన రిండర్‌క్నెచ్ చేతిలో ఘోర పరాజయం పాలయ్యాడు. షాంఘై మాస్టర్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ మూడో నంబర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ రిండర్‌క్నెచ్ 4-6, 6-3, 6-2 తేడాతో ఓడించి, టోర్నమెంట్‌లో అగ్రస్థానంలో చేరుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో, 54వ ర్యాంక్‌లో ఉన్న ఫ్రెంచ్ ఆటగాడు ఒక సెట్ నుండి తిరిగి వచ్చి, మరింతగా ఉక్కిరిబిక్కిరి అయిన జ్వెరెవ్‌ను గందరగోళానికి గురయ్యేలా చేశాడు. షాంఘైలో తన చివరి మ్యాచ్ ముగిసే సమయానికి జ్వెరెవ్ బొటనవేలికి గాయమైంది. కానీ అతను ఈ టోర్నీ మూడవ గేమ్‌లో ఫోర్‌హ్యాండ్‌తో రిండర్‌క్నెచ్‌ను బ్రేక్ చేయడంలో ఇబ్బందులు పడలేదు. రెండవ సెట్ ప్రారంభంలోనే అతను దాదాపు ముందుకు వెళ్ళాడు. అయితే రిండర్‌క్నెచ్ పుంజుకుని సరైన సమయంలో, తెలివిగా దాడి చేయడంతో జ్వెరెవ్ ఒకింత ఇబ్బందికి గురయ్యాడు. నాల్గవ గేమ్‌లో ఒత్తిడిని పెంచి చివరికి బ్రేక్ చేశాడు. అదే జోరును కొనసాగిస్తూ, మూడవ సెట్‌లో 30 ఏళ్ల అతను మూడవ గేమ్‌లో బ్రేక్ చేశాడు. ఏడో గేమ్‌లో డబుల్ ఫాల్ట్ రిండర్‌క్నెచ్‌ను మళ్ళీ బ్రేక్ చేయడానికి దారితీసేలా ప్రయత్నించాడు. కానీ రిండర్‌క్నెచ్ జ్వెఎవ్‌ను ఓడించడంతో ప్రపంచ నెంబర్ 3 టోర్నమెంట్ నుండి నిష్క్రమించక తప్పలేదు.

# రూ.2700 పెరిగిన బంగారం!



**ముంబయి, అక్టోబరు 7:** బంగారం ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. పసిడి పరుగులు ఆగడం లేదు. ప్రతిరోజు సరికొత్త గరిష్టాలకు చేరుకుంటూ రికార్డులు నమోదు చేస్తోంది. తాజాగా బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1, 23, 850కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1, 15, 500ను తాకింది. మరోవైపు కిలో వెండి ధర రూ.1, 54, 350కు చేరింది.పండగల సీజన్ కావడం, అంతర్జాతీయంగా మార్కెట్ల అస్థిరత, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి పతనం బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. వెండి కిలో రూ.2 లక్షలకు చేరే అవకాశం ఉందని ఇటీవల మార్కెట్ పండితులు అంచనా వేసిన సంగతి తెలిసిందే.

# కనీస పింఛన్ రూ.2500..
## ఇపిఎఫ్‌ఒ ట్రస్టీ సమావేశంలో వెలువడనున్న నిర్ణయం

**ముంబయి, అక్టోబరు 7:** ప్రైవేట్ రంగంలోని ఉద్యోగులకు అదిరే శుభవార్త. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ)కు చెందిన అత్యున్నత నిర్ణయాధికార కమిటీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈనెల 10, 11 తేదీల్లో బెంగళూరులో సమావేశం కానుంది. ఈ సమావేశంలో కనీస పెన్షన్ పెంపుపై ప్రధానంగా చర్చ ఉండనుందని తెలుస్తోంది. కనీస పెన్షన్ రూ. 1000 నుంచి రూ. 2500లకు పెంచే ప్రతిపాదనలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అదే జరిగితే లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ పరిధిలో కనీస పెన్షన్ ప్రస్తుతం నెలకు రూ. 1000గా ఉంది. దీనిని 2014లో నిర్ణయించారు. అప్పటి నుంచి అదే పెన్షన్ కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ఉద్యోగుల సంఘాలు కనీస పెన్షన్ రూ. 1000 అనేది చాలా తక్కువగా ఉందని, ప్రస్తుత ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస పెన్షన్ రూ. 7500లకు పెంచాలని పలు ట్రేడ్ యూనియన్లు, పెన్షనర్ల అసోసియేషన్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. పలు నివేదికల ప్రకారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు కనీస పెన్షన్‌ను 7.5 రెట్లు పెంచేందుకు సుముఖంగా లేరు. అయితే, రూ.1000 నుంచి రూ.2500లకు పెంచేందుకు ఆమోదం తెలపవచ్చని తెలుస్తోంది. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) పరిధిలో పెన్షన్ లెక్కించేందుకు ఒక స్థిరమైన ఫార్ములా ఉంది. పెన్షన్ శాలరీ అంటే బేసిక్ శాలరీ ప్లస్ గత 60 నెలల డీఏ (గరిష్ఠంగా రూ. 15000)గా లెక్కలోకి తీసుకుంటారు. పెన్షనేబుల్ శాలరీ గరిష్ఠ పరిమితి రూ. 15000గా ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 35 సంవత్సరాలు సర్వీసులో ఉంటే అతనికి నెలకు రూ. 7500 వరకు పెన్షన్ లభిస్తుంది. 58 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగాల్సి ఉంటుంది. ముందే ఉద్యోగం వదిలేస్తే విత్‌డ్రాయల్ బెనిఫిట్స్‌తో పాటు తగ్గించిన పెన్షన్ లభిస్తుంది. అంటే చేతికి అందే పెన్షన్ భారీగా తగ్గిపోతుంది. పూర్తి సర్వీసులో ఉన్న వారికి గరిష్ఠ పెన్షన్ లభిస్తుంది.



# టాటా ఇన్వెస్ట్‌మెంట్ షేర్లలో భారీ పతనం!

**ముంబయి, అక్టోబరు 7:** టాటా గ్రూప్ నుంచి దాదాపు రెండేళ్ల తర్వాత మరో పెద్ద ఐపీఓ వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే టాటా క్యాపిటల్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. అయితే ఈ ఐపీఓ బజ్‌తో ఇటీవల భారీగా పెరిగిన టాటా గ్రూప్‌కే చెందిన టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేర్ ధర మంగళవారం భారీగా పతనమై ఇన్వెస్టర్లకు తీరని నష్టాల్ని మిగిల్చింది. ఇంట్రాడేలో దాదాపు 7 శాతం వరకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక శాతానికిపైగా లాభంతోనే ప్రారంభమైంది. ఇంట్రాడేలో 2 శాతం వరకు పెరిగింది. అక్కడి నుంచి వరుసగా పతనమవుతూనే వచ్చింది. ఇంట్రాడేలో 8 శాతానికిపైగా పతనంతో రూ. 9,123 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇక్కడ చూస్తే షేర్ ధర కిందటి క్లోజింగ్ నుంచి ఏకంగా రూ. 800కుపైగా పడిపోయింది. ఇంట్రాడే గరిష్టం నుంచి చూస్తే రూ. 1000కిపైగా పడిపోవడం గమనార్హం. టాటా ఇన్వెస్ట్‌మెంట్ స్టాక్ ఇటీవల భారీగా పుంజుకుంది. కొన్ని నెలలుగా50 శాతానికిపైగా స్థిరంగా రిటర్న్లు ఇస్తూ వచ్చింది. ఐదేళ్లలో చూస్తే ఏకంగా 900 శాతానికిపైగా రాబడి అందించింది. స్టాక్ స్ప్లిట్, ఐపీఓ వంటివి ఉన్నాయి. ఇన్వెస్టర్లను ఊరించేలా టాటా క్యాపిటల్ ఐపీఓపై ప్రకటన వచ్చింది. మరోవైపు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ తొలిసారిగా స్టాక్ స్ప్లిట్ కూడా ప్రకటించింది. స్టాక్ 52 వారాల గరిష్ట ధర రూ. 11,847 కాగా కనిష్ట ధర రూ. 5,145 గా ఉంది. కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 47.61 వేల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ నెలలో ఈ స్టాక్ ఏకంగా 50 శాతానికిపైగా పుంజుకుంది.



## రెండోరోజూ లాభాల్లోనే
# స్టాక్ మార్కెట్లు



**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం రెండో రోజు కూడా పాజిటివ్ ధోరణిలో కొనసాగాయి. ఈ క్రమంలో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బీఎస్ఈ సెన్సెక్స్ 462.15 పాయింట్లు ఎగసి 82,252.27 స్థాయికి చేరుకుంది. అదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 124.55 పాయింట్లు పెరిగి 25,197.70 వద్ద నిలిచింది. ఈ నిఫ్టీ రికార్డ్ స్థాయికి చేరుకోవడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున లాభపడ్డారు. సెన్సెక్స్‌లో టాప్ గెయినర్స్, లూజర్స్ ఈ క్రమంలో సెన్సెక్స్‌లోని కంపెనీల్లో భారతి ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్ వంటి షేర్లు 1.9 శాతం వరకు లాభాలను అందుకోగా, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. వీటి పనితీరు మార్కెట్‌లో మిశ్రమ ఫలితాలను చూపించింది. ఈ క్రమంలో మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్100, స్మాల్‌క్యాప్100 సూచీలు వరుసగా 0.42 శాతం, 0.34 శాతం లాభాలతో ట్రేడయ్యాయి. సెక్టోరల్ సూచీల్లో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్, నిఫ్టీ రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.8 శాతం వరకు పెరిగి అగ్రగామిగా నిలిచాయి. కానీ నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.3 శాతం వరకు తగ్గాయి. వొడాఫోన్ ఐడియా షేర్లు మంగళవారం అద్భుత జోష్‌తో దూసుకెళ్లాయి. బీఎస్ఈలో కంపెనీ షేరు 8 శాతం పెరిగి రూ. 9.2 వద్ద ఎనిమిది నెలల గరిష్ట స్థాయిని తాకింది. సెప్టెంబర్ నుంచి ఈ షేరు ధర ఏకంగా 42 శాతం పెరిగింది. బిఎస్ఇలో మిడ్‌ఖ్యాప్‌సూచీ 0.45శాతం లబ్దిపొందితే స్మాల్‌క్యాప్‌సూచీ మాత్రం 0.15శాతం క్షీణించింది.

# డిబిటితో రూ.4.31 లక్షల కోట్లు ఆదా
## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబై, అక్టోబర్ 7:** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని కేంద్రం చెపుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వివరాలు స్వయంగా వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్‌టైమ్ ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్ మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, యుపిఐ డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు. ఇప్పటి వరకూ భారత్‌లో ఉన్న బ్యాంకులు లేదా కంపెనీలు అమెరికా డాలర్లు, యూరోలు, యెన్ వంటి విదేశీ కరెన్సీల్లో లావాదేవీలు చేయాలంటే, అవి ఇప్పటివరకు హాంకాంగ్, టోక్యో లేదా లండన్ బ్యాంకుల ద్వారా సెటిల్ చేసేవి. ఈ ప్రక్రియకు 36 నుండి 54 గంటల సమయం పట్టేది. కానీ ఇప్పుడు,గిఫ్ట్ సిస్టమ్ ద్వారా భారత్‌లోనే ఈ లావాదేవీలను రియల్ టైమ్‌లో (తక్షణమే) పూర్తి చేయొచ్చు. గిఫ్ట్ ట్రాన్సాక్షన్స్ ద్వారా భారత్ ఇప్పుడు హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన నిలిచింది. విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్స్‌లో సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయి. బ్యాంకులు, కంపెనీలు, ఇన్వెస్టర్లకు తక్కువ సమయంలో సులభమైన లావాదేవీలు జరిగే వీలు. భారత్ అంతర్జాతీయ ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగడంలో ఇది కీలకం.




## నేటి నుంచి యుపిఐ చెల్లింపుల్లో
# బయోమెట్రిక్ ఫీచర్
## ముఖ గుర్తింపు లేదా వేలిముద్రలతోనే చెల్లింపులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** డిజిటల్ చెల్లింపుల రంగంలో మరో అద్భుతమైన మార్పురాబోతోంది. రేపటి నుంచిబుధవారంనుంచి యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) వినియోగదారులు పిన్ లేదా పాస్‌వర్డ్ నొక్కకుండానే చెల్లింపులు చేసుకోవచ్చు. మీ ముఖం లేదా వేలిముద్ర ద్వారా చేసుకునే ఛాన్సుంది. బయోమెట్రిక్ ఆధారిత గుర్తింపు విధానంతో యూపీఐ చెల్లింపులు ఇకపై మరింత సులభం కానున్నాయి. ఇప్పటివరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేయడానికి మనం నాలుగు లేదా ఆరు అంకెల పిన్‌ను ఎంటర్ చేయాల్సి వస్తుంది. కానీ ఇకపై ఆ పిన్ అవసరం లేదు. భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ ఆధారంగా నమోదైన మీ బయోమెట్రిక్ డేటా (ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర) ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ సాంకేతికత మీ గుర్తింపును త్వరగా ధృవీకరించి, సురక్షితంగా లావాదేవీలను పూర్తి చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల డిజిటల్ చెల్లింపులకోసం పిన్‌తో పాటు ఇతర గుర్తింపు పద్ధతులను అనుమతించింది. దీనిలో భాగంగా బయోమెట్రిక్ ఆధారిత ధృవీకరణ విధానం అమల్లోకి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ యూపీఐ చెల్లింపులను మరింత వేగవంతం చేయడమే కాకుండా, వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తుంది. పిన్‌ను గుర్తుంచుకోవడం లేదా టైప్ చేయడం వంటి ఇబ్బందులు ఇక ఉండవు. మీరు యూపీఐ యాప్ ద్వారా చెల్లింపు చేయాలనుకున్నప్పుడు, పిన్ ఎంటర్ చేయడానికి బదులు మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా ద్వారా ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర స్కానర్ ద్వారా ధృవీకరణ చేయాలి. ఈ డేటా ఆధార్ డేటాబేస్‌తో సరిపోల్చబడి, క్షణాల్లోనే మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ వేగవంతం కావడమే కాదు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ డేటా కారణంగా సురక్షితంగా ఉంటుంది. ఈబయోమెట్రిక్ ఫీచర్ ప్రతిఒక్కరికీ ఉపయోగపడుతుంది. ప్రధానంగా టెక్నాలజీ పెద్దగా పరిచయంలేనివారు, పిన్‌ను గుర్తుంచుకోవడంలో ఇబ్బంది పడేవారికి ఇది సౌలభ్యంగా ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14